www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 23 పుటలు : 52

జాగృతి

కలి 5126- శ్రీ క్రోధి చైత్ర శుద్ధ సప్తమి
15-21 ఏప్రిల్ 2024
వెల : ₹20/-

ఊరూరా రాముడు.. రామాలయాలు..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



శ్రీ క్రోధి నామ సంవత్సర..
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
ఫిర్ ఏక్‌బార్ మోది సర్కార్
అబ్ కి బార్ చార్ సౌ పార్
కమలం పువ్వు గుర్తుకే ఓటేద్దాం!
నియోజకవర్గ
అభివృద్ధికి పాటుపడుదాం...!
పోలింగ్ తేది
13-05-2024
ఈటల రాజేందర్
మల్కాజగిరి లోక్‌సభ నియోజకవర్గ
బీజేపీ అభ్యర్థి


అయోధ్యలో భవ్యమైన రామ మందిరం
నిర్మాణమైన తరువాత
తొలిసారి శ్రీరామ నవమి
ఉత్సవం జరుపుకుంటున్న సందర్భంగా
ప్రజలకు శుభాకాంక్షలు..
75 సంవత్సరాలుగా వెలువడుతున్న
'జాగృతి' జాతీయ వారపత్రికకు,
పాఠకులకు...
శ్రీ క్రోధి నామ సంవత్సర..
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి
జాతీయ కార్యవర్గ సభ్యులు,
భారతీయ జనతా పార్టీ

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి	అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్	9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust,
920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

భారత స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన ఏ చారిత్రక వాస్తవాన్న యినా కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా హుందాగా అంగీకరించిందా? లేదా, కాంగ్రెస్ మార్కు చరిత్ర నిగ్గు తేలిన, సత్యనిష్ఠతో నమోదైన నిజమని తేలిందా? ఏ సత్యాన్ని అయినా అది చరిత్ర పుస్తకంలోకి చేరనిచ్చిందా? జనంలోకి వెళ్లనిచ్చిందా? సకల సదుపాయాల ఆగాఖాన్ భవన్‌లో నిర్బంధాలూ, హౌస్ అరెస్టులూ తప్ప తెలియని ఆ సంస్థ నేతలు కాలాపానీలో ఘోరమైన శిక్షలు అనుభవించి జీవితాలను దేశం కోసం అర్పించిన ధన్యులను గౌరవించే సంస్కారం ఏనాడూ చూపలేదు. స్వాతంత్ర్యం కోసం ఉరికంబాలను ఎక్కిన వారిని స్మరించుకోవాలని ఏ క్షణంలోనూ భావించలేదు. కాంగ్రెస్ దృష్టిలో స్వాతంత్ర్య సమరంలోని ఏ ఘట్టమైనా నెహ్రూ కుటుంబం చుట్టూ తిరిగినదిగానే నమోదు కావాలి. స్వతంత్ర భారత చరిత్ర అయితే నెహ్రూ-గాంధీ కుటుంబం చుట్టూ పరిభ్రమించాలి. కాబట్టి, 'వాస్తవంగా చెప్పాలంటే భారతావని తొలి ప్రధాని నేతాజీ సుభాస్ చంద్రబోస్' అని దేశంలో ఎవరైనా అంటే కాంగ్రెస్ పార్టీ ఎందుకు సహిస్తుంది? ఎలా భరిస్తుంది? ఇప్పుడు ఆ పార్టీ, దానితో పాటు వామపక్షం, ఉదారవాదం కలసి రోడ్డెక్కి పెడుతున్న శోకాలు అందుకు సంబంధించినవే.

ప్రఖ్యాత నటి, మండీ (హిమాచల్ ప్రదేశ్) లోక్‌సభ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ పడుతున్న కంగనా రనౌత్ ఒక చర్చలో ప్రస్తావించిన విషయమిది. ఈ దేశానికి తొలి ప్రధాని నేతాజీయేనని తాను ఒక వ్యాసంలో చదివానని ఆమె అన్నారు. అంతే, తల్లి కుక్క మొరిగితే పిల్ల కుక్కలన్నీ ఆలస్యం లేకుండా అందుకున్నట్టు కాంగ్రెస్ బాకాలు, ఉదారవాదులు, పాఠాలు మొదలుపెట్టారు.

ఇక్కడ రెండు విషయాలు చెప్పుకోవాలి. బోస్ భారత తొలి ప్రధాని అంటూ వ్యాఖ్యానించిన కంగన గురించి కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీప్రియా శ్రీనేతే ఒక స్త్రీ అయి ఉండి అత్యంత నీచంగా మాట జారారు. అప్పుడు కనీసం ఖండించడానికి నోరు రాని బధిరులు ఇప్పుడు మాత్రం కంగనను విమర్శించడానికి ఉరకలేస్తున్నారు. అలాగే కమ్యూనిస్టులనే ఒక నీచ జాతి

శాలివాహన 1946 శ్రీ క్రోధి చైత్ర శుద్ధ సప్తమి

లోపలి పేజీలలో...

ముఖపత్ర కథనం
ఊరూరా రాముడు..
రామాలయాలు...
6లో

కొత్త ధారావాహిక నవల
జన్మ
– సంబరాజు లీల (లట్టుపల్లి)

26లో

జాతీయం
పీకల్లోతు కష్టాల్లో కవిత
32లో

జాగృతి

సంపాదకీయం

బోస్‌ను పలకడానికి కూడా వీలుకాని రీతిలో నిన్న మొన్నటి దాకా దూషించింది. ఆ ఘోర దూషణ మీద ఏనాడూ నోరు మెదపని బోస్ 'వారసులు' ఇప్పుడు మాత్రం కంగన వ్యాఖ్యలను 'సరి దిద్దే' పనికి సిగ్గు లేకుండా సిద్ధమైపోయారు. నేతాజీ 1943లో ప్రవాస ప్రభుత్వం ఏర్పాటు చేసినా, తాను ప్రధానిని అని ప్రకటించుకోలేదట. ఇది బోస్ వారసుడి దిద్దుబాటు వ్యాఖ్య. ఈ దేశ చరిత్ర, నాగరికతలను సర్వ భ్రష్టం చేసిన నెహ్రూను కాపాడడానికి బోస్ గొప్పతనాన్ని ఇంకా ఇంకా దిగజార్చాలా వీళ్లంతా? సుభాషిణి అలీ అనే సీపీఎం నాయకురాలైతే బోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ తాత్కాలిక ప్రభుత్వానికి నాయకుడు తప్ప, స్వతంత్ర

మొదటి ప్రధాని నేతాజీ

భారత ప్రభుత్వానికి కాదని కంగన గుర్తించాలని దిక్కుమాలిన వాదన తెచ్చారు. ఆ మధ్య మణిపూర్ స్త్రీల నగ్న ఊరేగింపు నేరాన్ని స్వయంసేవకుల మీదకు నెట్టే ప్రయత్నంలో బొక్క బోర్లాపడి, క్షమాపణలు చెప్పి చెంపలు వేసుకున్న వామపక్ష జ్ఞాని ఈవిడే. మేధాశక్తి మీద గుత్తాధిపత్యం ప్రకటించుకునే కమ్యూనిస్టులు ఇలాంటి నేతలను ఎలా భరించారో అర్థమే కాదు. అసలు, స్వతంత్ర భారతదేశంలో కూడా నెహ్రూను మొదట ప్రధాని అనలేదు. కార్యదర్శి అన్నారు. ప్రావిన్సెస్ ప్రభుత్వాధిపతులను కూడా ప్రధాని అనే పిలిచారు. బీఆర్ఎస్ ఇంకా చచ్చిపోలేదని గుర్తు చేయడానికి కాబోలు, దాని యువరాజు కేటీఆర్ కూడా కంగన వ్యాఖ్యలని తప్పు పట్టారట. ఇలాంటి జ్ఞానగుళికలని చానెళ్ల ద్వారా కంగన ఇంకొన్ని వెదజల్లితే తరిస్తామని శివసేన (ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది హద్దులు లేని అజ్ఞానాన్ని ప్రదర్శించారు. అయితే బోస్ జీవితచరిత్ర రాసిన చంద్రచూర్ ఘోష్, అసలు మీకు బోస్ ప్రవాస ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలియనట్టే ఉందని చెంప చెళ్లుమనిపించారు. బోస్ ప్రవాస ప్రభుత్వం ఏర్పాటు చేయడం నిజం, బ్రిటిష్ వ్యతిరేకులే కావచ్చు, 9 దేశాలు దానిని గుర్తించిన మాటా నిజం. పెద్దల సభలో చెలరేగిపోయే ప్రియాంక చతుర్వేదీలు కుళ్లు రాజకీయ వ్యాఖ్యలలో మునిగి తేలే కంటే కొద్దిగా జ్ఞాన సముపార్జన వైపు మళ్లితే మంచిది. లేకపోతే నోరు మూసుకుని కూర్చుంటే మంచిది. ఆ విధంగా అయినా పెద్దల సభ గౌరవం కాపాడినవారు కాగలరు. ఇక ఇర్ఫాన్ హబీబ్ అనే దగాకోరు, మతోన్మాద చరిత్రకారుడి వ్యాఖ్య (బహుశా గతంలోనిది) మరీ దారుణం. నెహ్రూకి సరే, బోస్‌కి ప్రథమ ప్రధాని గౌరవం అసలే దక్కకూడదన్న దుగ్ధ కాబోలు, నిజంగా అయితే భారత తొలి ప్రవాస ప్రభుత్వం 1915 ఏర్పడిందంటారాయన. రాజా మహేంద్ర ప్రతాప్ కాబూల్‌లో ప్రవాస భారత ప్రభుత్వం ఏర్పాటు చేశాడనీ, దానికి ప్రధాని మౌల్వీ బర్కతుల్లా అనీ హబీబ్ ఉవాచ. ఆ ప్రవాస ప్రభుత్వం కాగితాలకే పరిమితమైన సంగతి అని హబీబ్ తెలుసుకుంటే మంచిదని బోస్ చరిత్ర రచయితలలో మరొకరు అంజు ధర్ ఘాటుగానే సమాధానం ఇచ్చారు. ప్రవాస ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు అక్టోబర్ 21, 1943న బోస్ ప్రకటించారు. సింగపూర్‌లో ప్రవాస ప్రభుత్వం ఏర్పడింది. పని చేసింది. కరెన్సీ తెచ్చింది. బ్యాంక్‌ను ఏర్పాటు చేసింది.

ప్రవాస ప్రభుత్వాలు ప్రపంచ చరిత్రలో భాగం. మొదటి ప్రపంచ యుద్ధం వేళ బెల్జియం, చైనా కోసం డిసెంబర్ 7,1949న, ఆఖరికి 2011లో సిరియా కోసం ప్రవాస ప్రభుత్వాలు ఏర్పడినాయి. ఇలాంటివే ఇంకా ఎన్నో! విదేశీయులతో యుద్ధాలు, అంతర్యుద్ధాలు, తిరుగుబాట్లు సమయంలో ఇవి ఏర్పాటవుతూ ఉంటాయి. తన వ్యాఖ్యతో చెలరేగిన దుమారానికి కంగన ఇచ్చిన సమాధానమే ఈ సంపాదకీయానికి మంచి ముగింపు. 'ఈ వ్యాఖ్య భారత మొదటి ప్రధాని ఎవరు అన్న అంశం మీద దేశంలో బోలెడంత చర్చకు అవకాశం ఇచ్చింది. సంతోషం.' ★

15 ఏప్రిల్ 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్

38లో

కథ

జ్ఞాపకాల జాడలు

– కన్నెగంటి అనసూయ

ధరహాసం

పిబరే రామరసం (పుస్తక సమీక్ష)	–	23
సామివంటే నువ్వేలే రామయ తండ్రి! (ధర్మోరక్షతి)	–	24
ఉత్తమ వ్యక్తిత్వానికి స్ఫూర్తి రామచంద్రుడు (ఆదర్శం)	–	29
నవ్విపోదురు గాక.. మాకేటి సిగ్గు! (తెలంగాణ)	–	30
'ది ఫ్యామిలీ స్టార్' మెరుపులు మృగ్యం! (సినిమా)	–	36
ప్రపంచ బ్యాడ్మింటన్‌లో భారత్ జోడీ హవా (క్రీడ)	–	37
బాలజాగృతి	–	46
వారఫలాలు	–	48

శ్రీరాముడు కేవల పురాణ పురుషుడు కాదు. కావ్య నాయకుడూ కాదు. భారతీయ నాగరికతా చరిత్రకు ఆయన శ్రీకారం. దాశరథి భారతీయులకు మాత్రమే కాదు.. హిందువులకు మాత్రమే కాదు, ప్రపంచ మానవాళికే దేవుడు అంటున్నప్పుడు, భారతదేశ ఉత్తర దక్షిణ ప్రాంతాలతో ఆయన బంధం గురించి వేరే తర్కించాలా? హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు ప్రతి మట్టి రేణువు రాముడి గురించి విన్నదే. పలికినదే, స్పర్శతో పరవశించినదే. మనుషులకి, పక్షులకి, ఊళ్లకి, ఫలాలకి, కొండలకి, గుహలకి, వాగులూ వంకలకి, జలాశయాలకి రాముడి పేరే పెట్టుకున్న సంస్కృతి ఇక్కడ. అంతా రామమయమే. భారతీయ జీవనంలోని ఏకాత్మను దర్శింపచేసేవాడు రామచంద్రుడు. ఈ నేలలోని, ఈ జాతిలోని ఏకాత్మతకు ఆయన ఆద్యుడు. సమైక్యతకు స్ఫూర్తిప్రదాత.

ఊరూరా రాముడు..

అయోధ్యలో రామమందిర నిర్మాణంతో, బాలక్‌రామ్‌ ప్రాణప్రతిష్ఠతో ప్రపంచ దేశాలే రామతత్త్వం వైపు చూశాయి. అయోధ్య ప్రాణప్రతిష్ఠ అంటే భారతీయ నాగరికతకు ఊపిరి పోయడమేనని చెప్పుకుంటున్నా, అది కొంచెం పెద్ద మాట. విశ్వం యావత్తు విస్మరించలేని ఆ మహోన్నత నాగరికత విలువలను స్మరించుకుని ఒక జాతిగా వర్తమానం తరం కొత్త జీవితాలను ప్రారంభించడానికి జరిగిన ప్రయత్నమది. ఆ నాగరికతకు ఆత్మ శ్రీరామ చంద్రుడు. కాబట్టే అయోధ్య సహా, దేశంలో ఎక్కడ నిర్మించిన ఆలయమైనా సున్నం, ఇటుకలు, విగ్రహాలు కాదు. ఈ జాతి ఐక్యతను ఎలుగెత్తి చాటేవే. ఆయన మూర్తీభవించిన ధర్మం. రామ రాజ్యం నేటికీ ఆదర్శపాలనకు కొండగుర్తు. ఆయన నడయాడిన కాలమంటే ధర్మం నాలుగు పాదాల మీద నిలిచిన కాలం. ఆయన కథానాయకుడిగా వెలువడిన మహాకావ్యం శ్రీమద్రామాయణానికి అందుకే అంత ఆదరణ. ప్రపంచంలోని ఎన్నో భాషలలో ఆ కావ్యం వినిపిస్తుంది. ప్రతి భారతీయ భాషలోను దర్శనమిస్తుంది. వందలాది అనువాదాలు.

సంస్కృతంలో వాల్మీకి రామాయణం అవతరించిన తరువాత మన సువిశాల దేశంలో ప్రతి ప్రాంతం తన భాషలోకి రాముడిని తీసుకు వెళ్లింది. పూజించుకుంది. ఆయన వేల సంవత్సరాలుగా భారతదేశ ఆరాధ్యదైవం. అందుకు సాహిత్య ఆధారాలతో పాటు పురావస్తు ఆధారాలు సాక్ష్యం పలుకుతూనే ఉన్నాయి. వాల్మీకి మహర్షి రామచంద్రప్రభువుకు సమకాలికుడంటాయి తొలినాటి రామకథా గ్రంథాలు. అయోధ్యకు దాదాపు 110 మైళ్ల దూరంలోనే ఉన్న బిథూర్‌లోనే వాల్మీకి ఆశ్రమం ఉండేదని చాలామంది విశ్వాసం. అక్కడే లవకుశులు జన్మించారని కథనం. ఆ పుణ్యస్థలం పవిత్ర గంగకు పశ్చిమ ఒడ్డును ఉంది.

కశ్మీర పండితుడు, భారతదేశం విశ్వానికి అందించిన చరిత్రకారుడు, చరిత్ర తత్త్వవేత్త కల్హణుడు. ఇక్కడ 12వ శతాబ్దానికి ముందే రామకథా గానం అనే సంప్రదాయం ఉందని రాశారు, తన ‘రాజతరంగిణి’ గ్రంథంలో. శ్రీరామచంద్రునిలోనివే కాదు, రావణబ్రహ్మలోని ఆధ్యాత్మిక అంశాలను

రామాలయాలు...

సట్లెజ్ తీరంలో విశ్లేషించిన ఘనత దక్కించుకున్నవారు సిక్కుల పదవ గురువు గోవింద్ సింగ్. గుజరాత్‌లోని వాలభి ప్రాంతం వారైన భర్తృహరి తన రావణవధ కావ్యంలో (భత్తికావ్య) రామావతారం ఘనతను వర్ణించారు. గుజరాత్‌లో 14వ శతాబ్దంలోనే మొదటిసారి రామకథను వర్ణించుకున్నట్టు ఆధారాలు ఉన్నాయి.

వీరికంటే ముందే దక్షిణాదివారు రాముడిని ఆరాధించడం ఆరంభించారు. తమిళదేశంలో అళ్వార్లు, నాయనార్లు చేసిన కృషితో 7,8 శతాబ్దాలలోనే రాముడి మహిమాన్విత జీవితం, దివ్య సందేశం బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇందుకు ఆద్యుడు కులశేఖర్ ఆళ్వార్ అని చరిత్ర చెబుతోంది. 9-12 శతాబ్దాల నడుమ ఎప్పుడో వెలువడిన కంబ రామాయణంలో ఉత్తర రామాయణ గాథ ఉంది. సంస్కృతం నుంచి ఒక భారతీయ భాషలోకి రామాయణం వెళ్లడం దీనితోనే మొదలయింది. తెలుగు, మలయాళ భాషలలోను, ఆగ్నేయ ఆసియాలోని దేశాల భాషలలోకి తరువాత ఈ కావ్యం వెళ్లింది. గోన బుద్ధారెడ్డి, మొల్ల తెలుగులో రామాయణం రాశారు. రామచరితం, ఆధ్యాత్మ రామాయణం మలయాళంలో వెలువడిన రామకథలు. మధ్యయుగాలలో జైనులు కూడా తమవైన విశ్వాసాలను జోడించుకుని రామాయణం రాశారు. కన్నడలో పంప రామాయణం ఎంతో ప్రసిద్ధి. దీనినే రామచరిత్ర పురాణ అని పిలుస్తారు. రాసినవారు నాగచంద్ర.



అస్సామీ కవి మాధవ్ కందాలి(సప్తకాండ రామాయణ/14శతాబ్దం), వంగ భాషలో కృత్తివాస ఓజా కృత్తివాస రామాయణం రాశారు. 15వ శతాబ్దంలో వచ్చిన ఈ కావ్యానికే శ్రీరామపాంచాలి అని మరొకపేరు. 16వ శతాబ్దంలో ఒడియాలో ఇద్దరు కవులు రామాయణం రాశారు. వాల్మీకి రామాయణం పేరుతో సరళాదాస్, దండి రామాయణ లేదా జగమోహన రామాయణ పేరుతో బలరామ్ దాస్ వాటిని రాశారు. 16వ శతాబ్దంలో మరాఠీ కవి సంత్ ఏక్‌నాథ్ భవర్త రామాయణ్ పేరుతో రాశారు. ఇక ఇప్పటికీ భారతదేశమంతటా వినిపించే రామచరిత మానస్‌ను తులసీదాస్ అవధీ భాషలో 16వ శతాబ్దంలోనే రాశారు. రామచరిత మానస్‌కు భారతదేశంలోనే కాదు, పాశ్చాత్య దేశాలలోను విశేష ఆదరణ ఉన్నది. ఈ గ్రంథాన్ని బైబిల్ కంటే ఎక్కువగా ఆరాధించే వారు ఉన్నారనీ, దూర విద్యావిధానం ద్వారా ఈ కావ్యాన్ని చదువుకుంటున్నారనీ బ్రిటిష్ పురాతన భాషల అధ్యయనకర్త రాల్ఫ్ థామస్ హచ్కిన్ గ్రిఫిత్ చెప్పారు. వేదాలను ఆంగ్లంలోకి అనువదించినవారు ఈయనే. థాయ్‌లాండ్, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మయన్మార్, నేపాల్ దేశాలలో రామకథకు ఆదరణ ఉంది. సింగపూర్, మలేసియా, వియత్నాం దేశాల జీవనం మీద ఆ గాథ ప్రభావం ఇప్పటికీ ఉంది.

రాముడు కల్పితమని అత్యున్నత న్యాయ స్థానంలో దబాయించడం భారత నాగరికతను అవమానించడమే. రామసేతును తొలగించాలని అనుకోవడం అంటే ఆ నాగరికత మీద వేటుకు సిద్ధం కావడమే. ఎక్కడ రామ మందిర నిర్మాణానికి అడ్డంకులు కల్పించినా, అడ్డుకున్నా అది దేశ ఐక్యతకు విఘాతం కలిగించే దుర్బుద్ధే. ఇదే అయోధ్య కొత్త మందిరం ఇస్తున్న సందేశం. రాముడు ఒక సాత్వికశక్తి. మనసులు గెలిచే ఉద్దేశంతో చేసే దండయాత్రకు చోదకశక్తి. ఇవాళ్టి కేంద్ర ప్రభుత్వం ఈ సాత్విక శక్తితోనే భారత్‌ను విశ్వగురువు స్థానానికి తీసుకువెళుతున్నది. కాబట్టే రాముడికీ, ఈ మట్టికీ ఉన్న బంధాన్ని నిరంతరం గుర్తు చేసుకోవడం మన కర్తవ్యం. భారతీయ నాగరికతతో మన అనుబంధాన్ని వ్యక్తం చేసుకునే మార్గమూ అదే. అయోధ్యలో భవ్యమందిరంతో ఇంత కదలిక వచ్చింది. కశ్మీరం నుంచి రామేశ్వరం వరకు ఉన్న దివ్య రామ మందిరాల గురించి చదివితే మన నాగరికత మీద, మన చరిత్ర మీద, వీటికి కేంద్ర బిందువైన మన జీవన విధానం మీద రాముడి ముద్ర ఎంతటిదో తెలుస్తుంది. రామాయణం దానిని ఎలా మలిచిందో అర్థమవుతుంది. ఈ శ్రీరామనవమి సందర్భంగా భారత సమైక్యతకు స్ఫూర్తిని ఇస్తూ దేశమంతా, వివిధ కాలాలలో నిర్మించిన ఆలయాల గురించి తెలుసుకుందాం.

రఘునాథ్ దేవాలయం, జమ్ము (జమ్ముకశ్మీర్)

ఇది ఏడు ఆలయాల ప్రాంగణం. దేని ప్రత్యేకత దానిదే. 1835-1860 మధ్య వీటి నిర్మాణం జరిగింది. కశ్మీర్ చరిత్రలో ప్రముఖ స్థానం ఉన్న మహారాజా గులాబ్ సింగ్ ఆయన కుమారుడు మహారాజా రణ్‌బీర్ సింగ్ ఈ ఆలయాన్ని నిర్మించారు. సరిగ్గా ప్రాంగణం మధ్యలో ఉండే గొప్ప ఆలయమే రాములవారిది. ఇదొక శిల్పాకళా అద్భుతం కూడా. గర్భగుడి, మిగిలిన ప్రదేశాలలోను రామకథలతో కూడిన చిత్రాలు, శిల్పాలు విరివిగా ఉంటాయి. మిగిలిన ఆలయాలు కూడా కంటికి ఇంపుగా ఉంటాయి. ప్రకృతి అందాల మధ్య ఉన్న ఈ కళావేదిక భక్తులను ఎక్కువగా ఆకర్షిస్తుంది.

శ్రీరామతీర్థం, అమృత్‌సర్ (పంజాబ్)

నిజానికి వాల్మీకి మహర్షి ఆశ్రమం ఇక్కడే ఉండేదని, ఆ స్థలంలో నిర్మించినదే ఈ రామాలయమని చెబుతారు. అంటే లవకుశులు జన్మించిన స్థలమని స్థానికుల నమ్మకం. దీనినే భగవాన్ వాల్మీకి తీర్థస్థల్ అని కూడా పిలుస్తారు. సీతాసమేతుడై రాములవారు కొలువున్నారు. ఆలయం నిండా రామాయణ గాథలతో చిత్రపటాలు ఉంటాయి.ఏటా దీపావళికే ఇక్కడ ఉత్సవం నిర్వహిస్తారు.



రామచంద్రాలయం, హరిపూర్ (హిమాచల్‌ప్రదేశ్)

చిన్న కాశీగా ఈ క్షేత్రానికి పేరు ఉంది. ఇక్కడ ఒక్కచోటే 18 పురాతన దేవాలయాలు ఉన్నాయి. ఇందులోనే ఉంది రామచంద్రాలయం. ఇది 900 సంవత్సరాల క్రితం నిర్మించారు. అందుకే బాగా శిథిలావస్థకు చేరుకుంది. సీత, లక్ష్మణ సమేతుడై ఇక్కడ రాముడు ఉన్నాడు. లోపల శిల్పాలు, చిత్రపటాలు ఉన్నాయి. కాంగ్డా జిల్లాలోని దెహ్రా సబ్‌డివిజన్‌లో ఈ ఊరు ఉంది. సంసార్‌చంద్ర, ఆయన కుమారుడు హరీశ్‌చంద్ర ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. కాంగ్డా వంశీకులైన ఈ ఇద్దరు పాలించిన కొండరాజ్యం నందపూర్–గులేర్‌లోనే హరిపూర్ ఉంది. ఆలయం కూడా కొండ సంప్రదాయక శిల్పకళతో నిర్మించారు.

రఘునాథ ఆలయం, దేవ ప్రయాగ, (ఉత్తరాఖండ్)

రావణుడిని హరించిన అనంతరం, ఈ ప్రదేశంలో శ్రీరాముడు తపస్సు చేసినట్టు ప్రజల విశ్వాసం. ఆ నమ్మకంతో దర్శించే ఆలయం దేవ ప్రయాగలోని రఘునాథ ఆలయం. ఇక్కడి ప్రకృతి సౌందర్యం, ప్రశాంతత, నిర్మలవాతావరణం ఆధ్యాత్మిక సాధన చేసేవారికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. అలకనంద, భాగీరథి నదుల సంగమం సమీపంలో దేవప్రయాగలో నిర్మించిన ఈ ఆలయం విష్ణువుకు అంకితం చేసిందే అయినా, ప్రజల విశ్వాసాల కారణంగా విష్ణువు అవతారంగా భావించే శ్రీరాముడు, సీతా మాతే ఇక్కడ పూజలు అందుకుంటారు. తెహ్రీగఢ్వాల్‌లోని దేవ ప్రయాగలో ఉన్న ఈ ఆలయాన్ని ఆరు నుంచి తొమ్మిదవ శతాబ్దం మధ్య జన్మించినట్టు తెలుస్తోంది.

రామచంద్ర ఆలయం, జైపూర్ (రాజస్థాన్)

శ్రీరాముడు పధ్నాలుగేళ్ల వనవసాన్ని ముగించుకొని, తిరిగి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఉత్తర భారతదేశంలో ఘనంగా ఉత్సవాలు జరుపుతారు. అయోధ్యలో ఇప్పుడు భారీ స్థాయిలో దీపోత్సవాన్ని మనం చూస్తున్నప్పటికీ, దేశంలోని వివిధ ప్రాంతాలలో కూడా ఈ సందర్భాన్ని ఘనంగా నిర్వహిస్తారు. రాజస్థాన్ రాజధాని జైపూర్ నగరంలో రామచంద్రుడికి అంకితం చేసిన ఏకైక ఆలయం శ్రీరామ చంద్ర మందిరమే. ఈ ఆలయం అంత పురాతనమైందేమీ కాదు. దీని వయసు రెండువందల ఏళ్లలోపే! జైపూర్ మహారాణి మాజీ సాహిబా సవాయ్ రామ్ సింగ్ 2 పాలనా కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు తెలుస్తుంది. ఈ ఆలయాన్ని గుడిలా కాకుండా ఒక కోటశైలిలో నిర్మించారు. ఆలయంలోకి అడుగుపెట్టగానే ఎవరికైనా వచ్చే భావన ఏదో అంతఃపురంలోకి వచ్చి ఉంటామనే. ఆలయం మొత్తం కళాత్మకంగా చెక్కిన శిల్పాలు, పెయింటింగ్‌లతో వర్ణమయంగా సుందరంగా ఉంటుంది. ఇక్కడి గోడలపై సన్నివేశాలు అనేకం రామాయణం నుంచి తీసుకున్నవే కనిపిస్తాయి. ఇందులో ప్రముఖంగా మనకు కనిపించేది 14 ఏళ్ల వనవసాన్ని ముగించుకుని శ్రీరాముడు అయోధ్య రాజ్యానికి తిరిగి వస్తున్న దృశ్యం. ఆలయ గర్భగుడిలో కూడా పైకప్పు, గోడల మీద కూడా కళాత్మకమైన చిత్రాలు కనిపిస్తాయి.

ఒంటిమిట్ట, కడప జిల్లా

(ఆంధ్రప్రదేశ్)

తండ్రి మాటకోసం శ్రీరామచంద్రమూర్తి సీతాదేవి, లక్ష్మణునితో కలసి దండకారణ్యానికి బయలుదేరాడు. దారిలో రుష్యాశ్రమాలు దర్శించాడని రామాయణం చెబుతుంది. ఆ ముగ్గురి పాద స్పర్శతో పవిత్రమైనదే ఒంటిమిట్ట. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉంది. ఇక్కడ వెలసిన రాముడిని కోదండరాముడని అంటారు. ఈ ఆలయం భారతదేశంలోనే అత్యంత కళాత్మక కట్టడమని ఫ్రెంచ్ పర్యాటకుడు జీన్ బాప్టిస్టె టామెమిర్ వ్యాఖ్యానించాడు. అది అతిశయోక్తి కాదు. నిజంగానే ఉలి చేసిన అద్భుతమిది. ఏకశిలా నగరమని కూడా ఖ్యాతి ఉంది. రామతీర్థం పేరుతో ఒక కొలను ఉంది. పోతనామాత్యుడు ఇక్కడ భాగవతం రాశాడని ప్రతీతి.

శ్రీరామచంద్రమూర్తి సీతాదేవి, లక్ష్మణునితో కలసి వచ్చినప్పుడు అక్కడే తపస్సు చేసుకుంటున్న రుషులు శ్రీరాముని ప్రార్థించారు. మహానుభావా! ఇక్కడ రాక్షసబాధ సహింపరాకున్నది. నీవిక్కడే ఉంటే మేము నిర్విఘ్నంగా తపస్సులు గావిస్తూ, సర్వదాన, జప, తపో అనుష్ఠానాదుల ఫలితమైన నీ దివ్య మంగళ విగ్రహం దర్శించుకుంటూ జన్మ సాఫల్యం చేసుకుంటాం అన్నారు. అందుకు రాముడు, 'మహానుభావులారా! నేను చేయవలసిన కార్యాలు చాలా ఉన్నాయి. అయినా మీ శరణాగతి వ్యర్థం కాదు. హేమాద్రి మీద ఉన్న 'యొండుశిల'ను చూడవలసింద'ని చెప్పాడు. రుషులు అక్కడికి వెళ్లి చూశారు. ఆ ఏకశిలయే శ్రీ సీతారామలక్ష్మణ మూర్తుల రూపంలో కనిపించింది. ఆనాడు మొదలు యధావిధి ఆ ప్రతిమలను రుషులు పూజించడం ఆరంభించారు. ఇక్కడ దేవాలయాన్ని పునర్నిర్మాణం చేసిన రాజు "వసుమంతుడు". వేల సంవత్సరాల క్రితం ఆ రాజు కట్టించిన దేవాలయమే ఇప్పుడు సీతారామలక్ష్మణులున్న గర్భగృహం. చరిత్రను బట్టి చోళరాజులు, విజయనగర ప్రభువులు ఆదరించారు. తళ్లికోట యుద్ధంలో విజయనగర ప్రభుత్వం కూలిన తరువాత మట్లె ప్రభువుల స్వాధీనమయింది. తరువాతి కాలాలలో శ్రీవాసుదాస స్వామి ఒంటిమిట్ట కోదండరామ దేవాలయ పునరుద్ధరణకై ఎంతో కృషిచేశారు. దేశాటనం చేసి మిత్రుల సహకారంతో సీతాకల్యాణం, పట్టాభిషేకం వంటి ఎన్నో కార్యాలను నిర్విఘ్నంగా చేయించారు. ఆయన సేవ ఎంతో గొప్పది.

రామతీర్థం, విజయనగరం జిల్లా (ఆంధ్రప్రదేశ్)

ఇది మూడో శతాబ్దం నాటిదని చరిత్రకారులు అంచనా వేశారు. ఇక్కడి విగ్రహాలు పాండవులు ప్రతిష్ఠించారని, వాటిపై ఉన్న వెండితాపడం వారే చేయించారని కూడా నమ్ముతారు. అంటే తమ వనవాసకాలంలో వారు ఈ దారిన వచ్చారు. ఈ ఆలయం, గ్రామం కూడా కొండల మధ్య ఉంది. ఆలయం ఉన్న ప్రాంతాన్ని బావికొండ అని పిలుస్తారు. నిరంతరం నీళ్లను ఇచ్చే చిన్న చిన్న చెలమలు ఇక్కడ కనిపిస్తూ ఉంటాయి. అందుకే దీనికి రామతీర్థం అని పేరు వచ్చింది. ఇక్కడ కనిపించే తాబేళ్ల మీద విష్ణునామాలు కనిపిస్తాయి. దగ్గరగా చంపా నది పారుతూ ఉంటుంది.

కోదండ రామాలయం గొల్లలమామిడాడ

దక్షిణ భారతదేశంలోనే అందమైన రామాలయాలలో ఒకటిగా తూర్పు గోదావరి జిల్లా, గొల్లల మామిడాడ కోదండ రామాలయానికి పేరు ఉంది. ఇక్కడే సూర్యనారాయణ మూర్తి గుడి కూడా ఉంది. రామాలయాన్ని 1920 కొవ్వూరి బసివిరెడ్డి నిర్మించారు. కాకినాడకు సమీపంలో ఉండే ఈ ఊరినే గోపురాల మామిడాడ అని కూడా పిలుస్తారు. చిన్న భద్రాద్రి అని కూడా పేరుంది.

కాలారామ్ ఆలయం, శబరీ ధామ్ (గుజరాత్)

పేష్వాల కాలంలో నిర్మించిన ఈ ఆలయానికి 600 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడి రాముడు, సీత, లక్ష్మణుడు విగ్రహాలు నల్లని రాతితో చెక్కారు. అందుకే కాలారామ్ అని పిలుస్తారు. ఆలయం కూడా శిల్పకళా వైభవంతో ఉంటుంది. నాసిక్ ఆలయానికి ఇదే పేరు. అయితే అక్కడ రాముడు నిలబడి ఉన్న భంగిమలో ఉంటాడు. ఇక్కడ కూర్చున్న భంగిమలో ఉంటాడు.

రామాయణంతో అనుబంధం కలిగిన స్థలాలు గుజరాత్‌లో చాలా ఉన్నాయి. శబరి ధామ్, పంపా సరస్సు, అంజనీ కుండం, రామేశ్వర్, ఉన్నాయ్ అలాంటివే. సుబీర్ అనే గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే శబరి ధామ్ ఉంది. అక్కడ శబరిమాతగా ఆమెను కొలుస్తారు. 2004లోనే ఆ ఆలయం కట్టారు. లోపల శబరి రామలక్ష్మణులకు పళ్లు అందిస్తున్న దృశ్యమే ఉంటుంది. శబరి ధామ్‌కు కొద్దిదూరంలోనే పంపా సరస్సు ఉంది. ఇది పూర్ణా నదీతీరంలోనే ఉంది. దాంగ్ ప్రాంతంలో ఉన్న అంజనీ కుండమే ఆంజనేయుని జన్మస్థలి అని ఇక్కడి వారి విశ్వాసం. ఉన్నాయ్ అని పిలిచే చోటు నవసారి జిల్లాలో ఉంది.

సుబీర్ గ్రామానికి సమీపంలోని శబరీ ధామ్

కాలారామ్ ఆలయం

ఇక్కడ ఉన్న చెలమలలో నీరు వేడిగా ఉంటుంది. ఇక్కడ రాముడు యాగం చేసినప్పుడు రుత్వికుల కోరిక మేరకు తన బాణం వేసి ఈ చెలమలను సృష్టించాడని చెబుతారు. వీటిలోని నీటికి ఔషధీయ గుణాలు ఉన్నాయని చెబుతారు.

కాలారామ్, నాసిక్ (మహారాష్ట్ర)

నాసిక్ గోదావరి పుట్టిన స్థలం. ఇక్కడిదే కాలారామ్ ఆలయం. నల్లరాతితో చెక్కిన ప్రతిమను ప్రతిష్ఠించారు. నాసిక్ నగరంలోనే పంచవటి ప్రాంతంలో ఈ ఆలయం ఉంది. తన అరణ్యవాసంలో రాముడు పంచవటి దగ్గర కొద్దికాలం ఉన్నారని పురాణాలు చెబుతాయి. ఈ స్థలంలో మొదట ఉన్న దారు ఆలయం స్థానంలో 1782లో సర్దార్ రంగారావ్ ఒధేకర్ ఈ భవ్య ఆలయాన్ని నిర్మించాడు. కానీ ఇక్కడ ప్రతిష్ఠించిన రాముడి ప్రతిమ 2000 ఏళ్లనాటిదని చెబుతారు. తురుష్కులు దండెత్తినప్పుడు ఒక పూజారి ఇందులోని విగ్రహం అపవిత్రం కాకుండా గోదావరిలోకి విసిరేశాడని చెబుతారు. ఆయన గోదావరిలో విసిరేసిన విగ్రహాన్ని వెతికితే అది లభ్యమైంది. అదే ప్రతిష్ఠించారు. ఒక పుష్కరకాలం పాటు నిత్యం 2000 మంది శ్రామికులు ఈ నిర్మాణంలో పాల్గొన్నారు. పశ్చిమ భారతంలో ఉన్న అందమైన ఆధునిక ఆలయాలలో దీనికే ప్రథమ స్థానం ఇస్తారు. ఇక్కడ సీతారామ లక్ష్మణుల విగ్రహాలు నల్లరాతితో చెక్కారు. అంతకు ముందు ఆలయం 7 శతాబ్దం నుంచి 11వ శతాబ్దం వరకు పాలించిన రాష్ట్రకూటుల కాలానిది.



తులసీబాగ్ రామ్‌జీ సంస్థాన్, పుణే

(మహారాష్ట్ర)

చరిత్రాత్మక బుధవార్‌పేట్‌లోని తులసీబాగ్‌లోని ఈ రామమందిరం చూడడం ఒక దివ్యానుభవంగా చెబుతారు. ఇక్కడ రాములవారికి తప్పనిసరిగా తులసీదళాలను సమర్పిస్తారు కాబట్టి ఆ పేరు వచ్చింది. ఈ పరిసరాలలో తులసి విరివిగా కనిపిస్తుంది. తులసిబాగ్ అంటేనే తులసివనం. ఈ ఆలయాన్ని రామ్‌జీ సంస్థాన్ అంటారు. ఈ ఆలయం వెనుక ఘనమైన చరిత్ర కనిపిస్తుంది. 1703లో ఔరంగజేబు ఇక్కడ బస చేశాడు. అప్పుడు ఇది జుజుబే తోట.అంటే ఎరుపు లేదా చైనా ఖర్జూరాల తోట. తరువాత ఒకటో పీష్వా మాధవరావు దీనిని అభివృద్ధి చేయించాడు. మూడో పానిపట్టు యుద్ధం తరువాత 1761లో ఇక్కడ పీష్వా కార్యాలయానికి చెందిన నారో అప్పాజీ ఖైర్ తులసీబాగ్ నిర్మాణం ఆరంభించాడు. ఈయన పుణే సుబేదార్. ఎందుకంటే ఆ యుద్ధంలో మరాఠాలు ఓడిపోయారు. దానితో పూర్తి ఆత్మ రక్షణలో పడిపోయిన తన వారిలో ఆత్మ స్థైర్యం నింపడం కోసం ఈ ఆలయ నిర్మాణం చేపట్టాడాయన. 32 ఏళ్ల తరువాత 1795లో పూర్తయింది. అప్పుడే దీనికి అయిన వ్యయం రూ. 1,36, 667. ఈ ఆలయానికి ఉన్న అద్భుతమైన శిఖరం మాత్రం 19వ శతాబ్దంలో కట్టారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఈ ఆలయంలోనే ఉన్న సభామందిరంలో బాలగంగాధర తిలక్, భాలాకర్ భోపట్కర్ వంటివారు ఉపన్యాసాలు ఇచ్చారు.

కోట రామాలయం, రాంటెక్

(మహారాష్ట్ర)

రాంటెక్ పేరు రాముడితో ముడిపడి ఉన్నదే. ఆగస్త్య ఆశ్రమంలో కొద్దికాలం ఉన్న తరువాత రాముడు నివసించిన ప్రదేశం ఇదే. రాంటెక్ అంటే రాముడి ప్రతిజ్ఞ. రాక్షసుల నుంచి అక్కడికి వారికి విముక్తి కలిగిస్తానని రాముడు ప్రతిజ్ఞ చేశాడు. ఇక్కడ కూడా రాముడి పాదుకలు ఉండేవని, చిరకాలం వాటిని సేవించారని చెబుతారు.

రామరాజా, ఊర్ఛా

(మధ్యప్రదేశ్)

భారత భూమిలోని ప్రతి రామాలయానికి ఒక ప్రత్యేక ఉంది. బేత్వా నది ఒడ్డున వెలసిన ఈ రాముడిని ఒక దైవంగా కాదు, ఈ ప్రాంత పరిపాలకునిగా కొలుస్తారు. అందుకే ఇది ఆలయం ఆకృతిలో కాకుండా, కొంత రాజప్రాసాదాన్ని తలపిస్తూ ఉంటుంది. బుందేలీ రాజవంశీకులు పోషించిన శిల్ప శైలితో ఈ మందిరాన్ని నిర్మించారు. బురుజులు, గుమ్మటాలతో ఇది భక్తులను విస్తుగొలుపుతూ ఉంటుంది. నిజానికి అయోధ్యలో దురాక్రమణదారుల దాడుల సమయంలో రాముడి విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించే ఉద్దేశంతో భక్తులు ఈ ఆలయాన్ని నిర్మించారని కూడా చెబుతారు. ఆ మేరకే ఇక్కడ ప్రతిష్ఠ కూడా జరిగిందని ప్రతీతి. ఊర్ఛా అనే ఒక భక్తురాలు అయోధ్య వెళ్లి రాముడిని బాలుని రూపంలోనే ఇక్కడకు తీసుకువచ్చిందని, అయితే తరువాత ఇక్కడ నుంచి రాములవారు వెళ్లడానికి నిరాకరించారని స్థలపురాణం. అప్పటి నుంచి స్థానికులు ఆయనను తమ పాలకునిగా భావించుకుంటున్నారు. ఇక్కడ నిత్యం ఒక ఊరేగింపు ఉంటుంది. అచ్చంగా ఒక హిందూ పరిపాలకుడు బయటకు వచ్చినప్పుడు అనుసరించే సంప్రదాయాలను అనుసరిస్తూ ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయంలో సేవలు కూడా ఒక చక్రవర్తికి చేసే విధంగానే ఉంటాయి. భక్తులు రాములవారికి సైనికుల రీతిలో వందనం చేస్తారు.

శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే
శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
మర్రి శశిధర్ రెడ్డి
జాతీయ కౌన్సిల్ సభ్యులు,
భారతీయ జనతా పార్టీ

శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
రామాయ రామ భద్రాయ
రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ
సీతాయ: పతయే నమ:
వై. కొండల్ రెడ్డి అడ్వకేట్ రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
మా ఆహ్వానాన్ని మన్నించిమా ద్వితీయ కుమారుడు, అక్కిన ప్రగడ భాస్కరరావు,
సూర్యకాంతం (ఉయ్యాలా మామ్మ)గార్ల దత్తత కుమారుడు(రామచంద్రపురం)
చిరంజీవి ప్రసాద్ & చి.ల.సౌ అర్చనల
వివాహానికి విచ్చేసి వధూవరులను ఆశీర్వదించిన బంధువులు, మిత్రులు,
ఆత్మీయ పరివార ప్రముఖులందరికి మా ధన్యవాదములు.
శ్రీమతి & శ్రీ మద్దాలి శ్రీనివాసరావు,
శ్రీమతి & శ్రీ మద్దాలి గోపాలకృష్ణారావు
శ్రీమతి & శ్రీ ద్రోణంరాజు శివానంద శ్రీనివాస్,
శ్రీమతి & శ్రీ నవీన్ రాజ్ పుట్
ఎల్.బి.నగర్, హైదరాబాద్.
వందే భారతమాతరం

చిత్రకూట్ (యూపీ)

అయోధ్య వీడిని సీతారాములు, లక్ష్మణుడు ప్రయాగ చేరుకున్నారు. అక్కడ యమునా నది దాటి చిత్రకూట్ వచ్చారు. అక్కడే అనసూయ ఆశ్రమంలో ఉన్నారు. ఇక్కడ రామ్‌ఘాట్, జానకీకుండం, హనుమాన్‌ఘాట్, గుప్త గోదావరి వంటి ప్రదేశాలు కూడా రామాయణంతో సంబంధం కలిగినవే.

పంచవటి (యూపీ)

అయోధ్య నుంచి అరణ్యవాసానికి బయలు దేరిన రాముడు, సీత, లక్ష్మణుడు చాలా రుష్యా శ్రమాలలో కొద్దికాలం పాటు నివాసం ఉన్నారు. చివరికి నాసిక్ చేరుకున్నారు. అక్కడ అగస్త్య ముని ఆశ్రయంలో కొద్దికాలం ఉన్నారు. ఇక్కడ ఐదు వృక్షాలు ఉండేవి కాబట్టి పంచవటి అని పేరు వచ్చింది. ఇవి రాముడు, సీత, లక్ష్మణుడు నాటినవని చెబుతారు. రావణుడు సీతను అపహరించినది కూడా ఇక్కడే. మారీచుడు చనిపోయిన స్థలం కూడా ఇక్కడ ఉంది. ఇంత ప్రాధాన్యం ఉన్నది కాబట్టే రామాలయం కట్టారు.

బాలక్‌రామ్, అయోధ్య (ఉత్తరప్రదేశ్)

సాంస్కృతిక, ధార్మిక, సామాజిక విలువలు నిర్దేశించిన మేరకు నడుచుకునే భారతీయ సమాజం రామమందిర్‌ను పునర్ నిర్మించుకోవడం అంటే తమవైన ఆ మూలాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించడమేనని జనవరి 22, 2024 నాటి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురించి పాశ్చాత్య పత్రికలు కొన్ని వ్యాఖ్యానించాయి. ఇక్కడ రాములువారు జన్మించారని హిందువుల ప్రగాఢ విశ్వాసం. ఎంత విశ్వాసమంటే, దురాక్రమణదారులు ఆక్రమించిన ఆ నేలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఐదు వందలేళ్లు పోరాడారు. చివరికి మందిరం నిర్మించారు. బాలక్‌రామ్‌ను ప్రతిష్ఠించుకున్నారు. ఈ మందిరం ఇప్పుడు ఒక అద్భుత శిల్ప విన్నాణంగా ప్రపంచం కీర్తిస్తున్నది. భారతీయ సాంస్కృతిక, హిందూ

ధార్మిక కోణం నుంచి ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని ప్రపంచ ప్రజలు భావిస్తున్నారు. ప్రపంచం ఎంత మారిపోయినా, దానితో పాటు భారతదేశం, జీవన విధానం రూపురేఖలు మార్చుకున్నా రాముడిని మాత్రం తమ ఆరాధ్యదైవంగానే ఇక్కడ చూస్తున్నారు. ప్రాణప్రతిష్ఠ, ఆ రోజున ఆ ప్రాంగణంలో వెల్లువెత్తిన ఉద్విగ్నత అదే రుజువు చేశాయి. సాధుసంతులు, విశ్వహిందూ పరిషత్, రామభక్తులు ప్రారంభించిన రామమందిర నిర్మాణ ఉద్యమం భారతీయ జనతా పార్టీ ప్రవేశంతో కొత్త మలుపు తీసుకున్నది. హిందువులు నాడు కరసేవ చేశారు. తరువాత బీదాబిక్కీ, ధనిక మధ్య తరగతి అని లేకుండా అంతా విరాళాలు ఇచ్చారు. ఇవాళ హిందువుల ఆత్మ గౌరవాన్ని ప్రకటించే రమ్యహర్మ్యం అయోధ్య రామమందిరం.

రామ్‌చౌరా మందిర్, హాజీపూర్ (బిహార్)

వైశాలీ జిల్లాలోని హాజీపూర్ పట్టణంలో ఈ ఆలయం ఉంది. రాముడు జనక్‌పురి (ప్రస్తుతం నేపాల్‌లో ఉంది) వెళుతూ ఈ ప్రాంతంలో ఆగాడని చెబుతారు. ఇక్కడ రామ పాదచిహ్నాలు ఉంటాయి. వాటిని భక్తితో పూజిస్తారు. ఇక్కడ నవమి ఘనంగా జరుగుతుంది.

రామరాజతాల, హౌరా (పశ్చిమ బెంగాల్)

పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నగరానికి సమీపంలో ఉన్న ఊరు రామరాజతాల. ఇక్కడ వెలసిన రామాలయం కారణంగానే ఆ పేరు వచ్చింది. ఈ ఆలయానికి మూడు శతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడ ఇప్పటికీ ఏటా మూడు మాసాల రామదీక్ష తీసుకునే సంప్రదాయం కొనసాగుతున్నది. అయోధ్యారామ చౌదురి అనే జమిందారు ఇక్కడ రామపూజలను ఆరంభించాడు. దాని పేరు బారోవరి పూజ. రాముడి ఆదేశం మేరకే తాను ఆ పూజ ఆరంభించనట్టు ఆయన చెప్పేవారు. అది ఎంతో పేర్గాంచి ఆ ఊరికే రామరాజతాల పేరు స్థిర పడింది.

రామచంద్ర ఆలయం, గుప్తిపారా (పశ్చిమ బెంగాల్)

ఇది 18వ శతాబ్దానికి చెందినది. ఈస్టిండియా కంపెనీ కాలం నుంచి ఇక్కడ రాముడికి పూజలు జరుగుతున్నాయి. ఇది టెర్రాకోటా ఆలయం. బంకురా జిల్లాలోని సోనాముఖి గ్రామంలో రామనవమి ఘనంగా జరుపుతారు. ఆ రోజు సంచార తెగ కవి సమ్మేళనం, సంచార గాయకుల కార్యక్రమాలు కూడా జరుగుతాయి. దీనిని జయదేవ కెందౌళి మేళా అని పిలుస్తారు. ఇక్కడిదే చంద్రకోనలోని రఘునాథ మందిరం. చంద్రకోన చిన్న పట్టణం. ఇది చంద్రకేతు అనే పాలకుడు నిర్మించాడు. ఆయనే రఘునాథ్ (రాముడు), మాల్యానాథ్/లాల్‌జీ (కృష్ణుడి ఆలయాలు) కట్టించాడు.

రామసీత మందిర్, కిషన్‌గంజ్ (పశ్చిమ బెంగాల్)

నాడియాలోని కిషన్‌గంజ్‌లో ఈ ఆలయాన్ని 18వ శతాబ్దంలో నిర్మించారు. మేదినీపూర్‌లో కూడా ఇదే పేరుతో పురాతన దేవాలయం ఉంది. తమ్లుక్ రాజులు దీనిని నిర్మించారు. మేదినీపూర్‌లోనే చిరౌలీ అనే చోట కూడా మరొక రామాలయం ఉంది. 1843లో నిర్మించిన ఆలయమిది.

బెంగాల్‌లో శాక్తేయం బలంగా ఉన్నమాట నిజం. అది కూడా హిందూ ఆరాధనా విధానమే. ఎవరూ కాదనరు. అయితే గత కొద్దికాలంగా, అయోధ్య ఉద్యమం నేపథ్యంలో కావచ్చు, పశ్చిమ బెంగాల్‌లో రామనవమి ఉత్సవాలకి జనం విశేష సంఖ్యలో హాజరవుతున్నారు. అక్కడ వైష్ణవం కూడా ఒకప్పుడు పెద్ద ఎత్తున నడిచిందన్న సంగతి మరచి, రాముడి ఆరాధన బీజేపీ-ఆర్ఎస్ఎస్ విస్తరణగా భావించింది మమతా బెనర్జీ. ఒక వెకిలి వ్యాఖ్య చేశారామె. ఉత్తర భారతదేశం నుంచి రాముడిని బీజేపీ వాళ్లు పశ్చిమ బెంగాల్ దిగుమతి చేస్తున్నారన్నదే ఆ వ్యాఖ్య. ఇది ఎంత అబద్ధమో అక్కడి ఆలయాల చరిత్రే చెబుతుంది.

రామమందిరం, భువనేశ్వర్ (ఒడిశా)

కళింగ శిల్పశైలిలో నిర్మించిన అద్భుత ఆలయమిది. భువనేశ్వర్‌లో ఖారవేల్ నగర్‌లో ఉంది. పెద్ద శిఖరంతో, నిండా రామాయణ గాథలు చెప్పే శిల్పాలతో అద్భుతంగా కనిపిస్తుంది. ఇక్కడ సీతాలక్ష్మణ సమేతుడై రాముడు కొలువై ఉంటాడు.

రఘునాథాలయం, ఉదుగావ్ (ఒడిశా)

కళింగ శిల్పంతో నిర్మించిన అద్భుత ఆలయమిది. ఉదుగావ్ గ్రామానికి రాముడు వచ్చాడని ప్రజలు విశ్వసిస్తారు. నయాగఢ్ పాలకుడు మృత్యుంజయ సింగ్ 1763లో దీనిని నిర్మించాడు. అత్రి మహాముని యాగం చేసిన చోటుగా దీనికి పేరుంది. విగ్రహాలు వేప కర్రతో చేస్తారు. శిఖరం మీద ఉండే కలశం బంగారు పూత కలిగినది.

రామాయ రామ భద్రాయ
రామచంద్రాయ వేధసే
రఘునాథాయ నాథాయ
సీతాయ: పతయే నమ:
శ్రీ క్రోధి నామ
సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
AP Jithender Reddy
Spl.Representative & Advisor to Govt.of Telangana
at New Delhi & Advisor (Sports Affairs) to Govt. of Telangana

రామ రామ జయ రాజరామ
రామ రామ జయ సీతారామ
శ్రీరామనవమి
శుభాకాంక్షలతో..
వంగేటి లక్ష్మారెడ్డి
విఎల్ఆర్ బిల్డర్స్ & డెవలపర్స్, బాలాపూర్

భద్రాచలం (తెలంగాణ)

దక్షిణ అయోధ్య భద్రాద్రి కల్యాణ శోభ సంతరించుకుంటోంది. శ్రీరామచంద్రుడు తన భక్తుడు భద్రమహర్షికి దర్శనమిచ్చి ఆయన విన్నపంపై ఇక్కడే కొలువుదీరాడు. ఇతర ఆలయాలలో శ్రీరాముడు రెండు చేతులతో మానవాకారంలో దర్శనమిస్తే, నాలుగు చేతులతో, ఆయుధాలనూ అపసవ్యంగా ధరించి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఆయా ఆలయాలలో శ్రీరాముడు కుడిచేతితో విల్లు, ఎడమచేతితో బాణంతో ఉంటే, భద్రాద్రిలో అందుకు భిన్నంగా ఉంటుంది. కుడిఎడమ చేతులలో ఉండవలసిన చక్రం, శంఖం తారుమారుగా కనిపిస్తాయి. అలాగే సీతామాత ఆయన పక్కన కాకుండా వామాంకాన్ని అధిష్ఠించి ఉంటారు. లక్ష్మణుడు కూడా శ్రీరాముడికి వామభాగంలోనే దర్శనమిస్తాడు.

పోకల దమ్మక్క శ్రీసీతారామచంద్రుడిని ఆరాధించి తరించిందని ఐతిహ్యం. రామదాసుగా చరిత్రకెక్కిన కంచర్ల గోపన్న సర్కార్ నిధులతో ఆలయ ప్రాకారాదులు నిర్మించి, దేవదేవీరులకు ఆభరణాలు చేయించి స్వామి వారి కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేశారు. తన గేయ వాఙ్మయంతో భక్తకోటి హృదయాలలో నిశ్చలభక్తిని పాదుకొల్పారు. ఆయన అనంతరం రామభక్తుడు తూము నరసింహ వరద రామదాసాది భక్తులు ఉత్సవ వైభవాన్ని కొనసాగించారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఏటా మార్గశీర్షంలో ముక్కోటి (వైకుంఠ ఏకాదశి), చైత్రం శుద్ధ నవమి నాడు కల్యోణోత్సవం,మరునాడు పట్టాభిషేకోత్సవం జరుగుతాయి. అభిజిత్ లగ్నంలో జరిగే నవమి నాటి కల్యాణోత్సవంలో స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పిస్తుంది. ఈ ఉత్సవాలకు మన్య ప్రాంతానికి చెందిన కోయ, కొండరెడ్లు, లంబాడీలు తరలివస్తారు. గిరిజనులు శ్రీరామనవమి కల్యాణాన్ని 'దేవుడి పెళ్లి' అని వ్యవహరిస్తారు. ఆ పెళ్లి తరువాత కొన్ని రోజులకు కానీ పెళ్లిళ్లు చేసుకోని ఆచారం కొన్నేళ్ల క్రితం దాకా ఎక్కువగా ఉండేది. రామాయణ ఘట్టాలు తెలుగునేలపై, అందులోనూ భద్రాద్రి పరిసరాల్లో ఎక్కువ చోటుచేసుకున్నట్లు రుజువులు ఉన్నాయి. ఆలయ సమీపంలోని పర్ణశాల ప్రాంతంలో సీతాదేవి స్నానమాడిన ప్రాంతంగా చెప్పే సీతవాగు, ప్రకృతి సిద్ధంగా వేడినీళ్లు లభించే ఉష్ణగుండాలు లాంటివి కనిపిస్తాయి. యాటపాక (జటాయుపాక), రేగుబల్లి (రెక్కపల్లి)ని సీతాపహరణానికి పాల్పడిన రావణుడిని జటాయువు ఎదిరించిన ప్రాంతాలుగా చెబుతారు.

శ్రీరామచంద్రస్వామి, అమ్మపల్లి

హైదరాబాద్ నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మపల్లి శ్రీరామచంద్రస్వామి ఆలయం పురాతనమైనది. వేంగి రాజులు 13వ శతాబ్దంలో నిర్మించారు. అంటే వేయేళ్ల చరిత్ర ఉంది. సీతమ్మ, రాముడు, లక్ష్మణుడు; వీరి వెనుక మకర తోరణం ఇదంతా కలిపి ఒకే రాతి మీద చెక్కారు. ఇక్కడ పురాతన కోనేరు కూడా ఉంది.

శ్రీసీతారామస్వామి ఆలయం, గంభీరావుపేట (తెలంగాణ)

కరీంనగర్ జిల్లా గంభీరావుపేటలో కాకతీయ వంశీకుడు ప్రతాపరుద్రుడు 1314లో ఈ ఆలయం నిర్మించాడు. ఇది ఏడు వందల ఏళ్ల నాటిది. ఇదొక గొప్ప విశేషం కాగా, మరొక అద్భుతం ఇక్కడ ఏడు శతాబ్దాలుగా అఖండ దీపం లేదా నందా దీపం నిరంతరాయంగా వెలుగుతూనే ఉంది. మొదట ఈ దీపంలో చమురు కోసం పన్నులు వేశారు. తరువాత దాతలు చమురు అందిస్తున్నారు.

(కర్ణాటక) కోదండరామ ఆలయం, హంపి, హిరేమంగళూరు

కర్ణాటక ప్రాంతంలో ఆలయ సౌందర్యానికి పెట్టింది పేరుగా ఉండే ఆలయమిది. విజయనగర రాజుల శిల్పకళతో ఈ ఆలయం నిర్మించారు. దీనికి ప్రపంచ సాంస్కృతిక కట్టడంగా యునెస్కో గుర్తింపును కూడా ఇచ్చింది. చుట్టూ శిలలతో, పక్కనే పారే తుంగభద్రతో ఈ ఆలయం ఎంతో అందంగా ఉంటుంది. పక్కన సీతాలక్ష్మణులతో, కోదండం, బాణం పట్టిన రాముల వారిని ఇక్కడ భక్తులు దర్శించుకుంటారు. హంపి క్షేత్రమంటేనే ఒక గొప్ప చరిత్రకు సాక్ష్యంగా ఉన్న స్థలం. విజయనగర పాలకుల కాలం నాటిది. తురుష్కుల దండయాత్రలో నాశనమైన గొప్ప శిల్పకళా నిలయం. ఇదే పేరుతో చిక్‌మగళూరులోని హిరేమగళూర్‌లో కూడా మరొక ఆలయం ఉంది.

శ్రీరామ, త్రిప్రయార్ (కేరళ)

త్రిశ్శూర్ జిల్లాలోని త్రిప్రయార్ అనే అందమైన గ్రామంలో ఈ అద్భుత ఆలయం ఉంది. ద్రవిడ వాస్తుశైలితో దీనిని నిర్మించారు. రాముడు సీతాలక్ష్మణ, హనుమ సమేతుడై ఉంటాడు. ఈ రాముడిని త్రిప్రరాయప్పన్ లేదా త్రిప్రరాయర్ దేవర్ అని పిలుచుకుంటారు. ఇక్కడ శ్రీకృష్ణుడు కూడా పూజలు చేశాడని స్థల పురాణం చెబుతుంది. కృష్ణుడి నిర్యాణం తరువాత ఈ ఆలయంలోని రాముడి విగ్రహం సముద్రంలో కలసిపోయిందని మరొక కథ. తరువాత చెట్టువా అనే ప్రాంతంలోనే సముద్రంలో ఇది దొరికింది. ఆ తరువాతే ఇక్కడి పాలకుడు వక్కాయిల్ కయిమాల్ ఆలయాన్ని నిర్మించాడు. ఆలయ శిల్పకళ, పవిత్రత, ప్రశాంతతకు తోడు పరిసరాలన్నీ కూడా అద్భుతమైనవే. కొబ్బరితోటలు, పచ్చదనంతో ఉన్న గ్రామం, అటే ప్రవహించే త్రిప్రయార్ నది అక్కడ ఉంటాయి. ఏటా ఒకసారి జరిగే ఉత్సవంలో అలంకరించిన ఏనుగులు ప్రత్యేక ఆకర్షణ. సంప్రదాయ వాద్యాల సమ్మేళనం కూడా ప్రత్యేకమైనదే. ఈ ఆలయంలో పూజల తరువాత ప్రత్యేక అనుభూతి పొందవచ్చునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కేరళ ప్రాంత సంస్కృతిని నిలుపుతున్న ఆలయంగా దీనిని గౌరవిస్తారు. ఇక్కడ చతుర్భుజుడిగా రాముడు దర్శనమిస్తాడు. శంఖుచక్రాలు, విల్లు, పూలదండ ఆ చేతులలో ఉంటాయి.

రామాపురం (కేరళ) శ్రీరామాలయం

రామాపురం కేరళలోని కొట్టాయం జిల్లాలో ఉన్నది. ఇది కూడా వేయేళ్ల నాటి ఆలయమని చెబుతారు. రాముడు చతుర్భుజునిగా కనిపిస్తాడు. రాముని సోదరులకు కూడా ఇక్కడ ఆలయాలు ఉన్నాయి. అరణ్యవాసానికి వెళుతూ రాముడు ఈ గ్రామంలో ఆగాడని, ఇక్కడి ప్రశాంత వాతావరణానికి ముగ్ధుడయ్యాడని అంటారు.

తిరువగండ (కేరళ) శ్రీరామస్వామి

దీనిని ఇత్తడి పగోడా అని కూడా పిలుస్తారు. ఇది రామాలయమే. కేరళలో తలస్సేరిలోని రామస్వామి ఆలయంతో పాటు త్రినయాంకుడమ్ (వైకోం), త్రిప్రయార్, తిరువిల్లుమాల, కడలూరు కేరళలో రాముడికి అంకితం చేసిన ఆలయాలు. తిరువగండ శ్రీరామస్వామిని భక్తులు పెరుమాళ్ అని పిలుస్తారు. నాలుగు చేతులతో, అభయ ముద్రతో ఉంటాడు రాముడు.

రామస్వామి గుడి, కుంభకోణం (తమిళనాడు)

భారతదేశంలో ఉన్న ప్రఖ్యాత రామాలయాలలో ఇదొకటి. తంజావూరు నాయకరాజులు 16వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారు. ఇందులో ప్రతిష్ఠించిన విగ్రహాలు దారుసరామ్ అనే చోట ఒక చెరువులో దొరికాయని చెబుతారు. రాముడు, సీత కూర్చుని ఉన్నట్టు, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు నిలిచి ఉన్నట్టు ఇక్కడ విగ్రహాలు తయారు చేశారు. యథాప్రకారం మొక్కుతున్న హనుమ కనిపిస్తాడు. 64 స్తంభాలతో నిర్మించిన మందిరం ఇందులో ప్రత్యేకం. గోపురం మీద రామాయణ దృశ్యాలు చెక్కారు.

విజయరాఘవ పెరుమాళ్ గుడి, కంచి

రామాయణంలో కనిపించే ముఖ్య పాత్ర జటాయుతో ముడిపడి ఉన్న ఆలయం విజయరాఘవ పెరుమాళ్ ఆలయం. ఇది ఆలయాలకు నిలయమైన కాంచీపురంలో ఉంది. సీతమ్మను రక్షించేందుకు రావణుడితో యుద్ధం చేసిన జటాయువు తీవ్రంగా గాయపడి, ఇక్కడే పడి మరణించిందని గాథ. జటాయువుకు రాముడు ఇక్కడే మోక్షం ప్రసాదించాడు. ఇక్కడి ఆలయంలో అదే విధంగా రాములువారు దర్శనమిస్తారు. అయితే చతుర్భుజుడైన రాముడు కనిపిస్తాడు. ఆయన చేతులలోనే జటాయువు ఉంటుంది. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు కూడా పక్కన కొలువై ఉన్నారు. ఆధునిక కాలంలోను దీనికి ఒక ప్రత్యేక వచ్చింది. శ్రీనివాస రామానుజన్ అక్షరాలు దిద్దుకున్నది ఈ ఆలయంలోనే.

ఇరి కథా రామర్, మదురాంతకం

ఈ ఆలయం పల్లవులు నిర్మించారు. అంటే 1600 సంవత్సరాల నాటిది. ఈ ఆలయానికి చోళరాజులు కూడా భూరి విరాళాలు, కానుకలు ఇచ్చినట్టు ఆలయంలో ఉన్న శిలాఫలకం వెల్లడిస్తున్నది. ఎనిమిది అడుగుల రాములవారి మూలవిరాట్ తూర్పు ముఖంగా చూస్తుంటుంది. మదురాంతకం సరస్సు ఒడ్డునే ఈ గుడి కట్టారు. ఈ ఆలయంలోనే కరుణాకరమూర్తి ప్రతిమ ఉంది.

కోతండ రామస్వామి, ముడికొందన్

ఇది వేయేళ్ల క్రితం నాటి ఆలయం. ఈ గుడి ఉన్న గ్రామం మగుదవర్ధన్‌పురి. ముడికొందన్ అంటే అర్థం పట్టాభిషేకం. తాను అయోధ్య పట్టాభిషిక్తుడిగా రాముడు ఇక్కడ భరద్వారజ మహర్షికి దర్శనమిచ్చాడు. అందుకే గ్రామానికి ఆ పేరు వచ్చింది. లంకకు వెళ్లినప్పుడు, తిరిగి వెళ్లిపోతున్నప్పుడు కూడా రాముడు ఈ ఊరు వచ్చాడని చెప్పుకుంటారు. భరద్వాజ మహర్షి ఆతిథ్యం స్వీకరించడానికి ముందు రంగనాథుని ప్రతిష్ఠించమని కోరగా భరద్వాజుడు ఆ కోరిక తీర్చాడు.

శ్రీయోగరామర్ ఆలయం, నెడుంగునమ్

వేయేళ్ల చరిత్ర కలిగిన ఆలయం. గుండె మీద చేయివేసుకుని చిన్ముద్రలో కూర్చున్న భంగిమలో ఇక్కడ విగ్రహం ఉంటుంది. కళ్లు మూసుకుని ఉంటాడు. చేతిలో ఎలాంటి ఆయుధం ఉండదు. పక్కనే సీత చేతిలో కమలం ఉంటుంది. శుకబ్రహ్మ మహర్షి తపస్సు చేయడం వల్ల రాముడు ఇక్కడకు వచ్చాడని చెబుతారు. ఈ ఆలయంలో రెండు గోపురాలు ఉంటాయి. రెండోది శుకబ్రహ్మకు గుర్తుగా ఉంటుంది.

వడువూర్ శ్రీకోదండరామ స్వామి

ఇది కూడా వేయి సంవత్సరాలు చరిత్ర కలిగిన రామాలయమే. కావేరి ఉపనదికి సమీపంగా ఉన్న ఈ క్షేత్రానికి దక్షిణ అయోధ్య అన్న కీర్తి ఉంది.

రామేశ్వరం.. రామనాథస్వామి

(తమిళనాడు)

తమిళనాడులోని రామనాథపురం ప్రాంతంలో పంబన్ దీవిలో రామేశ్వరం ఆలయం ఉంది. దీనినే రామనాథస్వామి ఆలయమని కూడా పిలుస్తారు. ఈ క్షేత్రానికి అరుదైన విశేషాలు ఉన్నాయి. ఇది వైష్ణవక్షేత్రం, శైవక్షేత్రం కూడా. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో ఇదీ ఒకటి. బదరీనాథ్, ద్వారక, పూరీ జగన్నాథ్ క్షేత్రంతో పాటు రామేశ్వరాన్ని కలిపి చార్‌ధామ్‌గా వ్యవహరిస్తు ఉంటారు.

ఈ ఆలయానికీ, శ్రీరాముడికీ ప్రత్యక్ష సంబంధం ఉందని స్థలపురాణాలు చెబుతాయి. ఇక్కడి శివలింగాన్ని రాములవారే స్వయంగా ప్రతిష్ఠించాడని ప్రతీతి. అంతటి శిల్ప సంపదతో, విస్తృత దేవాలయ ప్రాంగణాన్ని నిర్మించింది మాత్రం తరువాతి కాలపు పాలకులే. శివలింగ ప్రతిష్ఠకు వెనుక ఉన్న పురాణగాథ లోతైనది. సీతమ్మను తిరిగి తీసుకురావడానికి వానరసేనతో కలసి లక్ష్మణ సమేతుడై రాముడు స్వర్ణలంక మీద దండయాత్రకు వెళ్లాడు. మహాయుద్ధంలో రావణబ్రహ్మను రాముడు వధించాడు. తిరిగి అయోధ్యకు ప్రయాణమై వెళుతున్నప్పుడు ఇక్కడ రాముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. కారణం- ఆ యుద్ధంలో రావణబ్రహ్మను చంపడం వల్ల వచ్చిన బ్రహ్మహత్యా దోష నివారణకే. తన మీద పరమేశ్వరుడికి ఆగ్రహం రాకుండా ఉండేందుకు రాముడు ఈ పుణ్యకార్యం నిర్వహించాడు. దీనికి అగస్త్య మహర్షి సూచన కూడా ఉంది. మరొక ఉప కథ కూడా ఉంది. ఇంతటి మహత్తర కార్యక్రమం కోసం శివలింగాన్ని తేవడానికి హనుమను రాముడు కైలాసానికి పంపించాడు. అయితే అనుకున్న సమయానికి, బహుశా ముహూర్తానికి హనుమ అక్కడకి తిరిగి రాలేదు. దీనితో సీతమ్మ చేసిన చిరు సైకత లింగాన్నే ప్రతిష్ఠించారు. తరువాత హనుమ తెచ్చిన నల్లటి భారీ శివలింగాన్ని కూడా రాముడు ప్రతిష్ఠించాడు.

ఇక్కడ ఉన్న పురాతన ఆలయాన్ని శ్రీలంక పాలకుడు పరాక్రమబాహు 12వ శతాబ్దంలో విస్తరించాడని చరిత్ర చెబుతోంది. ఇందుకు సంబంధించిన ఒక శిలాశాసనం ఆలయంలో ఉంది. తరువాత పాండ్యులు, నాయకరాజులు, మధురై పాలకులు మరింత వృద్ధి చేశారు. రామేశ్వరం అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది- ఆలయ ప్రాంగణంలోని 64 బావుల తీర్థాలు. వీటిలో 14 బావుల గురించి స్కందపురాణం ప్రస్తావించింది. అంత ప్రాముఖ్యం ఉంది వీటికి. ఇవన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నప్పటికి దేని రుచి దానిదే. ప్రతి బావి తీర్థానికి కొన్ని ఔషధ గుణాలు ఉన్నాయి. లోపలి శివలింగాన్ని దర్శించుకునే ముందే ఈ బావుల తీర్థంతో భక్తులు స్నానమాచరిస్తారు. అంటే ఒక పవిత్ర మనసుతో, క్షాళన చెందిన దేహంతో లోపలికి వెళతారని విశ్వాసం. ఇందులో 3850 అడుగుల పొడవైన మూడు నడవాలు ఉంటాయి. తమిళనాడుకు రాముడికీ సంబంధమే లేదని దబాయించే ద్రవిడ పార్టీలకు కళ్లు తెరిపించగల స్థాయిలో అక్కడ రామాలయాలు ఉన్నాయి. ఎక్కువ ఆలయాలు వందలాది సంవత్సరాల క్రితానివే. సతుర్భుజ రామర్ ఆలయం (పోన్ పథార్ కూడమ్), వల్విల్ రామర్ కోవిల్ (తిరు పుల్లభూతంగుడి) ఇక్కడే ఉన్నాయి. రాముడికే ప్రత్యేకంగా పంచ రామక్షేత్రాలు కూడా ఇక్కడే ఉన్నాయి.

ఇవి భారత భూమిలో ప్రఖ్యాత రామాలయాలలో కొన్ని మాత్రమే..

★

పిబరే రామరసం

'కలం పట్టినందుకు సాఫల్యంగా ప్రతి కవికి రామకథ వ్రాయాలనే ఉంటుంది. వేదాల నుండి మరే గ్రంథాలకు దక్కని అపురూపమైన అరుదైన గౌరవం రామకథది' పారనంది శోభాదేవి 'శ్రీసీతారాముల కథ' పేరుతో వెలువరిస్తున్న గ్రంథాల గురించి డాక్టర్ ఆర్వి కుమార్ (రసజ్ఞభారతి) అన్న మాటలివి. 'కిష్కింధాకాండ', 'సుందరకాండము' ఇటీవల పాఠకుల చేతికి వచ్చాయి. శోభాదేవి చిరకాలంగా కవిత్వం రాస్తున్నారు. ఈ రెండు పుస్తకాలు ఇంచుమించు వాల్మీకి రామాయణానికి అనువాదాలని అనుకోవచ్చు. రామాయణం మీద అనిర్వచనీయమైన భక్తితో శోభాదేవి ఈ పుస్తకాలను వెలుగులోకి తీసుకువచ్చారు. 'వాల్మీకి మహాముని రచించిన రామాయణం చదువుతూ ఉంటే అనుభవైకవేద్యమైన అలౌకికానందస్థితి ప్రాప్తిస్తుంది. అది వాక్యానందమో, రామచంద్రుని గుణాలోకనానందమో తెలియాలన్న కుతూహలం కూడా ఉండదు. మనసు వైపు నుంచి ఏ సంచలనమూ అప్రస్తుతమైపోతుంది' అన్నారు కవయిత్రి. అనుభవించిన ఆ తీపిదనాన్ని వాగ్రూపంలో నెమరవేసుకునే కౌతుకంతోనే ఇందరు మళ్లీ మళ్లీ వ్రాశారు. వ్రాస్తున్నారు, వ్రాస్తూనే ఉంటారు' అని కూడా చెప్పారామె. ముత్యాలసరాల ఛందస్సులో కవయిత్రి రామాయణం రచిస్తున్నారు. ఇందులో కిష్కింధా కాండకు ముందుమాటలు అందించిన డాక్టర్ చిఱ్ఱాపూరి శివరామకృష్ణశర్మ, రాణీ సదాశివశర్మ, పొన్నపల్లి శ్రీరామారావు ఇన్ని వేల ఏళ్లయినా రామకథే ఇతివృత్తంగా కవులు ఎందుకు మళ్లీ మళ్లీ రాస్తున్నారో హృద్యంగా చెప్పారు. వీరిలో శ్రీరామారావు రామాయణాన్ని అక్షరాలా కట్టే కొట్టె తెచ్చే అన్న చందంగానే ఇలా చెప్పారు, 'మొత్తం రామాయణం ఇచ్చే సందేశం ఏమిటని ఆలోచిస్తే-కుటుంబ సంబంధాలు- ముఖ్యంగా సౌదర్య సౌందర్యం - మైత్రీబంధం - దాస్యభక్తి-సతీపతుల ప్రేమ- తద్విరహం- సరే, దుష్టశిక్షణ- శిష్టరక్షణ ఇలా చాలా చెప్పవచ్చు.' సంస్కృతంలో అనుష్టుప్ ఛందస్సులో ఉన్న మహాకావ్యాన్ని శోభాదేవి ముత్యాలసరాలలో అందించారు. ఈ అనువాదం సరళభాషలో, అలంకార సుందరమై సరసమై మాధుర్యముతో అక్షర రమ్యతతో అలరారుతోందని డాక్టర్ శివరామకృష్ణ శర్మ ప్రశంసించారు. ***'నూనం వ్యాకరణం కృత్స్నమ్/ అనేన బహుధాశ్రుతమ్/బహువ్యాహరతానేన/ న కించి దపశబ్దితమ్'*** వాల్మీకి మూల శ్లోకానికి శోభాదేవి అనువాదం: ***'అర్థపూర్ణముల నధిగమిత మూలాదృతమ్ములు వ్యాకృతీనియ/ మాళి సంభావితము లీతని నుడులు మధురాలాపముల్/ నాతిదీర్ఘములు నాతిమంద్రము/ స్పష్టముచ్చ రితమ్ములు'.***

శోభాదేవి ఒక యజ్ఞాన్ని ఆరంభించారు. అది పూర్తి కావాలని అంతా కోరుకుందాం. ఈ పుస్తకాలు చదివితే ఆమె కృషికి మరింత సాఫల్యం సిద్ధిస్తుంది.



శ్రీసీతారాముల కథ/ కిష్కింధాకాండ (పే 182, వెల రూ 250/-), **సుందరకాండము** (పే 152, వెల రూ 150/-) **కవయిత్రి:** పారనంది శోభాదేవి.
ప్రతులకు: శోభాదేవి పారనంది, ప్లాట్ నెం. 145, షాయిలీ గార్డెన్స్, యాప్రాల్, జేజే నగర్ పీవో, సికింద్రాబాద్-500 087

భద్రాద్రి రాముడికి అపురూప కానుక

మహర్షి వాల్మీకి భారతవర్షానికి అందించిన మహోత్తమ కావ్యం శ్రీమద్రామాయణం. విష్ణువు అవతారాలలో ఒకరైన శ్రీరామచంద్రుడి గాథ ఇది. ఆ కావ్యం వచ్చి ఆరు వేల ఏళ్లు అయిందని చెబుతారు. అప్పటి నుంచి భారతీయ సమాజానికి స్ఫూర్తిని ఇస్తూనే ఉంది. వాల్మీకి తరువాత కొన్ని వేల రామాయణాలు ప్రపంచ వ్యాప్తంగా పలు భాషలలో వచ్చాయి. కానీ ఆ మహా కావ్యాన్ని మళ్లీ తాళపత్రాలతో చదవాలని అనుకున్నారు మణుగూరు వాస్తవ్యులు బొమ్మరాత ఎల్లయ్య. అందుకే నాలుగేళ్లు శ్రమించి ఆ కావ్యాన్ని తాళపత్రాల మీద రాశారు. భద్రాద్రికి సమీపంలోనే ఉన్న కొత్తగూడెం జిల్లాలోనే ఉంది మణుగూరు. ఎల్లయ్య రామభక్తుడు. క్రీస్తుపూర్వం 5వ శతాబ్దం నుంచి తాళపత్రాల వినియోగం ఉంది. మళ్లీ

ఇప్పుడు దాని మీద మహా కావ్యం రాయాలని భావించడం భక్తి తప్ప మరొకటేమీ కాదు. ఎల్లయ్య సింగరేణి కాలరీస్‌లో పని చేసి పదవీ విరమణ పొందారు. తన విశ్రాంత జీవితాన్ని తాళపత్రాల మీద రామాయణ రచనతో ప్రారంభించారు. నాలుగేళ్లకు పూర్తి చేశారు. ఏడు కాండలను విజయవంతంగా పూర్తి చేశారు. ఉద్యోగం చేస్తున్నప్పుడే ఇలాంటి ఆలోచన వచ్చినప్పటికీ పని వేళలను బట్టి ప్రారంభించలేక పోయారు. ఇది వాల్మీకి రామాయణం మాతృకగా వచ్చింది. ఈ తాళపత్రాలను ఆయన ఈ శ్రీరామనవమి సందర్భంగా తన ఆరాధ్యదైవం భద్రాచల సీతారామచంద్రస్వామివారికి సమర్పిస్తారట ఎల్లయ్య. ఇది నిజంగా భద్రాద్రి రామయ్యకి అపురూప కానుకే. ★

అంతా రామమయం...
జగమంతా రామమయం.
ఈ ద్విపదలోనే ముక్తి నిండి ఉంది.
రామచంద్రుడితడు... రఘువీరుడు.
అని పాడుకున్నారు అయోధ్యవాసులు.
శ్రీరామచంద్రుడి వెంట అడవికి నడిచింది సీత.
అమ్మ పేరును ముందు చేర్చుకున్నాడు రామయ్య.
శ్రీ సీతారామచంద్రుడయ్యాడు... జనులందరికీ.

అది ఖమ్మం జిల్లా. సత్తుపల్లి మండలంలోని రుద్రాక్షపల్లి గ్రామానికి చెందిన లంబాడా తండాలోని 'శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం' శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమవుతోంది... అచ్చం అయోధ్య రామాలయం వలెనే. ఇందులో ఆశ్చర్యం ఏముంది అంటారా? ఉంది. ఈ ఆలయానికి ఇది తొలి శ్రీరామనవమి. తొలి శ్రీరామ నవమి అంటే... ఇటీవల నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన జరుపుకున్న నూతన ఆలయం అనుకుంటున్నారేమో! కాదు కాదు. ఎప్పటి నుంచో ఉన్నదే, ఇప్పుడు పునర్నిర్మాణం జరుపుకుంది. అయోధ్య రామాలయంలోని రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ జరిగిన నెలరోజులకు రుద్రాక్షపల్లి రాముడి ప్రతిష్ఠ జరిగింది. అయోధ్యరాముడు బాలరాముడైతే రుద్రాక్షపల్లి రాముడు భద్రాచలమూర్తికి ప్రతి రూపం. అవును, సీతామాతను రాముడు తన ఒడిలో కూర్చోబెట్టుకున్న ప్రతిమ భద్రాచలంలో తప్ప మరెక్కడా కనిపించదు. అచ్చంగా అలాంటి రూపమే కావాలని పట్టుపట్టి చేయించుకున్నారు దాసరి జైపాల్ రెడ్డి దంపతులు. నాడు భద్రాచలంలో రాముడికి నీడను కల్పించిన ఆదివాసీ వనిత పోకల దమ్మక్క. నేడు రుద్రాక్షపల్లి రాముడి ఆలయ నిర్మాణాన్ని ఒంటిచేత్తో పూర్తి చేసిన మహిళ శ్రీలక్ష్మిరెడ్డి. నిజంగా అదొక అనిర్వచనీయమైన అనుభవం ఆమెకు.

"మా అమ్మ వేమిరెడ్డి కమలమ్మ మహాభక్తురాలు. మా ఊరు నెల్లూరు జిల్లా ఆత్మకూరు. అమ్మ నిత్యం ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అన్నం వండి పెట్టేది. మానవసేవలో మాధవ సేవను చూసిన మహా తల్లి. పూజలు, కృతువుల మీద ఆసక్తి కూడా మెండు. నేను పెళ్లి చేసుకుని కోడలిగా ఖమ్మం జిల్లా, రుద్రాక్షపల్లిలో అడుగుపెట్టాను. అమ్మ నా దగ్గరకు వచ్చిన ప్రతిసారీ 'ధ్వజస్థంభం లేని గుడి గుడే కాదు. ఆ ఊరు ఊరే కాదు' అని చెప్పుండేది. ఊరు ఇలా ఉండకూడదు, ఎవరో ఒకరు పూనుకుని ఆలయం కట్టి ధ్వజస్థంభం ప్రతిష్ఠిస్తే బావుణ్ణని గుర్తు చేస్తుండేది. అమ్మ చెప్పినప్పుడు ఏదైనా చేస్తే బావుణ్ననుకునేవాళ్లం. కానీ ముగ్గురు పిల్లల పెంపకం, వాళ్ల చదువుల బాధ్యతలతో హైదరాబాద్‌కి వచ్చిన వెంటనే ఆ సంగతి మర్చిపోయేవాళ్లం. న్యాయవాదిగా మా వారి ప్రాక్టీస్ హైకోర్టులో కావడంతో హైదరాబాద్‌లో ఉండేవాళ్లం. ఇలాగే సంవత్సరాలు గడిచిపోయాయి. పెద్దమ్మాయి ఐఏఎస్, రెండో అమ్మాయి డెర్మటాలజిస్ట్, అబ్బాయిని లాయరుని చేయడంతో తల్లిగా నా బాధ్యతలు పూర్తయ్యాయి. హైదరాబాద్‌లో సోషల్ సర్వీస్, ముఖ్యంగా పేదవాళ్ల కోసం వైద్య సేవలందించడంలో మునిగిపోయిన నా చేత ఆ భగవంతుడే 'ఇక ఈ పని మొదలు పెట్టు' అని తన మాటను మా వారి నోటి ద్వారా చెప్పించి ఈ పనులన్నీ చేయించు కున్నాడు. మా వారు మాట మాత్రంగా చెప్పడమే తరువాయి, నేను మరోమాట లేకుండా రంగంలోకి దిగేశాను. ఆ అయోధ్యరాముడికి ఎదురైనన్ని అవరోధాలు మా రుద్రాక్షపల్లి రాముడికీ తప్పలేదు.

రాముడికంటే ముందు వేంకటేశ్వరుడు

మేము మొదట నిర్మాణం చేపట్టింది వేంకటేశ్వరుడి ఆలయాన్ని. ఆ ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి ధ్వజస్థంభం, విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తయిన తర్వాత 'రామాలయాన్ని కూడా మీ చేతుల మీదుగానే చేయించండి' అని ఆదివాసీ తండా వాళ్లు అడిగారు. ఆ మేరకు 'శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం' నిర్మాణం చేపట్టాం. నాలుగు గోడలు, పై కప్పుతో చిన్న నిర్మాణంలో తలదాచుకున్న రాముడు నాతో చక్కటి మందిరాన్ని కట్టించుకున్నాడు. ఆ రామయ్య ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ విగ్రహ రూపకల్పనలో నా ముచ్చట కూడా తీర్చుకున్నాను. రామాలయాలన్నింటిలో విగ్రహాలు ఒకే రీతిలో ఉంటాయి. మధ్యలో రాముడు, ఒక వైపు సీతాదేవి, మరొక వైపు లక్ష్మణుడు నిలబడి ఉంటారు. ఆంజనేయస్వామి వారి ఎదురుగా మోకరిల్లి ఉంటాడు. రామాలయాల్లోని కోదండరాముడి రూపం అది. రాముడు కోదండాన్ని ధరించి ఉంటాడన్నమాట. మనం సీతారాములను అన్యోన్యతకు ప్రతీకలుగా, చక్కటి దాంపత్యానికి ఆదర్శవంతంగా భావిస్తాం. అందుకే పెళ్లిళ్లలో వధూవరుల చేత సీతారాముల పటానికి పూజ చేయిస్తారు. అంత గొప్ప దంపతులైన సీతారాములకు వారి జీవితంలో ఎక్కువకాలం ఎడబాటే మిగిలింది. భద్రాచలంలో మాత్రం భద్రుడి కోరిక మేరకు రాముడు సీతమ్మను ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. నాకు ఆ రూపమే ఇష్టం. అమ్మను ఒడిలో కూర్చోబెట్టుకున్న రామయ్య మా ఊరిలో కూడా ఉండాలని, భద్రాచలం వెళ్లలేని వాళ్లకు మా ఊరే

సామివంటే నువ్వేలే రామయ తండ్రి!

మరో భద్రాచలం కావాలని నా కోరిక. తిరుపతిలోని ప్రముఖ శిల్పకారులు కృష్ణమాచారి నాలుగు నెలలు శ్రమించి నా ఆకాంక్ష మేరకు విగ్రహాలను భద్రాచలం నమూనాలోనే చెక్కి ఇచ్చారు. తమిళనాడుకు చెందిన స్థపతి ఎన్ వల్లీనయగం గుడి నిర్మాణ నమూనా ఇచ్చారు. మహాబలిపురం నుంచి వచ్చిన ఇరవై మంది శిల్పులు నెల రోజులు పని చేసి ఆలయ గోపుర నిర్మాణం పూర్తి చేశారు. ధ్వజస్థంభం కోసం నారవేపచెట్టును మా ఊరికి పక్కనే ఉన్న రేజర్ల గ్రామవాసి కాసర్ల శ్రీనివాసరావు ఇచ్చారు. ఉత్సవ విగ్రహాలను పంచలోహ విగ్రహాలను టీటీడీ సబ్సిడీపై ఇచ్చింది.

శాస్త్రోక్తంగా ప్రతి ఘట్టం

రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనకు 40 రోజుల ముందు నుంచి శాస్త్రోక్తమైన పూజాదికాలు మొదలయ్యాయి. విగ్రహాల ధాన్యావాసం, క్షీరావాసం, నీటివాసం వంటి ప్రతి ఘట్టం మా ఇంట్లోనే జరిగింది. స్వామివార్ల కళ్లకు మైనం పూసి ధాన్యంలో ఉంచారు. క్షీరావాసం కోసం కొత్త ఈతకొలను, యాగశాల వంటి నిర్మాణాలు కూడా చేశాం. మూడు రోజుల ముందుగానే ఆంజనేయుడికి ఆహ్వానం పలికే ఘట్టంతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది. రెండు వందల మంది భక్తులు జెండాలు పట్టుకుని బైక్ ర్యాలీ చేయడంతో ఊరందరిలో ఉత్సాహం మొదలైంది. పిల్లలు, పెద్దవాళ్లు, మహిళలు హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్నారు. గోపూజ, తులసిపూజ, నిద్రావాసం వంటి ప్రతి కార్యక్రమాన్ని అత్యంత నియమనిష్ఠలతో చేయగలిగాం. టీటీడీ నుంచి పూజారులు వచ్చి నాలుగు రోజులపాటు హోమాలు, ప్రతిష్ఠాపన నుంచి సీతారామ కల్యాణం వరకు వారి చేతుల మీదుగా నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో మా దంపతులతోపాటు తండాలో ప్రతి ఇంటి నుంచి భార్యాభర్తలు పాల్గొన్నారు. ఆడవాళ్లు గులాబీరంగు చీరలు, మగవాళ్లు ధవళ వస్త్రాలు ధరించి కల్యాణ మహాఘట్టంలో పాల్గొని తరించాం. అలాగే పదహారు రోజుల పండుగను కూడా నిర్వహించాం. రాబోయే శ్రీరామనవమికి మళ్లీ కల్యాణానికి సిద్ధమవుతున్నారు ఆదర్శదంపతులు సీతమ్మ, రామయ్య. మేమంతా మరోసారి శ్రీసీతారామచంద్రుల కల్యాణ మహోత్సవంలో పాలుపంచుకునే అదృష్టం కోసం ఎదురు చూస్తున్నాం".

అమ్మను ఒడిలో కూర్చుండబెట్టుకున్న అయ్యకు వందనం!

– దాసరి శ్రీలక్ష్మీరెడ్డి,
ధార్మిక, సామాజిక కార్యకర్త

అంతా దైవనిర్ణయం!

ఆనాటి భద్రాచల రామదాసు భక్తిపారవశ్యంలో ఎంతగా మునిగిపోయాడో మనకు తెలుసు. రామయ్యకు, సీతమ్మకు ఆభరణాలు చేయించడానికి గ్రామస్థుల శిస్తు డబ్బు ఖర్చు చేసి చివరికి చెరసాలపాలయ్యాడు. నేను మా రుద్రాక్షపల్లి రామాలయం కోసం నా చెవుల వజ్రాల కమ్మలు అమ్మేశాను. నాలో వచ్చిన మార్పు నాకే ఆశ్చర్యంగా ఉంది. ఆలయాల నిర్మాణ బాధ్యతల్లో మునిగిపోయిన తర్వాత నాకు తెలియకుండానే ఆభరణాల మీద వ్యామోహం కూడా తగ్గిపోయింది. రాముడి కోసం ఖర్చు చేస్తుంటే కలిగిన సంతృప్తి... వజ్రాల కమ్మలను చెవులకు ధరించినప్పటి కంటే ఎక్కువ. గుడి స్థల దాతలు కూడా మా కుటుంబీకులే. వేంకటేశ్వరస్వామి గుడి నిర్మాణం కోసం మా స్థలాన్ని ఇచ్చి ఇరవై ఐదేళ్లయింది. గ్రామస్థులు ముందుకు వచ్చి నిర్మాణం బాధ్యతలందుకుంటారని భావించాం. ఇన్నేళ్లయినా నిర్మాణం మాత్రం మొదలు కాలేదు. ఆ మహత్కార్యాన్ని నా చేతుల మీదుగా చేయించుకోవాలనేది ఆ భగవంతుడి నిర్ణయం కాబోలు. వేంకటేశ్వరుడితోపాటు రాముడు కూడా గుడి కట్టించుకున్నాడు. దేవుడికి చేసిన ఖర్చును లెక్క చెప్పడం లేదు, కానీ కోటి రూపాయల విలువైన పనిని నా చేతి మీద చేయగలిగానంటే... అంతా దైవేచ్ఛ తప్ప మరొకటి కాదు.



అంతవరకూ గిలగిలా కొట్టుకున్న ఆ ప్రాణం శక్తి హీనమైంది. క్రమంగా కదలిక ఆగిపోయింది. దానికి కారణం చాలా చిన్నది.

ఆ పిండం ఆడపిల్ల కావటమే!

పెరిగిన విజ్ఞానం పుణ్యమాని, నాలుగు నెలలు దాటకుండానే చావు అంచును తాకింది ఆ ప్రాణి.

కుంతల పురిటినొప్పులు పడేవారి కన్నా ఎక్కువ దుఃఖిస్తున్నది. తాను కన్సివ్ అయినానని తెలిసి ఎంతో సంతోషపడింది. ఆ ఆనందాన్ని వర్ణించగలిగే అక్షరాలు లేవు. "తను అమ్మ కాబోతున్నది... ఇంతవరకు ఇల్లాలు, గృహిణి, భార్య. ఇప్పుడు 'అమ్మ'. అదే ఇప్పటి గొప్పదనం" అనుకుంది.

సంబరాజు లీల (లట్టుపల్లి)

వారం రోజులు గడిచేసరికి కడుపులో తిప్పటం, ఏది తిన్నా వాంతి కావటం, ఆకలి మందగించటం, నీరసం, తినాలని ఉన్నా తినలేకపోవటం చూసి, "బాబోయ్! ఈ స్థితి తొమ్మిది నెలలు భరించాలా?" భయం నటిస్తూ అడిగింది అత్తగారిని.

"ఆ... ఇదంతా మామూలే! మూడునెల్లు గడిచేసరికి అంతా సర్దుకుంటుంది. దబ్బపండు లాంటి కొడుకు పుడితే, అంతా మరిచిపోయి

మరోసారి కనటానికి సిద్ధపడతారు!" అంది ఆవిడ, తేలిగ్గా.

'అందుకే తల్లి.. ఆ పుట్టేవాడి కోసం ఇవన్నీ సహిస్తుంది' అనుకుంది కుంతల. ఇంట్లోవాళ్ళు, భర్త చేసే అపురూపం, అప్పుడప్పుడూ చేపపిల్లలా తుళ్లిపడే లోపలి ప్రాణి కదలికలు గమనిస్తూ అమ్మదనంలోని కమ్మదనాన్ని అనుభవిస్తున్నది.

మూడునెలలు గడిచేసరికి అంతా సర్దుకుని, కొద్దిపాటి మార్పులతో, పొత్తి కడుపు క్రింద గట్టిపడిన అమ్మలోని మార్పుల్ని తెలియజేస్తున్న ప్రాణి ఉనికిని గమనిస్తూ, ఏకమైన రెండు దేహాల కలయిక నుంచి, వెలువడిన నిట్టూర్పుల అందాల ఆనందాలు చిందించిన అణువు, సహస్రాణువులై, దేహంగా రూపుదాల్చిన ఆ సృష్టి విన్యాసాన్ని ఎవరు వర్ణించగలరు? అందుకే ఓ అద్భుత శిల్పి! నీ మహోన్నత ఔన్నత్యం ముందు మనిషిగా మోకరిల్లి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను" అనుకుంది భగవంతునికి స్మరిస్తూ.

కానీ... ఆనందాన్ని ఛిద్రం చేస్తూ ఆసుపత్రిలో 'స్కానింగ్' జరిగింది. "మగపిల్లాడా?" ఆతృతగా అడిగింది అత్తగారు. వాళ్లు జవాబివ్వలేదు. రిపోర్టులో రాయలేదు.

కానీ, ఆవిడ వదల్లేదు.

రెండు మూడు చోట్ల చేయించారు, ఎవరో ఒకరు చెప్పకపోరని!

"ఎందుకత్తయ్యా? నాకిది తొలిబిడ్డ. ఎవరయితే ఏమిటి!" అనునయించబోయింది కుంతల.

"నువ్వూరుకో! అవకాశాల్ని అందుకుని ఉపయోగించుకోవాలి. మొదటి సంతానం అబ్బాయి కావాలి. మనింట్లో అంతా ఆడ మలయాళమే. ఎంతో ఎదురు చూశాక కాని, కల్యాణ్ పుట్టలేదు. వరసగా నలుగురు ఆడపిల్లలు. వంశోద్ధారకుడు లేడే అన్న దిగులు. ఎన్నో ఎదురుచూపుల తరువాత కానీ అబ్బాయి పుట్టలేదు. అప్పుడిన్ని అవకాశాలు లేక కన్నాను. ఇప్పుడు విజ్ఞానం పెరిగింది. ముందే తెలుసుకుని ఆనందించే అవకాశముందిప్పుడు. దాన్ని ఉపయోగించుకోవాలి కదా!" అంది.

అప్పటికి దాన్ని వదిలేస్తూ, "పోనీ తెలుసుకుని ఆనందిస్తారు" అనుకుంది కుంతల. వారం రోజులకే మరో 'స్కానింగ్'కు అంతా తయారయితే, ఎందుకో భయం వేసింది కుంతలకు.

స్కానింగ్ గురించి వణికిపోతూ "నిజంగానే, ఆ ప్రాణి ఆడపిల్లయితే..." అన్న ఆలోచన రాగానే బాగా భయపడింది.



దాన్ని నిజం చేస్తూ ఓ హాస్పిటల్లో, ఎన్ని నిబంధనలున్నా, బాధ్యత మరిచిన ఆ డాక్టర్, 'అమ్మాయి' అని చెప్పేశారు. అది తెలియగానే గాజులు వేయవచ్చు, పట్టు లంగాలు, నగలు వేయొచ్చు అనుకొన్నది కుంతల. కానీ ఆ కబురు విన్నాక అత్తింటి వారందరిలో వచ్చిన మార్పు ఆమెను బాగా భయపెట్టింది. అత్తగారిస్తున్న బొప్పాయిరసం తాగనని వారించింది. అభ్యర్థించింది, ఏడ్చింది.

చివరికి ఓడిపోయింది. భర్త సహకారం కూడ లేని ఆమె, నెలలు నిండకుండానే నొప్పులు పడుతున్నదిప్పుడు, పురిటి మంచం మీద.

* * *

డాక్టర్ వరద, 'పృథ్వి ప్రతిసృష్టి సంతాన సాఫల్య కేంద్రం'లో అధితి డాక్టర్ ముందు కూర్చుని ఉంది. ఆమె కూర్చున్న ఆ కుర్చీయే ఎంతో సదుపాయంగా, గర్భిణులకు ఏ మాత్రం అలసట కలిగించనంతగా, అమ్మ ఒడిలా ఉంది. వెనుకకు ఆనుకుని కూర్చున్న అధితికి, హార్లిక్స్ కలిపి ఇస్తూ, 'ఓకే. తాగాక అలా పడుకో అధితి, చెకప్ చేస్తాను! నీ చిన్నారి బొజ్జలో, రాక్షసుడిలాంటి దుష్టుని అణగదొక్కే ఏ వామనుడున్నాడో చెక్ చేస్తాను!" అంది ధైర్యం చెబుతూ భుజం తట్టి.

"మీరు డాక్టరయినా పురాణగాథ భలేగా చెప్పారు. వామనుడేనని ఎందుకనుకుంటు



న్నారు? 'యోగమాయ' కావచ్చుగా!" అంది అధితి.

"అలా అనిపించటం లేదు. బలిచక్రవర్తిని మూడడుగుల భూమిని దానం కోరిన త్రివిక్రముడే అనుకుంటున్నాను" అంటూ స్టెత్ తీసుకుంది. డాక్టర్ వరద చిరునవ్వు చల్లగా, లలితంగా ఉంటుంది. ఆమె చదువు, వ్యక్తిత్వం, కేవలం శాస్త్రీయ దృక్పథంగానే ఉంటాయి.

ఆమె ఏ కేసులో అటెండయినా, అందులోకి డాక్టరుగా శాస్త్రవేత్తగా ప్రవేశిస్తుంది. ఆ రోజు ఆమె చెకప్ చేస్తున్నది అధితిని. కశ్యప్‌చంద్రల ఐ.వి.ఎఫ్ (IVF) ఇన్ విట్రొ ఫెర్టిలైజేషన్ కేసు. శుద్ధి చేసిన వీర్యకణాల్ని అండంతో ల్యాబ్‌లో ఫలదీకరించి, ఆ పిండాన్ని ఆమె గర్భంలో ప్రవేశపెట్టారు.

అధితికి చక్కటి భర్త, సంసారం. కోరుకున్న అంతస్తు– సోషల్ కమ్యూనిటిలో పెద్ద ఉద్యోగంతో. మంచి స్థితి ఉన్న జీవితం. ఒకే ఒక లోటు. ఉద్యోగం, టెన్షన్ లాంటి కారణాలతో, హార్మోన్స్ ఇంబ్యాలెన్స్

అయి, గర్భసంచి కుంచించుకు పోయింది. ఫలితంగా భర్తతో గర్భం దాల్చలేక ఐ.యు.వి.(IUI) ఇంట్రా యుటిలైన్ ఇంజక్షన్ పద్ధతి ఎంచుకుంది. ఈ పద్ధతిలో శుద్ధి చేసిన శుక్ర కణాల్ని మైక్రో ఇంజక్షన్ ద్వారా అండంలోకి పంపి, దాన్ని ల్యాబ్‌లో ఫలదీకరించిన తరువాత తల్లి గర్భంలో ప్రవేశపెడతారు.

ఆ పద్ధతిలో అధితికి ఇప్పుడు రెండో నెల.

అధితి కూడ నవ్వుతూ, ''అబ్బాయేనని కమిటయ్యారా?" అడిగింది.

"అంత గట్టిగా తెలవదు. అనుకుంటున్నాను" అంది. కానీ, ఆమెకు తెలుసు. అది ఎక్స్ ఎక్స్ క్రోమోజోములు కాక, ఎక్స్, వై (xy) క్రోమోజములు కలసిన పిండమని.

అధితి తన పొట్టను అపురూపంగా చూసుకుంది. ఇంతవరకు తనలో ఎలాంటి కదలికా కనిపించలేదు. డాక్టర్ వరద, తన భర్త వీర్యకణాలతోనే తనను తల్లిని చేస్తుంది. నిజానికిది నాల్గు గోడల మధ్య అతి రహస్యంగా జరగాల్సిన తతంగం.

ముగ్ధ మోహనరూపంలో తొలిరాత్రి భర్తను చేరిన ఆడపిల్ల, అపురూపంగా దాచుకున్న అనుభవంతో అమ్మను చేసిన– సంఘటన. కానీ పెరిగిన విజ్ఞానంతో, ధనవ్యామోహంతో కాలాన్ని దుర్వినియోగ పరిచినందుకు ప్రతిసృష్టి కేంద్రంలో భర్త సహాయానికి బదులు, డాక్టరు చేత తల్లి కాబోతున్నాను కదా! అనుకుంది ఎంతో గొప్ప కంప్యూటర్ ఇంజనీర్ అధితి.

కంప్యూటర్ స్క్రీన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వరద కనుబొమ్మలు ముడిచింది.

చిన్న ఉదరంలో, గాజు తొట్టిలాంటి, మాతృగర్భ సముద్రంలో చిన్న నీటి బొట్టులా, ఓ చిన్న నల్లని చుక్క, గులాబీరంగు పలుచని పొరల మధ్య, ఓ ప్రాణిరూపంలో నిలబడి కనిపించింది.

కదలిక లేదు.

"హుష్..." అంటు ఆపి, "రిలాక్సయి అలా కూర్చో అధితి" చెప్పింది.

డాక్టర్ చెబుతున్న తీరులోనే, ఆ విధానంలోనే ఏదో అపశ్రుతి వినిపించింది ఆమెకు. అయినా

"ఇది దానం కాదు, వాళ్లను 'దాతలు' అనటానికి! ఇది విజ్ఞానంతో చేస్తున్న వ్యాపారం. అన్నీ అమ్మటం కొనడం అన్నట్టే గర్భాన్ని అద్దెకిస్తున్నారు. ఇక్కడ అవసరానికి దాతృత్వాన్ని జత చేస్తున్నామంతే! నీకెందుకు? రేపీపాటికి నీ గర్భాన్ని మోయటానికి ఆరోగ్యవంతమైన స్త్రీ సిద్ధంగా ఉంటుంది!" చెప్పింది, ఇంకా నమ్మలేనట్లుగా చూస్తున్న అధితితో.

అందరు తల్లుల్లా కంగారుపడలేదు. "ఏమయింది డాక్టర్!" ప్రశ్నించింది. చేస్తున్న ప్రాజెక్టు వర్కులో 'గోల్' చేరుకోలేని ఇంజనీర్‌లా.

అయినా, తల్లిని కాలేకపోతున్నట్టు ఆ గొంతులో దీనత్వం వినిపిస్తున్నది.

"సారీ... ఏమి చేయలేనమ్మా! నీ గర్భకోశం నీ బిడ్డ పెరగటానికి అనువుగా లేదు!" విచారిస్తున్నట్టు చెప్పింది.

"మరీ.. నేను తల్లయ్యే మార్గం లేదా?" అధితి కళ్లల్లో నీళ్లు ముంచుకొచ్చాయి.

"ఇలాంటి గర్భస్రావాలు మూడయ్యాయి. దీన్నిబట్టి లేనట్టె. అయితే 'సరోగసి' ద్వారా తల్లి కావచ్చు!" చెప్పింది.

"అంతకన్నా మార్గం లేదా?" ప్రశ్నించింది.

"ఉండొచ్చు. ఉండకపోవచ్చు. అయితే ఈసారి నీతోపాటుగా ఎవరయినా గర్భాన్ని సరోగేట్ చేస్తే, ఐ.వి.ఎఫ్ (IVF)– అంటే శుద్ధి చేసిన వీర్యకణాల్ని, అండాల్ని ల్యాబ్‌లో ఫలదీకరించి, గర్భంలో ప్రవేశపెడతారు. ఈ పద్ధతి మీకు, మాతృదానం చేసే మరో స్త్రీకి ప్రయోగించి చూద్దాం. మీ విషయంలో విజయవంతం అయితే , ఆ అమ్మ అద్దెగర్భం అవసరం లేదనుకోవచ్చు." తేలికగా చెప్పేసింది.

అప్పటికి అధితి మౌనంగా ఉండటంతో, "అధితి! ఇది చాలా చిన్న విషయం. అక్కడా ఇక్కడా నీ భర్త వీర్యకణాలే, నీ అండాలే ఉంటాయి. అది నీవల్ల విజయం సాధించలేకుంటే, ఆ అమ్మాయిలు అద్దె గర్భాన్ని ఉంచుకోవచ్చు లేదా– నీ దగ్గరే సక్సెసయితే... సమస్యే ఉండదుగా!" ఇంకాస్త విడమరిచి చెప్పే ప్రయత్నం చేస్తూ నవ్వింది డాక్టర్ వరద.

"మనకింత తొందరలో గర్భాన్ని అద్దెకిచ్చె అమ్మలెవరు దొరుకుతారు? దొరికినా వెంటనే ఎవరంగీకరిస్తారు?" అమాయకంగా ప్రశ్నించింది అధితి. ఆమె కంప్యూటర్ ఇంజనీర్నన్న విషయం గుర్తుకు వచ్చినట్టు అంది.

"గూగుల్ కొట్టి లాగిన్ అయితే చాలు, సమాచారమంతా వస్తుందని తెలుసు. కానీ... ఇలా అమ్మ కావాలి అనుకోగానే, తమ గర్భాన్ని అద్దెకిచ్చె అమ్మలు రోజుల్లోనే దొరుకుతారంటే ఆశ్చర్యమే!"

వరద మరోసారి సన్నగా నవ్వి, "నీవా విషయం వదిలెయ్యి అధితి! ముందు నీకిది అంగీకారమేనా, కాదా? ఆ విషయం తేల్చి చెప్పు. నిజంగా చెప్పు! నిజంగా నీకు సంతానం కావాలంటే, ఇద్దరికి ఐ.వి.ఎఫ్ పద్ధతిలో సుమారు ఆరు నుండి ఎనిమిది లక్షలవరకు కావచ్చు!" అసలు విషయం చెప్పింది వరద.

"ఖర్చు విషయం వదిలేయండి డాక్టర్! ఇప్పటికిప్పుడు తమ అపురూపమైన మాతృత్వాన్ని దానమిచ్చే వారెవరుంటారు?" నమ్మలేనట్లుగా అడిగింది.

"ఇది దానం కాదు, వాళ్లను 'దాతలు' అనటానికి! ఇది విజ్ఞానంతో చేస్తున్న వ్యాపారం. అన్నీ అమ్మటం కొనడం అన్నట్టే గర్భాన్ని అద్దెకిస్తున్నారు. ఇక్కడ అవసరానికి దాతృత్వాన్ని జత చేస్తున్నామంతే! నీకెందుకు? రేపీపాటికి నీ గర్భాన్ని మోయటానికి ఆరోగ్యవంతమైన స్త్రీ సిద్ధంగా ఉంటుంది!" చెప్పింది, ఇంకా నమ్మలేనట్లుగా చూస్తున్న అధితితో.

"అద్దె అమ్మలుగా గర్భాలను అద్దెలకివ్వటం సర్వ సాధారణమయిందిప్పుడు. అలాంటి వాళ్లున్నందుకే మరి, ఇన్ని సంతాన సాఫల్య కేంద్రాలు పుట్టు కొచ్చాయి. అఫ్‌కోర్స్! ఎంతోమంది స్త్రీలు గొడ్రాళ్లుగా మిగిలిపోకుండా మాతృమూర్తుల్ని చేస్తున్నది సరోగసీ!" అంటూ లేచింది.

డాక్టర్ వరద ఎప్పటికప్పుడు కొత్త విషయాలతో, పరిశోధనలతో, శాస్త్రంతో కుస్తీ పడుతుంటుంది. పరికరాలతో పరిశోధించినట్లుగా, ఇప్పుడు మనుషులు, వారి అవసరాలతో అనురాగం, అమ్మల మధ్య శాస్త్రవేత్తగా నిలబడింది.

(సశేషం)

ఉత్తమ వ్యక్తిత్వానికి స్ఫూర్తి రామచంద్రుడు

శ్రీరామచంద్రుడు భారత ప్రజల ముందు ఆదర్శమానవుడిగా, మర్యాదా పురుషోత్తముడుగా ఆవిష్కృతుడయ్యాడు. రామాయణ కావ్యకర్త వాల్మీకి ఆయనను మానవాతీతుడు, అలౌకికుడు, దైవిక శక్తులు గల అవతారమూర్తిగా కాకుండా మానవుని సుగుణాలు, అనురాగాలు, శక్తియుక్తులతోనే వర్ణించాడు. శ్రీకృష్ణుడు, శ్రీరామచంద్రుడు, బుద్ధభగవానుడు... వీరంతా మానవునికి మార్గదర్శకులైన అవతార పురుషులు. కాని ప్రజల బలహీనతవల్ల వారి పేర్లను నిరర్థకంగా వల్లిస్తూ కూర్చుంటున్నారు. శివాజీని, లోకమాన్య తిలక్‌ను, మహాత్మాగాంధీని కూడ ప్రజలు అవతార పురుషులను చేసేశారు. వారిని నిర్జీవమైన పూజావిగ్రహాలుగా చేసేశారు. శ్రీరాముడిని గుణాలు కలిగిన మానవుడుగా మన ముందుంచాడు. ఆయన పితృభక్తి. భ్రాతృవాత్సల్యం, భార్య పట్ల గాఢానురక్తి స్వచ్ఛమైన, హృదయపు లోతులను కదిలించివేసి ఆయనను అందరికీ ఆప్తుణ్ణి చేస్తాయి. మానవుని దైనందిన జీవితంలోని పరమ రమణీయంగా వర్ణితమైన ఈ గుణాలు సామాన్యులు సయితం తమను తాము సరిదిద్దుకోవడానికి, బాగుపరచుకోవడానికి స్ఫూర్తినిస్తాయి. ఆయన పడిన బాధలు, తల్లిదండ్రులను వదలినప్పుడు, ఆ తర్వాతి సీతావియోగం సంభవించినప్పుడు చూపిన మనోనిగ్రహం, చివరకు వినాశకరశక్తులపైన సాధించిన విజయం.. ఇవన్నీ మన ఆశలను చిగురింపచేస్తాయి. మనలో విశ్వాసాన్ని, ధైర్యాన్ని పూరిస్తాయి. మానవునికి ముఖ్యంగా నాయకునికి ప్రజల బాధ్యత ఉంది. దేశ కాలపరిస్థితులను బట్టి ఈ సామాజిక బాధ్యత నాయకుడిని ఒక ప్రవక్తగానో, ఒక మత సంస్కర్తగానో, సాంఘిక సంస్కర్తగానో, ఒక రాజనీతివేత్తగానో మలుస్తుంది. వాల్మీకి కీర్తించిన రామచరితంలో శ్రీరామచంద్రుడిలో ఈ లక్షణాలన్నీ ప్రకటితములయ్యాయి.

రామరాజ్యానికి కేంద్రం ధర్మం

రామరాజ్యంలో శాంతి వెల్లివిరిసింది. ప్రజలు ధర్మాన్ని అనుసరించారు; సుఖసంపన్నం, వైభవసంపన్న జీవనాన్ని గడిపారు. పరిస్థితిని ఆకళింపు చేసుకోవడంలోని ఆయన సామర్థ్యం, నిశిత రాజకీయ దృష్టి, రాజనీతి నేతృత్వం, వ్యక్తిగతమైన త్యాగాలు ప్రజా సేవకు, దుష్ట సంహారానికి, సాధుసంరక్షణకు వినియోగించారు. ఆయన నిశ్చయం. ధర్మాన్ని రక్షించడంలో విజయవంతమైన ఆయన కృషి. (ధర్మమంటే సమాజాన్ని కలిపి ఉంచేది. వికారాలన్నిటినీ తొలగించి, విభేదాలను సమన్వయ పరచి, పరస్పర వైమనస్యాన్ని రూపుమాపి, సుసంపన్నమైన వైవిధ్యంలో నిహితమై ఉన్న ప్రజల మౌలిక ఏకత్వాన్ని గుర్తింపజేసేది). శ్రీరామచంద్రుని జీవితంలోని ఈ అంశాలను, నేటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను జాగ్రత్తగా అధ్యయనం చేయవలసి ఉంది. మన దేశంలో రామరాజ్యాన్ని స్థాపించాలంటే ఆయనలోని విశిష్టాంశాల ఉపదేశాలను జీర్ణించుకోవాలి. ఆనుసరించాలి.



పూజ్య శ్రీ గురూజీ

రామరాజ్యం నేటికీ స్ఫూర్తిప్రదం

అధునాతన యుగంలో మానవుడు అధికారికంగా రాజకీయ జీవి అవుతున్నాడు. రాజకీయ ఆశయాలు ప్రబలంగా ఉన్న ఈ రోజులలో కూడా బ్రిటిషుపాలకులను పారద్రోలడానికి శ్రీరామచంద్రుడు ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాడు. మరాఠీ పత్రిక 'కాల్' సంపాదకుడు స్వర్గీయ శివరామ్ మహాదేవ వరంజపే రాక్షస సంహారకుడైన కోదండరాముని సాహసకృత్యాలను గుర్తుచేశారు. అలా విదేశీ ఆధిపత్యాన్ని ప్రతిఘటించడానికి దృఢ నిశ్చయాన్ని ప్రజలలో ప్రజ్వలింపజేయడానికి కృషి చేశారు. తమను తాము బాగుపరచుకోవడానికి, ఆర్థికంగా ఉన్నతిని సాధించడానికి ప్రజలకు స్ఫూర్తి ఇచ్చేందుకు మహాత్మాగాంధీ ఆ 'రామరాజ్యాన్ని' వారిదృష్టికి తెచ్చాడు.

విశుద్ధమైన వ్యక్తిగత శీలం, ప్రజల కష్టాలతో మమేకం కావడం, నిరాడంబర జీవితం, అజేయమైన సైనిక శక్తితోను. రణకౌశలంతోను, దురాక్రమణ శక్తులను నిర్జించడం ద్వారా కష్టాలను తొలగించడం, సత్యం పట్ల ప్రేమ,మాట నిలుపుకునేందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధపడాలన్న సంకల్పం, ప్రజాభ్యున్నతి కోసం సంపూర్ణంగా ఆత్మార్పణ చేయడం వంటివి రామరాజ్య స్థాపనకు నాయకులకు ఉండవలసిన లక్షణాలు.

దేశమంతా నిరాశా, నిస్పృహలలో మునిగి ఉన్నట్లు కనపడుతూన్న ఈ తరుణంలో, నాయకత్వం వహించేవారికి రామచంద్రుని ఈ గుణగణాలు ఆశారేఖలు కాగలవు. తరతరాలుగా ప్రజలకు అడుగడుగున తోడునీడగా, అండగా, శక్తి స్రోతస్సుగా, దివ్యజ్యోతిగా ఉన్న శ్రీరామచంద్రుడు, శబరి అందించిన అడవి పండ్లను స్వీకరించినట్లుగా ఆయన దివ్యస్మృతికి అంకితం చేసిన ఈ భావ ప్రసూనాలను స్వీకరించునుగాక! మన కృషిద్వారా మన భరతభూమిలో రామరాజ్య స్థాపనకు ఆయన మనకు సన్మార్గాన్ని ప్రసాదించునుగాక!

రుషి, ద్రష్ట అయిన వాల్మీకి తానా మహా కావ్యాన్ని ఎవరికోసం రాస్తున్నాడో ఆ ప్రజల మానసిక ప్రవృత్తిని సరిగా ఆకళింపు చేసుకున్నాడు. అపకార పురుషుల జీవితాలు పురుషకారంలేని భక్తితో జపించదగినవి మాత్రమేననీ, అనుసరించడానికీ, ఆచరణలో పెట్టడానికి కావనే బలహీనత ప్రజలలో ఉన్నదని ఆయన గుర్తించాడు. ఈ బలహీనత ప్రజలను తిరోగమనవాదులుగాను, అలసులుగాను, ఆ కారణాన పతనోన్ముఖులుగాను మాత్రమే చేస్తుంది. తన్ను సంస్కరించుకోవాలనీ, స్వర్గంలోని జగత్పిత వలెనే సర్వసమగ్రుడను కావాలనీ, గతిశీలమైన కర్తృత్వం ద్వారా ఈ ప్రపంచంలో విశుద్ధము, వైభవయుశము అయిన జీవనాన్ని నిర్మించాలనీ, అవతారంలో ప్రకటితమైన సత్యాన్ని, మానవుని నిజధర్మాన్ని సాక్షాత్కరింపజేసుకోవాలనే ఆకాంక్ష అణచివేయబడుతుంది. దాని స్థానాన్ని అవనతికి, విచ్ఛిత్తికి, చివరకు వినాశనానికీ దారితీసే భక్తి అని పిలిచే అకర్మణ్యత ఆక్రమిస్తుంది. నేడు కూడా ఈ బలహీనత ప్రకటితమవుతోంది. వివిధ పరిస్థితులలో, కష్టాలలో, సుఖాలలో మన ప్రజలు ఈ మహా వ్యక్తిత్వం నుండి స్ఫూర్తిని పొందారు; విజయప్రాప్తికై తమ మార్గాన్ని తీర్చిదిద్దుకున్నారు.

(శ్రీ వై.యస్. జమ్‌దార్ రచన 'శ్రీరామచంద్రుని రాజనీతి' ఆంగ్ల గ్రంథానికి 1949 డిసెంబరులో పూజ్య శ్రీ గురూజీ వ్రాసిన ప్రస్తావన నుండి)

నవ్విపోదురు

ముఖ్యమంత్రి.. ఓ రాష్ట్రానికి పరిపాలనాధిపతి. పాలనావ్యవస్థ మొత్తం ఆయన చేతుల్లోనే ఉంటుంది. మొత్తానికి రాష్ట్రానికి ఆయనే అధిపతి. ఆయన ప్రాతినిథ్యం రాష్ట్రం మొత్తానికి. ఆయన ఆలోచన రాష్ట్రం మొత్తానికి సంబంధించినదిగా ఉండాలి. ప్రతిపనీ రాష్ట్రాన్ని దృష్టిలో పెట్టుకొని చేయాలి. రాష్ట్రాన్ని ప్రగతిపథంలోకి తీసుకెళ్లేలా ఉండాలి. రాష్ట్ర అధికార, రాజకీయ యంత్రాంగమంతా ఆయన కనుసన్నల్లోనే పనిచేస్తుంది. ఆయన హుందాతనమే రాష్ట్ర హుందాతనం. ఆయన ప్రసంగించే తీరు, గౌరవ ప్రదమైన వ్యవహారమే రాష్ట్రానికి గౌరవప్రదం. కానీ, తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరు ముఖ్యనేతల వ్యవహారశైలి, ప్రసంగం తీరు, మాట్లాడుతున్న భాష వెగటు పుట్టిస్తోంది. రాష్ట్రం పరువును కూడా బజారున పడేస్తోందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

కేసీఆర్

రేవంత్

వాస్తవానికి ముఖ్యమంత్రి, మంత్రి అనే విషయం పక్కనబెడితే.. రాజకీయ నాయకులంటే సమాజంలో ఓ గౌరవం ఉంటుంది. అధికారం ప్రతిపక్షం అన్న సంబంధం లేకుండా సాధారణ ప్రజలు రాజకీయ నేతలను సమాజంలో హోదా ఉన్న వ్యక్తులుగా గుర్తిస్తారు. నేతల మాట, నడత సమాజంపై పెను ప్రభావమే చూపిస్తుంది. ప్రజలు ప్రతిక్షణం వారిని గమనిస్తూ ఉంటారు. అనుచరులు వారు చెప్పినట్టు నడుచుకుంటారు. అందుకే నేతలు మాట్లాడే మాటలు, వారి మాటతీరు ఎంత హుందాగా ఉంటే వారికీ, సమాజానికి కూడా అంతే మంచి జరుగుతుంది. వారికీ అదే రీతిలో గౌరవం లభిస్తుంది. కానీ ప్రస్తుత రాజకీయాల్లో ఆ హుందా తనమే కరువయింది. నోటికి సైతం హద్దూ అదుపూ ఉండడం లేదు. కోట్లాదిమంది తమ మాటలు వింటారన్న కనీస స్పృహ లేకుండా ఇష్టారీతిన నోటికి ఏది వస్తే అదే మాట్లాడడం ఇప్పుడు రాజకీయ నాయకుల లక్షణంగా మారిపోయింది.

ఒకరేమో మాజీ ముఖ్యమంత్రి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత పదేళ్లపాటు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన ఒకప్పటి టీఆర్ఎస్.. ఇప్పటి బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు. మరొకరేమో ప్రస్తుత ముఖ్యమంత్రి. అంటే.. తెలంగాణ రాష్ట్రానికి మొదటి, రెండవ ముఖ్య మంత్రులు వాళ్లు. ఒకరేమో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. మరొకరేమో ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. వీళ్లిద్దరు మాట్లాడే భాష.. తిట్టుకునే తీరు.. దూషించుకునే తత్వం చూసి తెలంగాణ ప్రజలే నోరెళ్లబెడుతున్నారు. ఫక్తు రాజకీయ నాయకు లయినా.. వీధిలో ఆకతాయిల్లా భాషను వాడుతున్నారు. పైగా మీడియా ముందు.. అధికారిక బహిరంగసభల వేదికలపై అభ్యంతరకరమైన భాషను వాడుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే పత్రికల్లో రాయలేని, టీవీల్లో ప్రసారం చేయలేని భాషను ఇద్దరూ వాడుతున్నారు. వీధి కొట్లాటల్లా భావిస్తున్నారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్ల కాలంలో సీఎంగా కేసీఆర్ ఎన్నో సందర్భాల్లో, రాజకీయ ప్రచారాల్లో మాట్లాడారు. తెలంగాణ మాండలికంలో అనేక రకాల పదాలను, ప్రజలకు చెడు అర్థంగా భావించే మాటలను కేసీఆర్ ఆయా సమయాల్లో అలవోకగా వాడేశారు. అందుకే పదేళ్ల కాలంలో ఎన్నోసార్లు కేసీఆర్ భాషపై మేధావుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యేవి. రాష్ట్రం ఏర్పాటు తర్వాత తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ సంప్రదాయాన్ని నిలబెడుతున్నారు. ఇంకా చెప్పాలంటే.. కేసీఆర్‌కన్నా పదాకులు ఎక్కువే చదివినట్టుగా రేవంత్ రెడ్డి మాటతీరు ఉంది.

తెలంగాణలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సీజన్ నెలకొంది. వచ్చేనెల 13వ తేదీన పోలింగ్ జరగ నుంది. గత నవంబర్‌లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి కలలో కూడా ఊహించని రీతిలో చతికిలపడింది. పదేళ్లపాటు పూర్తిస్థాయి మెజారిటీతో, ఒక దశలో అసలు రాష్ట్రంలో ప్రతిపక్షం అనేదే ఉండకుండా చేసే స్థాయిలో వెలుగొందినా.. మొన్నటి ఎన్నికల్లో మాత్రం బీఆర్ఎస్ బొక్కబోర్లా పడింది. ఆ ఫ్రస్ట్రేషన్ ఇప్పుడు కేసీఆర్ విమర్శల్లో కనిపిస్తున్నట్లు తోస్తోంది. దాదాపు మూడు నెలల పాటు సైలెంట్‌గా ఉన్న కేసీఆర్.. ఒక్కసారిగా తనలో దాగిన ఆక్రోశాన్నంతా వెళ్లగక్కారన్న సంకేతాలు కరీంనగర్ పర్యటనలో బయటపడ్డాయి. దీంతో.. ఇన్నాళ్లుగా మామూలు విమర్శలకే పరిమితమైన రేవంత్‌రెడ్డి కూడా అదే స్థాయిలో రెచ్చిపోయారు. జాతీయస్థాయి నేతలు హాజరైన తుక్కుగూడ బహిరంగ సభా వేదికపైనుంచి కేసీఆర్‌ను ఏకి పారేశారు. కేసీఆర్‌నే కాదు.. ఆయన కుటుంబ సభ్యులైన రాజకీయ నాయకులపైనా విమర్శల వర్షం కురిపించారు.

లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణలో రాజ కీయాలు రంజుగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు మించి నాయకులు పోటీపడి విమర్శలు గుప్పించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అత్యధిక సీట్లు గెలుచు కోవాలనే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా.. అనూహ్యంగా అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా పుంజు కోవాలని చూస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ ముఖ్యనాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి జారుకుంటు న్నారు. అయినా కేసీఆర్.. ఇన్నాళ్లు గుంభనంగా

సుజాత గోపగోని, 6302164068

గాక.. మాకేటి సిగ్గు!

ఉన్నారు. ఆ వెలితి బయటపడకుండా జాగ్రత్త పడ్డారు. అయితే, వర్షాభావం, భూగర్భ జలాల కొరత కారణంగా పంటలు ఎండిపోవడం కేసీఆర్‌కు ఓ ఆయుధంలా మారింది. మారిందనడం కంటే ఆ పరిస్థితులను ఆయుధంగా మలచుకున్నారు కేసీఆర్. రైతులకు న్యాయం చేయాలని, వారిని ఆదుకోవాలని, నష్టపోయినవాళ్లకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తొలిరోజు పర్యటనలో జనగామ జిల్లా, సూర్యాపేట జిల్లాల్లోని పలు గ్రామాల్లో పంటపొలాలను పరిశీలించారు ఆయన. ఆ తర్వాత.. సూర్యాపేటలో మీడియా సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ కాస్త సంయమనంతో వ్యవహరించారు. పెద్దగా ఆవేశంగా మాట్లాడలేదు. మరుసటిరోజు చూసుకుందామంటూ మీడియా ప్రతినిధులకు కూడా సర్దిచెప్పారు.

ఆ తర్వాత రెండో విడతగా కరీంనగర్‌లో పర్యటించిన కేసీఆర్ శివాలెత్తి పోయారు. ప్రభుత్వంపై, ప్రభుత్వ పనితీరుపై, ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలకు పదునుపెట్టారు. రేవంత్ రెడ్డిపై ఘాటుగానే తిట్ల దండకం అందుకున్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడారు. పత్రికల్లో రాయలేని విధంగా, టీవీల్లో టెలికాస్ట్ చేయలేని విధంగా దూషణలు చేశారు. అయితే, ఆ మరుసటి రోజే హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌పార్టీ బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి కూడా తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ భాషలోనే రేవంత్‌రెడ్డి కూడా సమాధానం చెప్పారు.

కరీంనగర్ జిల్లాలో పర్యటన సందర్భంగా రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఆ సమయంలో కేసీఆర్ భాష కూడా బౌండరీ దాటేసింది. అన్‌పార్లమెంటరీ పదాలను అల్లుకుంటూ పోయారు. ఆ ఫ్లోలో బూతు పురాణం అందుకున్నారు.

ముఖ్యమంత్రి పదవి ఊడిపోయిన తర్వాత కేసీఆర్ మాట్లాడిన ఈ భాష ఆయనలో ఫ్రస్ట్రేషన్‌కు అద్దం పట్టిందన్న విమర్శలు వినిపించాయి. బీఆర్ఎస్ ఓటమిని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ఇన్నాళ్లు.. ఆ ఆవేదనంతా లోపలే దాచుకున్నారని, కనీసం బయటకు కూడా రాలేదని, కనీసం కన్నకూతురు కవితను ఈడీ అధికారులు ఢిల్లీ నుంచి వచ్చి అరెస్టు చేసినా కేసీఆర్ ఇంట్లో నుంచి బయటకు రాలేదన్న విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ఆ ఆక్రోశమంతా వెళ్లగక్కుతున్నారని సొంతపార్టీ నేతలు కూడా చెవులు కొరుక్కున్నారు.

కేసీఆర్ ఉపయోగించిన ఆ భాషకు రేవంత్‌రెడ్డి కూడా తానేమీ తక్కువ తినలేదని నిరూపించు కున్నారు. ఒకరకంగా కేసీఆర్.. తాను రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన ముఖ్యమంత్రిని అన్న విషయాన్ని మర్చిపోయి దూషణల పర్వం అందుకున్నారు. వాస్తవానికి ఆయన ఆ విషయం తెలియకుండా మాట్లాడటం అనేది కాకున్నా.. కనీస హుందాతనంతో వ్యవహరించాల్సి అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయినా విజ్ఞత పాటించలేదు. సంయమనంతో వ్యవహరించ లేదు.

“తమలపాకుతో తానొకటంటే తలుపుచెక్కతో నే రెండంటా” అనే సామెత లాగా వ్యవహరించారు. ఇద్దరూ దొందూ దొందే అన్నట్లుగా పరస్పరం తిట్ల పర్వం సాగించుకున్నారు. ఆ మరుసటిరోజే.. తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభలో రేవంత్‌రెడ్డి కూడా ఏమాత్రం తగ్గకుండా ప్రతిస్పందించారు. డిసెంబరు నుంచి ఇప్పటిదాకా అనేకసార్లు కేసీఆర్‌పైనా, ఆయన కుటుంబంపైనా, బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసినవారిపైనా రేవంత్ విమర్శలు చేసినప్పటికీ.. తుక్కుగూడ సభలో మాత్రం ఆయన అన్ని హద్దులూ చెరిపేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను ఉత్సాహపరిచే క్రమంలోనో శక్తిమంతమైన ప్రసంగం చేయాలన్న ఉద్దేశంతోనో, ప్రతీకారేచ్ఛ ప్రతిధ్వనించాలన్న ఆలోచనతోనో కానీ రేవంత్ గతంలో ఎన్నడూ లేని విధంగా మాట్లాడారు.

కేసీఆర్ భాషపై సీఎం రేవంత్ గట్టిగానే రెచ్చిపోయారు. కేసీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడితే.. చర్లపల్లి జైలుకు పంపించి చిప్పకూడు తినిపిస్తామని హెచ్చరించారు. అడవి పందిలా పదేళ్లపాటు తెలంగాణను సర్వనాశనం చేశారని.. పదేళ్లలో వందేళ్ల విధ్వంసం చేశారని, మీ కాలు విరిగిందని, మీ కూతురు జైలుకి పోయిందని కొంతకాలం మేము సంయమనం పాటించానన్నారు. ‘అలా అని.. ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోను.. నేను రేవంత్ రెడ్డిని అని గుర్తు పెట్టుకో బిడ్డా. మా కార్యకర్తలతో జాగ్రత్త’ అంటూ చెలరేగిపోయారు. చర్లపల్లి జైల్లో చిప్పకూడు తిని పిస్తా. నువ్వు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టివ్వలేదు. నేను మాత్రం నీకు తప్పకుండా చర్లపల్లి జైల్లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తానని హెచ్చరించారు.

మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలు, ప్రతి విమర్శలు.. బూతు పురాణం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. రాజకీయ విమర్శలు మరీ.. ఇంతలా దిగజారుతున్నాయన్న చర్చ నడుస్తోంది. ఎవరు ఎక్కువ తిట్లు తిట్టగలం అనేదానిపై నేతలు ఒకరితో ఒకరు పోటీపడుతు న్నారు తప్ప.. ప్రజలకు మంచి చేయడానికి ఏం చేయాలన్నది ఆలోచించడం లేదు. తీవ్ర విమర్శలు చేసుకుంటున్న రేవంత్, కేసీఆర్ ఇద్దరూ.. ఆ హుందాతనాన్ని మర్చిపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

త్వరలో 25 మంది టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

మద్యం కుంభకోణంలో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత భవిష్యత్తు ఏమిటి? తనకు తాను చెప్పుకుంటున్నట్టు కడిగిన ముత్యంలా బయటకొస్తారా? లేకపోతే విచారణలో మరిన్ని నిజాలు బయటకొచ్చి ఆమెకు ఉచ్చు బిగుసుకుంటుందా? ఓ వైపు ఈడీ విచారణ, రెండో వైపు ఆమె చేస్తున్న న్యాయపోరాటం ఆమెను ఏ గమ్యానికి చేరుస్తాయనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

పీకల్లోతు కష్టాల్లో కవిత

కవిత అరెస్టు కావటం అనేది అకస్మాత్తుగా అనూహ్యంగా సంభవించిన పరిణామేం కాదు. గత ఏడాదిగా ఆమె అరెస్టవుతారన్న ప్రచారం సాగుతూనే ఉంది. మద్యం కుంభకోణంలో, మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెను సీబీఐ, ఈడీ విభాగాలు ఇప్పటికే విచారించాయి. మొదట్లో ఆమెను సాక్షిగా విచారించిన అధికారులు తర్వాత ప్రధాన ముద్దాయిగా చేర్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో మార్చి 15వ తేదీన హైదరాబాద్‌లోని ఆమె ఇంటి నుంచి అరెస్టు చేశారు. అంతకు ముందు ఐదు గంటలపాటు ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించారు. "ఈ కేసులో ఇప్పటివరకు హైదరాబాద్, ముంబయి, చెన్నైలతో పాటు 245 ప్రాంతాల్లో సోదాలు చేశాం. మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌తో పాటు మొత్తం 15 మందిని అరెస్టు చేశాం. రూ.128.79 కోట్ల ఆస్తులను జప్తు చేశాం" అని ఈడీ తన వెబ్ సైట్‌లో వివరించింది.

అసలు మద్యం కుంభకోణం ఏమిటి?

2021 వరకూ ఢిల్లీలో ప్రభుత్వమే మద్యం అమ్మేది. తరువాత ప్రైవేటుకు ఇద్దాం అనుకున్నారు. ఆ క్రమంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనేది ఆరోపణ. దీనిపై నాటి లెఫ్టినెంట్ గవర్నర్ సీబీఐ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో కొత్త విధానం వద్దనుకుని పాత పద్ధతిలోనే వెళ్లాలని ఆప్ ప్రభుత్వం నిర్ణయించింది.

2021 నవంబర్ నుంచి కొత్త విధానం అమలయింది. ప్రైవేటు సంస్థలకు మద్యం అమ్మే పద్ధతి ప్రారంభించడంతోపాటు, మాఫియాను నియంత్రించడం, ప్రభుత్వానికి ఆదాయం పెంచడం, వినియోగదారుల సమస్యలు పరిష్కరించడం లక్ష్యంగా కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చినట్టు ఆప్ ప్రభుత్వం ప్రకటించింది. కొత్త విధానంవల్ల గతంకన్నా ఎక్సైజ్ ఆదాయం 27 శాతం పెరిగి రూ. 890 కోట్లకు చేరుకుందని చెప్పింది. ఎంఆర్‌పీ కన్నా తక్కువకు మద్యం అందించేలా ప్రభుత్వం ప్రోత్సహించింది. అందుకు అనుగుణంగా విక్రయదారులకు రాయితీలను అందించింది. వినియోగదారులకు మేలు కలుగుతుందని పేర్కొంది.

మద్యం రిటైలర్లు, ఒకటి కొంటే ఒకటి ఉచితంగా ఇస్తూ విక్రయాలు పెంచుకున్నారు. పలు బ్రాండ్లపై ఎంఆర్‌పీ కన్నా తక్కువ మద్యం అందుబాటు లోకి రావడంతో దిల్లీలో అమ్మకాలు పెరిగాయి.

ఇలా ప్రైవేటు వారికి అప్పగించే క్రమంలో అనేక అక్రమాలు చోటుచేసుకు న్నాయని పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందనే ఆరోపణలు వచ్చాయి. దీనితో సీబీఐ విచారణ చేపట్టింది. ఆప్ మంత్రి మనీష్ సిసోదియా ఇంటిలో సీబీఐ సోదాలు చేసింది. ఆ వెంటనే, దీని వెనుక అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమార్తె కవిత హస్తం కూడా ఉందని ఢిల్లీ బీజేపీ నాయకులు ఆరోపించారు. ఇదంతా బీఆర్ఎస్‌ను దెబ్బతీసే కుట్రగా కేసీఆర్ తో పాటు, ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు ఆరోపించారు. 'ఈడీ..మోడీ.. బోడీ' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు కూడా చేశారు.

2022 నవంబర్ 29న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరు తొలిసారి వెలుగులోకి వచ్చింది. రెండు వేర్వేరు నెంబర్లతో మొత్తం పది మొబైల్ ఫోన్లను మార్చారని, డిజిటల్ ఆధారాలు ధ్వంసం చేశారని ఆమెపైన ఆరోపణలు వచ్చాయి. అదే ఏడాది డిసెంబరు 11న కవితను ఆరుగంటల పాటు సీబీఐ విచారించింది. సీబీఐ అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం ఇచ్చానని మీడియాకు వివరించారు కూడా. గత ఏడాది మార్చి 16, 20, 21తేదీలలో మూడుసార్లు విచారించారు.

ఈడీ ఛార్జిషీటులో కీలకవిషయాలు

కవితను విచారణకు హాజరుకావలసిందిగా ఈడీ నోటీసులు ఇవ్వటం అప్పట్లో కలకలం రేపింది. ఈ కేసులో తొలుత ఇండో స్పిరిట్స్ సంస్థ యజమాని సమీర్ మహేంద్రు అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత వరుసగా 11 మంది అరెస్ట్ అయ్యారు. సమీర్ మహేంద్రు అరెస్ట్ సమయంలో ఈడీ ఛార్జ్‌షీట్‌లో కీలక అంశాలు ప్రస్తావిం చింది. లిక్కర్ స్కాంపై ఈడీ చార్జ్ షీట్‌లో అరుణ్ పిళ్లై పాత్రపై కీలక సమాచారం ఉంది. కవిత తరపున అరుణ్‌పిళ్లై అన్నీ తానై చూసుకున్నారని, అరుణ్‌తో వ్యాపారం చేస్తే తనతో చేసినట్లేనని కవిత పేర్కొన్నారని, ఈ నేపథ్యంలో దక్షిణాది నుంచి రూ. వందకోట్లు

ముడుపులు ముట్టజెప్పారని వివరించింది. సమీర్ మహేంద్రుపై దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఈడీ కవిత పేరును మొత్తం 28 సార్లు ప్రస్తావించింది. సౌత్ గ్రూప్ ప్రతినిధులుగా అరుణ్ పిళ్లై, అభిషేక్, బుచ్చి బాబు ఉన్నారు. పిళ్లై సూచనలతో ఇండో స్పిరిట్స్ నుంచి ఆంధ్రప్రభ పబ్లికేషన్స్‌కు కోటి రూపాయలు, ఇండియా ఎహెడ్ సంస్థకు రూ.70 లక్షల బదిలీ అయ్యాయి. కవిత ఈ ప్రయోజనాలకు అరుణ్ పిళ్లై ప్రాతినిధ్యం వహించారు. తమ తరపున వాస్తవంగా పెట్టుబడి పెడుతున్నవారు కవిత, శరత్‌చంద్రారెడ్డి, వైసీపీ ఎంపీ మాగుంట అని సమీర్ మహేంద్రుకు అరుణ్ పిళ్లై చెప్పారు.

2021లో ఢిల్లీలోని తాజ్ మాన్‌సింగ్ హోటల్‌లో విందు ఏర్పాటయ్యింది. అరుణ్‌పిళ్లై ద్వారా, ఫేస్ టైంలో సమీర్ మహేంద్రు, కవిత మాట్లాడుకున్నారు. ఎల్1 దరఖాస్తు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అరుణ్ పిళ్లై ద్వారా కవితతో సమీర్ మహేంద్రు మాట్లాడారు. ఈ వ్యాపారాన్ని అనేక రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున విస్తరిస్తామని కవిత వెల్లడించారని పేర్కొంది.

జనవరి6, 2023న స్పెషల్ కోర్టులో ఈడీ రెండో చార్జిషీట్ దాఖలు చేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేరును ప్రస్తావించి సమీర్ మహేంద్రుతో ఆయన మాట్లాడినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 8న ఎమ్మెల్సీ కవిత మాజీ ఆడిటర్ గోరంట్ల బుచ్చిబాబును సీబీఐ అరెస్టు చేసింది. ఫిబ్రవరి 25న సమీర్ మహేంద్రు, విజయ్ నాయర్, దినేష్ అరోరా, అరుణ్ రామచంద్రన్ పిళ్లై, అమిత్ అరోరా తదితరుల ఆస్తులను జప్తు చేసింది. ఫిబ్రవరి 26న ఢిల్లీలో హైడ్రామా చోటు చేసుకుంది. మనీష్ సిసోడియాను సుదీర్ఘంగా విచారించిన సీబీఐ అదే రోజు సాయంత్రానికి అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించింది. అప్పటినుంచి మధ్యంతర బెయిల్ కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావటం లేదు. ఆయన తీహార్ జైలులోనే మగ్గుతున్నారు. ఆయనతో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఆప్ కమ్యూనికేషన్స్ ఇన్ఛార్జి విజయ్ నాయర్ కూడా అరెస్టుకాగా, సంజయ్‌సింగ్‌కు తాజాగా బెయిల్ లభించింది.

కవితను అరెస్టు చేయటానికి ముందు, ఆమెతోపాటు మనీష్ సిసోడియా, అరుణ్ రామచంద్రన్ పిళ్ళై, దినేష్ అరోరా, బుచ్చిబాబు, సిసోడియా మాజీ కార్యదర్శి అరవింద్, ఎక్సైజ్ శాఖ మాజీ అధికారులు కుల్దీప్ సింగ్, నరేంద్ర సింగ్‌లను విడివిడిగా, కలిపి ఈడీ ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ముఖ్యంగా కవిత, అరుణ్ పిళ్లైలని కలిపి ఈడీ అధికారులు విచారించారు. ముఖ్యంగా పిళ్లైతో కవితకు ఉన్న వ్యాపార సంబంధాలు, లిక్కర్ స్కాంలో సౌత్ గ్రూప్ పాత్రపై కవితను ఈడీ ప్రశ్నించినట్లు చెబుతున్నారు.

కొన్ని కీలకపరిణామాలు

- సెప్టెంబర్ 4, 2020 న కొత్త లిక్కర్ పాలసీ తయారీ కోసం ఎక్సైజ్ కమిషనర్ నేతృత్వంలోని కమిటీకి డిప్యూటీ సీఎం ఆదేశాలు.
- జనవరి 5, 2021న లిక్కర్ పాలసీ పై సీఎం కేజ్రీవాల్ అధ్యక్షతన కేబినెట్ భేటీ. సిసోడియా, సత్యేంద్రజైన్, కైలాశ్ గెహ్లాట్‌తో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఏర్పాటుకు నిర్ణయం.
- మార్చి 22, 2021న రెండు నెలల తర్వాత నివేదికను సిద్ధం చేసిన కమిటీ. కేబినెట్ మీటింగ్‌లో సమర్పించడంతో దీని ప్రకారమే 2021-22 పాలసీ తయారు చేయాలని ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు కీలక ఆదేశాలు.
- మే 21, 2021న కొత్త లిక్కర్ పాలసీకి కేజ్రీవాల్ కేబినెట్ ఆమోదం
- నవంబర్ 8, 2021న ఫారిన్ లిక్కర్ ధరల విషయంలో సంబంధిత అథారిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కేజ్రీవాల్ సర్కార్ నిర్ణయం తీసుకుందని లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సెనా ఆరోపణ.
- జులై 20, 2022న పాలసీలో అన్నీ అవకతవకలు ఉన్నాయని, ఇదంతా ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగేంచేలా ఉందని కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లాకు లెఫ్టినెంట్ గవర్నర్ లేఖ.
- జులై 22, 2022న లేఖ పరిగణనలోనికి తీసుకుని సీబీఐ దర్యాప్తునకు కేంద్ర హెూం శాఖ ఆదేశాలు.
- ఆగస్టు 19, 2022న 15 పేర్లతో సీబీఐ ఎఫ్ఐఆర్.. ఇదే రోజు డిప్యూటీ సీఎం సిసోడియాతో పాటు 25 చోట్ల సోదాలు.
- ఆగస్టు 22 న ఈడీ ఎంట్రీ, కేసు ఫైల్
- సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లో ఉన్న అరుణ్ రామచంద్రన్ పిళ్లైకు చెందిన రాబిన్ డిస్టలరీస్, రాబిన్ డిస్ట్రిబ్యూటర్స్ కంపెనీలు.. నివాసంపైనా మొత్తం ఆరుచోట్ల ఈడీ సోదాలు
- సెప్టెంబర్ 17న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు పర్సనల్ ఆడిటర్‌గా పనిచేసిన గోరంట్ల బుచ్చిబాబు నివాసం, ఆఫీసులో ఈడీ సోదాలు
- సెప్టెంబర్ 22న మనీలాండరింగ్ ఆరోపణలపై అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డినిపై ఈడీ ప్రశ్నల వర్షం.
- అక్టోబర్ 7న ముత్తా గౌతమ్ విచారణ, సంబంధింత ఆఫీసుల్లో సోదాలు
- అక్టోబర్ 10న లిక్కర్ స్కామ్‌లో సంబంధాలున్నాయని బోయిన్‌పల్లి అభిషేక్‌ను అదుపులోనికి తీసుకున్న సీబీఐ.. అదే రోజు అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటన.
- అక్టోబరు 12న ముత్తా గౌతమ్ అరెస్ట్
- అక్టోబరు 17న డిప్యూటీ సీఎం సిసోడియాను ప్రశ్నించిన సీబీఐ అధికారులు.
- నవంబరు 10న అరబిందో ఫార్మా శరత్‌చంద్రారెడ్డిని అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు.
- నవంబరు 14న ఆప్‌కు చెందిన విజయ్ నాయర్, బోయిన్‌పల్లి అభిషేక్ అరెస్ట్.
- నవంబరు 16న దినేశ్ అరోరా అప్రూవర్‌గా మారడానికి ప్రత్యేక కోర్టు అనుమతి.
- నవంబర్ 25న ఢిల్లీలోని స్పెషల్ కోర్టులో 10వేల పేజీల చార్జిషీట్‌ను సమర్పించిన సీబీఐ
- నవంబరు 26న లిక్కర్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ మొదటి చార్జిషీట్.
- నవంబరు 29న సౌత్ గ్రూపులో అమిత్ అరోరా కీలక పాత్ర పోషించినట్లు ఈడీ రిమాండ్ రిపోర్టు.
- నవంబర్ 29న తొలిసారి కల్వకుంట్ల కవిత పేరు.. రెండు వేర్వేరు నెంబర్లతో మొత్తం పది మొబైల్ ఫోన్లను మార్చారని.. డిజిటల్ ఆధారాలు ధ్వంసం చేసినట్లు ఆరోపణలు
- డిసెంబరు 6న విచారణకు రావాలని కవితకు సీబీఐ నోటీసు.
- డిసెంబరు 11న కొన్ని అనివార్య కారణాలతో సీబీఐ విచారణకు హాజరుకాని కవిత
- డిసెంబర్ 11న ఉదయం నుంచి సాయంత్రం వరకు కవిత నివాసంలోనే 6గంటలపాటు సీబీఐ విచారణ.
- ఫిబ్రవరి, మార్చి 2023: నాటి దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియాను సీబీఐ, ఈడీలు అరెస్టు. ఆయన ఇప్పటికీ జైలులోనే ఉన్నారు.
- మార్చి 15, 2024 : హైదరాబాద్‌లో సోదాల అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్
- మార్చి 21: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది.

మొదటిసారి కవితను విచారించినప్పుడే సాయంత్రం 6గంటలు దాటితే మహిళను విచారించ కూడదని.. అది చట్ట విరుద్ధమని కవిత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. అయితే రెండోరోజు విచారణలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. రెండో రోజు మొత్తం 9 గంటలపాటు కవితను ఈడీ అధికారులు విచారించారు. కీలక ఆధారాలు దొరక్కుండా చేయటంలో భాగంగానే మొబైల్ ఫోన్లు ధ్వంసం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలు, స్కామ్‌లో సౌత్ గ్రూప్ పాత్రపై విచారించారని సమాచారం. ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురు అప్రూవర్లుగా మారటంతో కేసు అనేక మలుపులు తిరిగింది. కేసులో కీలక వ్యక్తులు అప్రూవర్లుగా మారారు. దీనితో కవితకు ఉచ్చు బిగుసుకుంది.

కేసీఆర్ మౌనం వెనక వ్యూహం ఉందా?

అందరిలోనూ ఇదే ప్రశ్న. మద్యం కేసులో కన్నబిడ్డ అరెస్టయి జైలు పాలయినా కేసీఆర్ ఎందుకు నోరుమెదపలేదు? బీఆర్ఎస్ శ్రేణులతో పాటు ప్రత్యర్థి పార్టీల వారినీ ఈ పరిణామం ఆశ్చర్యానికి గురిచేసింది. అరెస్టు సమయంలో ఆయన కవిత ఇంటికి రాలేదు. బహిరంగంగా ఆమెకు దన్నుగా నిలబడ్డానన్న సంకేతాలను ఇవ్వలేదు. కవితకు అండగా సోదరుడు కేటీఆర్, సమీపబంధువు హరీష్ రావు నిలబడ్డారు.

ఆ తర్వాత వరుస పరిణామాలు సంభవిస్తున్నా, కేసీఆర్ ఇప్పటి వరకూ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ స్పందించలేదు. నిజానికి ఆయన ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో బీజేపీపైన విమర్శలు చేయటం ద్వారా నైతికంగా పార్టీకి ఊపు రావచ్చు. మొన్నటి ఎన్నికల్లో కేసీఆర్ ఓడిపోకపోయి ఉంటే, పార్టీ పరిస్థితి ఇంత దయనీయంగా మారకపోయి ఉంటే కవిత అరెస్టయ్యేది కాదనే అభిప్రాయాలూ ఉన్నాయి. రాజకీయంగా దయనీయ మైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సమస్యలు కొనితెచ్చు కోవటం ఎందుకని ఆయన భావించి ఉండొచ్చు. కుంగి కునారిల్లిన దశలో మోదీపైన కత్తులు నూరగలిగిన సత్తా కేసీఆర్‌కు ఉంటుందని చెప్పలేం. ఈడీ విచారణకు హాజరు కావలసిందిగా గత ఏడాది కవితకు నోటీసులు పంపిన సందర్భంలో– ఢిల్లీ వెళుతున్న కవితకు ఫోన్‌లోనే కేసీఆర్ ధైర్యం చెప్పారు. కేసీఆర్ చెప్పిన ఈ ఒక్కమాటతో కవిత ధైర్యంగా ముందుకు వెళ్లారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలో లేకపోవటం వల్లనో లేక రాజకీయ ప్రాబల్యం తగ్గిపోవటం వల్లనో తెలీదు, ఈ దఫా కేసీఆర్ స్పందన బాహ్యప్రపంచం దృష్టికి చేరలేదు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేసీఆర్ క్షేత్రపర్యటనలు మొదలు పెట్టారు. మళ్లీ తనను తాను నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ఎన్నికలలో అనుకూల ఫలితాలు వస్తే కేసీఆర్ మళ్లీ దూకుడుగా వ్యవహరిస్తారేమో చూడాలి.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు సంబంధించి ముఖ్య మంత్రి రేవంత్ చిత్రమైన వ్యాఖ్యలు చేశారు. నిన్న మొన్నటి వరకూ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు కావటం వల్లనే, కవిత అరెస్టు కావటం లేదని ఆరోపించిన రేవంత్, తీరా ఆమె అరెస్టయిన తర్వాత నాలిక మడత వేశారు. కేసీఆర్ ప్లాన్ ప్రకారమే కవిత అరెస్టు జరిగిందని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాల్లో ఇదో కొత్త నాటకం అని ఆరోపించారు. ఈ అరెస్టు ద్వారా ఆ రెండు పార్టీలకు రాజకీయ మైలేజి ఉంటుందని, ఉభయులూ పర స్పరం ఒకరికొకరు మేలు చేసుకోవడానికే.. ఇలాంటి సరికొత్త నాటకం ఆడుతున్నారని పేర్కొన్నారు.

కవిత రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు

కవిత రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవటం, వంద రోజులు కూడా గడవకముందే పార్టీ బలహీనపడటం ఒక కారణ మైతే, కేంద్రంలో బీజేపీని, మోదీని దూరం చేసుకోవటం, అదే సమయంలో ఇండియా కూటమిలోనూ భాగస్వామి కాకపోవటం వంటి కారణాల వల్ల ఒంటరిపోరాటం తప్పేలా కనిపించటం లేదు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావటంతో, 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి కావటంతో ఆమె రాజకీయ ప్రగతి ఉచ్ఛస్థితికి చేరింది. 2014 నుంచి 2019 వరకూ నిజామాబాద్ లోక్ సభ స్థానం నుంచి ఎంపీగా వ్యవహరించారు. 2019లో కూడా అదే స్థానం నుంచి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2020 నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఇంజనీరింగ్, అమెరికాలో ఎం.ఎస్. చేసిన కవిత వివాహా నంతరం అమెరికాలో ఉద్యోగం చేశారు. తెలంగాణ ఉద్యమం తీవ్రమైన దశలో భారత్‌కు తిరిగి వచ్చారు. తన తండ్రి కేసీఆర్ కు చేదోడు వాదోడుగా ఉన్నారు. ప్రజాఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి ఏర్పాటుచేసి మహిళలు, యువతలో చైతన్యాన్ని తెచ్చారు. ప్రస్తుతం తెలంగాణవ్యాప్తంగా ఏర్పాటయిన నైపుణ్యకేంద్రాలలో దాదాపు 8,500 మంది నైపుణ్య శిక్షణ పొందుతున్నారు.

పూలపండగ 'బతుకమ్మ'కు విశేష ప్రాచుర్యాన్ని కల్పించటంలో చురుకైన పాత్ర పోషించారు. ప్రస్తుతం తెలంగాణతో పాటు ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల్లో బతుకమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. మంచి వక్తగా కూడా పేరుతెచ్చుకున్నారు. ఇదంతా గతం. ఇప్పుడు కవిత చుట్టూ మద్యం కేసు ఉచ్చు బిగుసుకుంది. కవిత భర్త, ఆమె బంధువులపై నిఘా పెట్టారు. వారికి సంబంధించిన ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారు. ఆమె భర్త అనిల్ వ్యాపారలావాదేవీలు, సన్నిహితంగా ఉండే వారి వివరాలను సేకరిస్తున్నారు. తగినన్ని ఆధారాలు లభిస్తే ఓ బృందం నిజామాబాద్‌కు కూడా రావాలని యోచిస్తోంది. దీనితో ఈ కేసు ఇప్పటి కిప్పుడు కొలిక్కి వచ్చే అవకాశం కనిపించటం లేదు. మరో వైపు కవిత అరెస్టు తెలంగాణా రాజకీయాల్లో సంచలనంగా నిలిచింది. దీని ద్వారా లబ్ధిపొందాలని ప్రత్యర్థి పార్టీలు ప్రయత్నిస్తుంటే, సానుభూతి కోసం బీఆర్ఎస్ అర్రులు చాస్తోంది. కవిత అరెస్టు కాకపోవటాన్ని ఎన్నికల ప్రచార అస్త్రంగా చేసుకుని, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందింది. మరి రేపటి పార్ల మెంటు ఎన్నికల్లో అది ఏ పార్టీకి ఓట్లు రాలుస్తుందో చూడాలి. ★



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
ఎన్. రామచందర్ రావు
సీనియర్ న్యాయవాది, మాజీ ఎమ్మెల్సీ

శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే!!
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
VISHRA
JEE - NEET
ACADEMY
2024-25
ADMISSIONS
ARE OPEN
8th to 12th (Inter) 5 Years
INTEGRATED COURSE
VISHRA JEE ADVANCED
CHAMPIONS
40 SEATS Only
: 9032388881 | 7799492249 | 9440616667 | 9154280170
DIRECTOR
D. HARIHARANATHA SARMA
M.Sc(PHYSICS), B.Ed.

సినిమా

మెరుపులు మృగ్యం!

సినిమా రంగంలో సెంటిమెంట్‌కు కొందరు అధిక ప్రాధాన్యం ఇస్తారు. పంపిణీదారుడిగా ఉండి, నిర్మాతగా మారిన వి. వెంకట రమణారెడ్డికి 'దిల్' రాజు అనే పేరు స్థిరపడింది 2003 ఏప్రిల్ 5వ తేదీన! ఆ రోజునే ఆయన నిర్మించిన స్ట్రయిట్ తెలుగు సినిమా 'దిల్' విడుదలైంది. దానికి ముందు మిత్రుడు గిరితో కలిసి రాజు... మణిరత్నం డబ్బింగ్ మూవీ 'అమృత'ను తెలుగులో విడుదల చేశారు. అయితే అది పరాజయంపాలైంది. 'దిల్'తో వెంకట రమణారెడ్డి దశ తిరగడంతో 'దిల్' రాజు అయిపోయారు. అప్పటి నుండి ఆయన కెరీర్ అప్రతిహతంగా కొనసాగుతోంది. ఆయన విజయ్ దేవరకొండతో నిర్మించిన 'ది ఫ్యామిలీ స్టార్' మూవీ ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదలైంది. నిజానికి ఇది సంక్రాంతికి రావాల్సిన సినిమా. ఆ సమయంలో ఇతర చిత్రాలు చాలా ఉండటం, అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి కాకపోవడంతో దిల్ రాజు సమ్మర్‌కు ఈ సినిమాకు వాయిదా వేశారు. పైగా ఇదే రోజున రావాల్సిన ఎన్టీయార్ 'దేవర' వాయిదా పడటంతో ఆయనకు కలిసి వచ్చింది. విశేషం ఏమంటే... ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన దివ్యాంశ కౌశిక్, సంగీతం సమకూర్చిన గోపీ సుందర్ కాంబినేషన్‌లో వచ్చిన 'మజిలీ' చిత్రం కూడా ఐదేళ్ల క్రితం ఏప్రిల్ 5నే విడుదలైంది. ఆ రకంగా వీరందరికీ ఇది చాలా అచ్చి వచ్చిన రోజు. కానీ ఈ సెంటిమెంట్స్ ఏవీ 'ది ఫ్యామిలీ స్టార్'కు కలిసి వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు.

ఈ సినిమా కథ విషయానికి వస్తే పెద్ద కొత్తదేమీ కాదు. గోవర్ధన్ (విజయ్ దేవరకొండ) ఓ మధ్య తరగతి యువకుడు. రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తుంటాడు. పెళ్లై పిల్లలు ఉన్నా జీవితంలో స్థిరపడని అన్నయ్యలిద్దరి బాధ్యత అతని మీదనే ఉంటుంది. వచ్చే జీతంతో ఉమ్మడి కుటుంబాన్ని పొదుపుగా, గుట్టుగా నడుపుతూ ఉంటాయి. ఎవరైనా తన కుటుంబం మీదకు వస్తే మాత్రం సహించడు. వాళ్లను చీల్చి చెండాడే వరకూ నిద్ర పోడు. అలాంటి గోవర్ధన్ జీవితంలోకి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ ఇందు (మృణాల్ ఠాకూర్) అడుగుపెడుతుంది. వాళ్ల ఇంటి టెర్రస్‌పై అద్దెకుదిగి నిదానంగా గోవర్ధన్ మనసునూ ఆక్రమిస్తుంది. ఇక ఇందును పెళ్లి చేసుకోవడమే తరువాయి అనుకుంటున్న సమయంలో ఆమె పీహెచ్‌డీ థీసెస్‌గా తన కుటుంబం కథను ఎంచుకుందని, డాక్టరేట్ పొందడానికి తమ జీవితాలనే అధ్యయనం చేసిందని తెలిసి గోవర్ధన్ మనసు విరిగిపోతుంది. మధ్య తరగతి మనుష్యుల పట్ల ఇందుకు చిన్నచూపు ఉందని భావించిన అతను ఆమెకు గుణపాఠం చెప్పాలనుకుంటాడు. ప్రేమించిన అమ్మాయి మీద పగ తీర్చుకోవడానికి గోవర్ధన్ ఏం చేశాడు? ఆవేశంలో అతను తీసుకున్న నిర్ణయాల పర్యవసానం ఏమిటీ? చివరకు తన తప్పు తెలుసుకుని ఇందు మనసును ఎలా జయించాడు? అనేది మిగిలిన కథ.

ఈ సినిమా చూస్తుంటే గతంలో మనం చూసిన పాపులర్ మూవీస్‌లోని సన్నివేశాలు కళ్ల ముందు మెదులుతుంటాయి. అన్నయ్యలు బాధ్యతా రాహిత్యంతో మెలగుతుంటే తమ్ముడే బాధ్యతలను భుజానకెత్తుకున్న సినిమాలు తెలుగులో చాలానే వచ్చాయి. అలానే నాగార్జున నటించిన 'మన్మథుడు', విజయ్ దేవరకొండ, పరశురామ్ కాంబినేషన్‌లోనే వచ్చిన 'గీత గోవిందం'లోని సీన్స్ గుర్తొస్తాయి. హీరో క్యారెక్టరైజేషన్ దాదాపు అలానే సాగింది. కాకపోతే బ్యాక్ డ్రాప్ మారింది అంతే. కథలో కొత్తదనం లేకపోయినా కథనం ఆసక్తికరంగా ఉంటే... సినిమా మరింత చక్కని ఫలితాన్ని పొంది ఉండేది. కానీ ప్రతి సన్నివేశం ఊహకందే విధంగానే ఉంది. దాంతో సినిమా చూస్తున్న ప్రేక్షకుడిలో ఉత్సుకత పెరగదు. ప్రథమార్థం రొటీన్‌గా సాగింది. అయితే ఇంటర్వెల్ బ్యాంగ్‌ను బాగానే ప్లాన్ చేశారు. ఇక సినిమా గాడిలో పడింది అనుకునేంతలో కథను విదేశాలకు తీసుకెళ్లి... 'మన్మథుడు' సీన్స్‌ను రిపీట్ చేశారు. చివరకు ఎలాగో కథ క్లయిమాక్స్‌కు చేరిందనుకునేంతలో కొత్తదనం పేరుతో దానిని కిచిడీ చేసేశారు. హీరో పెద్ద మనసును ప్రేక్షకులు అర్థం చేసుకోకపోగా కామెడీగా తీసుకునే ప్రమాదం ఏర్పడింది. దాంతో దర్శకుడు పరశురామ్ ఏం చెబుదామని ఈ కథ రాసుకున్నాడు? ఏం చెప్పాడు? అనేది అర్థం కాని అయోమయంలో ప్రేక్షకులు పడిపోయారు.

విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంట తెర మీద చూడముచ్చటగా ఉంది. ఇద్దరూ తమ పాత్రలకు న్యాయం చేశారు. రోహిణి హట్టంగడిని చూస్తుంటే 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' మూవీలోని పాత్రే గుర్తొస్తుంది. ఇతర ప్రధాన పాత్రలను జగపతి బాబు, అభినయ, వాసుకి, రవిప్రకాశ్, చేంబోలు రాజా, రోహిణి, అచ్యుత్‌కుమార్, 'వెన్నెల' కిశోర్, రవిబాబు, అజయ్ ఘోష్ తదితరులు పోషించారు. గోపీసుందర్ స్వరపరిచిన పాటల్లో 'కళ్యాణి వచ్చా... వచ్చా...' ఒక్కటే బాగుంది. కాకపోతే దానిని తీసుకెళ్లి రోలింగ్ టైటిల్స్‌లో వేశారు. యాక్షన్ సీక్వెన్స్ మాస్ ఆడియెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని తీసినట్టు అర్థమౌతుంది. దర్శకుడు పరశురామ్ రాసిన మాటలు బాగున్నాయి. 'దిల్' రాజు రాజీపడకుండా ఈ సినిమాను నిర్మించారు. కానీ కథ బలంగా లేకపోవడం, కథనం ఆసక్తి కలిగించక పోవడంతో 'ది ఫ్యామిలీ స్టార్' ఎలాంటి మెరుపులు ప్రదర్శించలేక పోయింది. గతంలో వచ్చిన విజయ్ దేవరకొండ 'లైగర్, ఖుషీ'తో పోల్చితే 'ది ఫ్యామిలీ స్టార్' బెటర్ మూవీనే! వేసవి సెలవుల కారణంగా వేరే ఆప్షన్ లేదు కాబట్టి ఫ్యామిలీ ఆడియెన్స్ ఈ సినిమాను ఆదరిస్తే కమర్షియల్‌గా సక్సెస్ అయ్యే ఛాన్స్ ఉంటుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

ప్రపంచ బ్యాడ్మింటన్‌లో భారత్ జోడీ హవా

భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ షెట్టి చరిత్ర సృష్టించింది. గతంలో ఏ భారత బ్యాడ్మింటన్ ప్లేయర్ లేదా జట్టు సాధించని ఘనతను సొంతం చేసుకుంది.. టైటిల్స్ నెగ్గడంలోనూ, ర్యాంకింగ్ పాయింట్లు సాధించడంలోనూ ప్రత్యర్థుల కంటే ఎంతో ముందుండటం ద్వారా ఈ జోడి సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది.

ప్రపంచ బ్యాడ్మింటన్ పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాలలో మాత్రమే ఇప్పటివరకూ ప్రత్యేకతను చాటుకొంటూ వచ్చిన భారత బ్యాడ్మింటన్ గత రెండేళ్లుగా పురుషుల డబుల్స్ విభాగంలో ఆధిపత్యం చలాయిస్తూ వస్తోంది. ప్రపంచ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ అనగానే ఇండోనేసియా, చైనా, మలేసియా, డెన్మార్క్, కొరియా, జపాన్ దేశాల ఆధిపత్యమే కనిపిస్తుంది. అయితే.. భారత యువజోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ షెట్టి ఆ ఆధిపత్యానికి గండి కొట్టారు. తామే ప్రపంచ నంబర్ వన్ అంటూ చాటుకోడమే కాదు.. గత 10 వారాలుగా తమ ర్యాంక్‌ను నిలుపుకొంటూ్తు రికార్డు నెలకొల్పారు.

సైనానెహ్వాల్ రికార్డును మించి...

ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధికంగా మహిళల సింగిల్స్‌లో సైనానెహ్వాల్ 9 వారాలపాటు నంబర్ వన్ ర్యాంక్‌లో నిలవడం ద్వారా రికార్డు నెలకొల్పింది. ఆ రికార్డును బ్యాడ్మింటన్ డబుల్స్ సాత్విక్- చిరాగ్ జంట తెరమరుగు చేయగలిగింది. ఈ ఘనత సాధించిన భారత తొలిజంటగా రికార్డుల్లో చేరారు.

అంచెలంచెలుగా....

సాత్విక్- చిరాగ్ జోడీ రాత్రికి రాత్రే నంబర్ వన్ ర్యాంక్ సాధించలేదు. సంవత్సరాల తరబడి చేసిన సాధనకు అంకితభావాన్ని జోడించి మరీ గత రెండేళ్లుగా సత్తా చాటుకొంటూ వస్తున్నారు. హాంగ్జు వేదికగా ముగిసిన 19వ ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధించడం ఈ జంట 3వ ర్యాంక్ నుంచి ఒకటో ర్యాంక్‌కు చేరుగలిగింది. 1980 దశకం పురుషుల సింగిల్స్‌లో ప్రకాశ్ పడుకోన్, కిడాంబి శ్రీకాంత్, మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ మాత్రమే నంబర్ వన్ ర్యాంక్‌ను అందుకోగలిగారు.



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

ఆ తరువాత సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ మాత్రమే ఈ ఘనత సాధించగలిగింది.

2022 నుంచి టాప్ గేర్‌లో....

ఆసియాక్రీడల పురుషుల టీమ్ విభాగంలో భారత్ రజత పతకం గెలుచుకోడంలో సాత్విక్-చిరాగ్ జోడీ తమవంతు పాత్ర నిర్వర్తించారు. దానికి అదనంగా ఆసియా క్రీడల్లో పురుషుల డబుల్స్ లో సైతం బంగారు పతకం సాధించగలిగారు. 2022 ప్రపంచ బ్యాడ్మింటన్ టూర్ టైటిల్ నెగ్గిన తరువాత వారు మరి వెనుదిరిగి చూసింది లేదు. గతేడాది జనవరిలో ఇండియన్ ఓపెన్ ఫైనల్లో ఇండోనేసియా జోడీ మహ్మద్ అహసాన్- హెండ్రా సెత్యావాన్ లను 21-16, 26-24 చిత్తు చేశారు. ఆ తర్వాత జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ లోనూ ఈ జోడీకి ఎదురేలేకపోయింది. 2023 సీజన్లో స్విస్ ఓపెన్, ఇండోనేషియన్ ఓపెన్, కొరియన్ ఓపెన్ టైటిల్స్ సైతం భారతజంటకు దాసోహమన్నాయి. ఇండోనేషియన్ ఓపెన్ టైటిల్ సమరంలో ప్రపంచ రెండోర్యాంక్ జంట ఆరోన్ చియా-వూ ఇక్ సోలను 21-17,21-18తో ఖంగు తినిపించడం ద్వారా తమ ఆధిపత్యాన్ని చాటారు.

థామస్ కప్ విజయంలోనూ..

1949 నుంచి జరుగుతున్న థామస్ కప్ టోర్నీలోనూ భారతజట్టు తొలిసారిగా బంగారు పతకం అందుకోడంలో సాత్విక్- చిరాగ్ జోడీ కీలకపాత్ర పోషించారు. థామస్ కప్ చరిత్రలోనే 14సార్లు చాంపియన్ గా నిలిచిన ఇండోనేషియాను భారత్ 3-0తో చిత్తు చేయడం ద్వారా తొలిసారిగా ట్రోఫీ అందుకోగలిగింది. బర్మింగ్ హామ్ వేదికగా జరిగిన 2022 కామన్వెల్త్ గేమ్స్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ ఫైనల్లో బ్రిటీష్ జోడీ బెన్ లాన్-సీన్ వార్డీలను చిత్తు చేయడం ద్వారా బంగారు పతకం సాధించారు. మిక్సిడ్ టీమ్ విభాగం లోనూ భారత్‌కు రజతం అందించారు. ఆ తర్వాత దుబాయ్ వేదికగా జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీ డబుల్స్‌లో కాంస్యం సాధించారు. 2023 ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ టైటిల్ సమరంలోనూ మలేసియాజోడీ ఆంగ్ ఇ సిన్-తే ఇ పై 16-21, 21-17, 21-19 స్కోరుతో విజయం సాధించిన భారత తొలిజంటగా చరిత్ర సృష్టించారు.

ఆసియాక్రీడల స్వర్ణ పతకం నుంచి...

సాత్విక్- చిరాగ్ జోడీ.. ఆసియాక్రీడల బంగారు పతకం సాధించడంతో పాటు ఈ ఏడాది జనవరి 23 నుంచి చైనా మాస్టర్స్, మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్ విజయాలతో పాటు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నెగ్గడం ద్వారా ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్‌ను నిలుపుకోగలిగారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్ ప్రకారం 52 వారాల సమయంలో ఓ ఆటగాడు లేదా జోడీ సాధించిన పది అత్యుత్తమ విజయాల ప్రాతిపదికన పాయింట్లు ఇవ్వడం ద్వారా ర్యాంకులను నిర్ణయిస్తారు. సాత్విక్ -చిరాగ్ జోడీ 1,02,303 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రత్యర్థి జోడీ కాంగ్ మిన్ హ్యాక్- సీయో సీయింగ్ జే కంటే 5వేల పాయింట్లతో ముందున్నారు. పారిస్ వేదికగా ప్రారంభమయ్యే 2024 ఒలింపిక్స్ పురుషుల డబుల్స్ బంగారు పతకం వేటకు ఈ జోడీ దిగనుంది. స్థాయికి తగ్గట్టుగా రాణించ గలిగితే పారిస్ ఒలింపిక్స్ డబుల్స్ స్వర్ణపతకంతో సాత్విక్-చిరాగ్ సరికొత్త చరిత్ర సృష్టించినా ఆశ్చర్యపోనక్కరలేదు. ★

సాత్విక్-చిరాగ్

వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది

'నేనెవరో ఇక్కడికి వచ్చిన వాళ్లల్లో ఎవరైనా చెప్పగలుగుతారా?''

పిల్లలు ఒకటే అరుపులూ, కేరింతలు. ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. కొంతమంది పెద్దవాళ్లు మాత్రం ఇటే చూడసాగారు.

మామూలు ఫంక్షన్లకి భిన్నంగా ఇదేదో కొత్తగా, ఆశ్చర్యంగా ఉంది చాలామందికి, ఆసక్తిగా ఉంది మరి కొంతమందికి.

అంతకు ముందే నిశ్చితార్థం అయిందేమో కబుర్లలో మునిగి తేలుతున్న కొత్త జంట కూడా కబుర్లాపి నా వైపే చూడసాగారు.

''నన్నెవరైనా గుర్తుపట్టారా?'' శక్తినంతా కూడగట్టుకుని మళ్లీ గట్టిగా అరిచాను. ఎవ్వరూ మాట్లాడలేదు. తెలిసిన ఒకల్లిద్దరు మాత్రం నవ్వారు.

“ఎవరూ చెప్పలేరా? సరే చెప్పద్దు. పోనీ చేతులెత్తండి..” నవ్వుతూ.. అన్నాను అందర్నీ కలయ చూస్తూ.. ఎవ్వరూ చేతులెత్తలేదు. ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ ఏవేవో గుసగుసలు...?

''ఉదయపు ముహూర్తం కావటంతో నిశ్చితార్థం అయిపోయింది. భోజనాలకు చాలా సమయం ఉంది కాబట్టి.. ఇక్కడ నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. సమాధానం చెప్పండి. ప్రశ్నలు అంటే కౌన్ బనేగా క్రోర్ పతీలో అమితాబ్ అడిగేంత జటిలమైన ప్రశ్నలైతే కావు. అన్నీ మీకు సంబంధించినవే. సమాధానం చెప్పిన వారికి బహుమతులు ఉంటాయి. అలా అని నేనేదో మిమ్మల్ని అందర్నీ ఎంగేజ్ చేయటానికి వచ్చినదాన్నయితే కాదు..

నేనూ ఒక అతిథినే. మీ అందరి బంధువునే. అయితే నేనెవరో చెప్పండి. ఎవరికైనా తెలుసా.. చేతులెత్తండి..” నవ్వుతూ అన్నాను. ఎవ్వరూ మాట్లాడలేదు..

“ఇక్కడ మీకొక కథ చెబుతాను. వినండి. ఇక్కడున్న యువతీ యువకులకి ఇది బాగా ఉపకరిస్తుంది. కూడా..” అని చుట్టూ ఒకసారి చూసి మొదలు పెట్టాను.

“నాయకుణ్ణి ఎంచుకోవటానికని ఒక అడవిలో కుందేళ్లన్నీ సమావేశం అయినాయి. మాంసాహారం తినే జంతువుల కళ్లన్నీ తమ మీదే ఉంటున్నాయని, తమని తామే కాక తమ జాతిని రక్షించుకోవటానికి ఒక నాయకుడు అవసరం అని అవి భావించి అక్కడ సమావేశం అయ్యాయి. తన తెలివి తేటల్లో ఎన్నో ప్రమాదాల నుండి బయట పడటమే కాక, రోజుకో కుందేలుని తినేసే సింహానికి బావిలో తన నీడను తనకే చూపించి తనంతట తానే నీళ్లల్లోకి దూకేలా చేసేసి సింహం చావుకి కారణమై, అడవిలోని జంతువు లన్నింటినీ దాని బారి నుండి తప్పించిన కుందేలూ అక్కడే ఉంది. అలా చేయటం వల్ల అది ప్రపంచ ప్రసిద్ధి చెందిన కుందేలు అయ్యింది. కాకపోతే అది చాల వృద్ధురాలైపోయింది. దానికి అన్ని విధాలా అనుభవం ఎక్కువ అని నాయకుణ్ని ఎంపిక చేసే బాధ్యత దానికి అప్పగించారు. సరేనంది వృద్ధ ప్రపంచ కుందేలు.

“సరే అయితే. సరిగ్గా ఇక్కడికి అయిదు మైళ్ల దూరాన ఒక చెరువు ఉంది కదా. అది మనందరికీ తెలిసిన చెరువే. నాయకుడు అవ్వాలని అనుకునేవారు ఇక్కడికి వచ్చి వరసగా నిలబడండి. నేను ఈలవేస్తాను. పరుగు మొదలెట్టండి. ఎవరు ముందు వెళతారో అతనే నాయకుడు” అంది.

సరేనని పోటీలో పాల్గొనాలనుకునే కుందేళ్లన్నీ వచ్చి పక్క పక్కనే వరుసగా నిలబడ్డాయి.

జ్ఞాపకాల జాడలు

కన్నెగంటి అనసూయ

వృద్ధి కుందేలు ఈల వేసింది. పరుగు మొదలైంది. కొన్ని ప్రారంభంలోనే, మరికొన్ని కాస్త దూరం వెళ్లాకా, ఇంకొన్ని ఇంకాస్త దూరంగా వెళ్లాక ఆయాసం వచ్చి ఆగి పోయాయి.

రెండు మాత్రం ముందుకు దూసుకు పోతున్నాయి. అయితే... ఆగిపోయిన కుందేళ్లు ఊరికే కూర్చోలా..”

అని చెప్పి ఆపి అందరి వైపూ చూసాను. చాల ఆసక్తిగా వింటున్నారు.. బహుశా బహుమతుల ప్రభావం అనుకుంటా అని మనసులో నవ్వుకుని ఎవరో అందిస్తే కాసిన్ని నీళ్లు తాగేలోపే “చెప్పండి చెప్పండి.. తర్వాతేం జరిగింది” అని ఒకటే అరుపులు.

కొంతమంది పిల్లలు కథ ఆసక్తిగా ఉందనుకుని ముందుకంతా వచ్చి కింద కూర్చున్నారు. పెద్ద వాళ్లల్లో కొందరైతే బర్రున శబ్దంవచ్చేలా కుర్చీలను ఈడ్చి మరీ నా దగ్గరకంటా కూర్చున్నారు.

మళ్లీ కథచెప్పటం మొదలుపెట్టా. ఈసారి పిల్లలూ వినసాగారు..

“...అయితే ..పరుగాపేసిన కుందేళ్లు ఏం చేసాయంటే ఆ రెండు కుందేళ్ల వెనకే పరిగెత్తుతూ.. “ఆపెయ్యండి... ఆపెయ్యండి. ఇంకా చాలా దూరం ఉంది చెరువు. ఆయాసం ఎక్కువైతే గుండె ఆగిపోతుంది అని అరిచాయి.” అని అరిచింది.

దాంతో ఒకటి ఆగిపోయింది.

ఇక మిగిలింది ఒక్క కుందేలు. మళ్లీ అన్నీ కలిసి దాన్ని హెచ్చరించటం మొదలు పెట్టాయి. అయినా అది పరుగు ఆపలేదు. అది గెలిచింది.

వృద్ధ కుందేలు దానిని కుందేళ్లకి నాయకుడిగా ప్రకటించింది. అయితే కుందేళ్లల్లో కొన్ని దాన్ని చుట్టుముట్టి.. “అంతదూరం నువ్వెలా పరిగెత్త గలిగావు? నీకు ఆయాసం రాలేదా? చనిపోతానేమో నని భయం వేయలేదా? వెనుక నుండి వీళ్లంతా అరుస్తున్నారు కదా..” అని అడిగాయి.

“నా లక్ష్యం నాయకుడు అవ్వటం. నా గమ్యం చెరువు. నాకుంది ఏకాగ్రత. దాంతో పరుగెట్టా. ఫలితం వచ్చింది.” అంది గెలిచిన కుందేలు.

“శభాష్” అంది వృద్ధ కుందేలు.

ఇదంతా మీకెందుకు చెప్పానంటే “ఎవరి జ్ఞానం వారిదే, కొంతమందికి జవాబులు తెలుస్తాయి. కానీ అది సరైన జవాబో, కాదో మళ్లీ అందరూ నవ్వు తారేమో..” అని చుట్టూ చూస్తారు. అలా ఎప్పుడైతే చుట్టూ ఉన్న వాళ్ల మీద ఆధారపడతారో.. వాళ్లు ఎప్పటికీ గెలవలేరు. అలానే మిగిలిపోతారు. గెలిచిన కుందేల్లా.. ఎవ్వర్నీ పట్టించుకోకుండా తను చెప్పాలనుకున్నది చెప్పటం, చెయ్యాలనుకున్నది చేసేయ్యటం నాయకత్వ లక్షణాలు. జాగ్రత్తగా గమనిస్తే మనలో చాలామందిలో చొరవ తక్కువ. ఎవరన్నా ఏమన్నా అను కుంటారేమో అనే సందేహం. ఎవరన్నా చెయ్యెత్తితే మనం ఎత్తుదాం అని చుట్టూ చూస్తారు. మొహమాటమే సగం అభివృద్ధికి ఆటంకం” అని నేనింకా చెబుతూనే ఉన్నా.. ఇంతలో.. ఒకమ్మాయి లేచి నిలబడింది..

“అడగండి. చెబుతా.” అంటూ.. ఆ తర్వాత మరికొందరు నిలబడ్డారు. నేను చెబుతానంటే, నేను చెబుతానని..

సరే.. ఇక ఆలస్యం చేయదలచుకోలేదు. “నీ పేరేంటమ్మా.?”

“సున్న భారతి”

“సరే. మీ నాన్న గారి పేరు..?'' అనడిగాను. చెప్పింది. అలాగే వాళ్ల అమ్మగారి పేరు

“మిమ్మల్ని ఎంతో గారంగా పెంచి ఉంటారు కదా మీ నాన్నగారు?” అన్నాను.

ఇంత ముఖం చేసుకుని జూకాలు ఇంత దూరం ఊగేట్టుగా అవున న్నట్టు తలూపింది.

“అయితే మీ నాన్నగారు ఎంత గారంగా మిమ్మల్ని పెంచారో... మీ నాన్నగారిని కూడా వాళ్ల నాన్నగారు, అమ్మగారూ అంతే గారంగా పెంచి ఉంటారు కదా? వాళ్ల ఇద్దరి పేర్లూ చెబుతారా?” అనడిగాను. ముందు కాస్త తటపటాయించినా అతి కష్టం మీద చెప్పింది.

“అయితే...మీ తాతయ్యని కూడా వాళ్ల నాన్న అలానే పెంచి ఉంటారు కదా. అంటే మీ నాన్న వాళ్ల తాతయ్య. ఆయనకి అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళూ ఎంతమందో చెప్పగలుగుతావా?”

నేనిలా అడుగుతున్నంతలో కొంతమంది పక్క వాళ్లతో గుసగుసలు మొదలెట్టారు. మరికొంత మందైతే ఫోన్‌లు తెరిచి పేర్లు వెతుక్కుంటున్నారు. నాకు అర్థమైపోయింది.

పక్క వాళ్లతో గుసగుసలాడి తెలుసుకోవద్దని, ఆ ఫంక్షన్‌లో ఉన్నాళ్లు ఎక్కడో దూరంగా ఉన్నాళ్లని ఫోన్లో తెలుసుకోవద్దని వార్నింగ్ ఇచ్చాను.

అంతా ఒక్కసారిగా నిశబ్దంగా అయిపోయారు. “ఏమ్మా? తెలిసాయా పేర్లు?” అనడిగాను.

ఆ అమ్మాయి నీళ్లు నములుతూ దిక్కులు చూస్తుంది సిగ్గుపడుతున్నట్టు.

“కూర్చోమ్మా.! నువ్వు ఎప్పుడైతే నా కథ ఇంకా పూర్తి కాకుండానే నేను చెప్తానని లేచి నిలబడ్డావో...అప్పుడే సగం గెలిచావు. అయితే నీ ఒక్కదానికే కాదు.. ఇవ్వాళా, రేపూ చాల మందికి బంధుత్వాలు కేవలం అమ్మానాన్నల వరకే తెలుస్తున్నాయి. మరికొద్దిమందికి మాత్రమే వెనకటి

తరం, అంటే... అమ్మమ్మా, తాతయ్యా, నాయనమ్మా, తాతయ్యా.. ఇంతవరకూ తెలుస్తున్నారు. పెద్దవాళ్లు చెప్పక పోవటం కావచ్చు, పిల్లలకి వినే ఓపిక, సమయం లేక కావచ్చు... రాకపోకలు లేక కూడా కావచ్చు. అందులో సగం పెద్దవాళ్ల తప్పున్నా.. మిగతా సగం మీదే. ఎందుకంటే.. ఒక క్రికెటర్ గురించో ఒక సినిమా నటుడి గురించో అడిగితే ఠక్కున చెప్పేసే చాలామంది.. వంశపు వేళ్లయిన స్వంత వంశీకుల గురించి, తమ అస్తిత్వానికి కారకులైన వారి గురించి తెలుసుకోవాలని లేకపోవటం మన దురదృష్టం'" అని కాసేపాగి..

'అయితే... ఇక్కడ చాలమంది పెద్దవాళ్లూ, పిల్లలూ ఉన్నారు. పిల్లల్ని వదిలేస్తే పెద్ద వాళ్లల్లో ఎవరైనా భారతి వాళ్ల తాతయ్య తండ్రికి అన్న దమ్ములు ఎంతమందో, అక్కచెల్లెళ్లు ఎంతమందో ఎవరైనా చెప్పగలరా?" అనడిగాను..

ఎవ్వరూ నోరు మెదపలేదు... కొంతమంది పెద్దవాళ్లు నేనెక్కడ వాళ్లని అడుగుతానో అని నా

దృష్టిలో పడకుండా ఉండేందుకు నానా కష్టాలూ పడుతున్నారు..

ఎంతసేపైనా ఎవ్వరూ ఏమీ మాట్లాడక పోయేసరికి ..

'ఈ ప్రశ్నకి సమాధానం చెప్తే నేనెవరో తెలిసి పోతుంది" అన్నాను..

అయినా ఎవ్వరూ మాట్లాడలేదు.

అప్పుడన్నాను..

"ఇవ్వాళ నిశ్చితార్థ. పెళ్లి ఇంకా వారం రోజులుంది. ఆరోజు మళ్లీ ఇలాంటి సందర్భం ఉంది. అప్పుడు ఎవరైతే "నున్న వారి వంశ వృక్షం " గురించి విపులంగా రాసుకుని వస్తారో.. వాళ్లకి....' అని ఆపేశాను..

"ఏం బహుమతి.. ఏం బహుమతి" అని అరిచారందులో కొంతమంది.

ముప్పై వేల విలువ చేసే.. వస్తువు" అన్నాను ఒక సంచిని పైకెత్తి చూపిస్తూ..

అరిచేసారంతా. కొంతమంది అయితే భోజనాలకు వెళ్లకుండా సంభాషణల్లో పడిపోయారు. మొత్తం మీద నేను చెప్పిన విషయాల ప్రభావం వాళ్లందరి మీదా పడ్డట్టు తెలుస్తూనే ఉంది.

చాలమంది నన్ను పలకరించి మాటల మధ్యలో నేనెవర్నో తెలుసుకోవటానికి చాల యుక్తులు ప్రయోగించారు కానీ నేను బయటపడలేదు.

పెళ్లి కూతురి తండ్రి నవ్వుతూ నా దగ్గరకి వచ్చి.. "మొత్తం మీద విజయం సాధించావు." అన్నాడు. నవ్వుతూ.

"చూద్దాం. వారం రోజులే కదా.." అన్నాను నవ్వుతూ.

పెళ్లి రోజు రానే వచ్చింది. లగ్నం తెల్లవారగట్ట కావటంతో భోజనాలయ్యాక బోలెడంత సమయం ఉందేమో..అతిథులు చాలామంది హాజరై భోజనం చేసి వెళ్లి పోతున్నారు. దగ్గర బంధువులు మాత్రం భోజనాలు చేసి వచ్చి కూర్చున్నారు. అందులో నిశ్చితార్థ రోజున ఉన్నవాళ్లంతా ఉన్నారు. బహుశా బహుమతి ప్రభావం అనుకుంటా. సరే ఏదైతే

> **మనల్ని ప్రేమించి పెద్ద చేసి, మనకి పుట్టుకతోనే ఒక కుటుం బాన్నీ, ఒక సంస్కృతిని, సంప్రదాయాన్నీ, అలవాట్లనీ, ఆచారాలని .. వీటితో పాటు కొండంత ప్రేమని, అను బంధాన్నీ, ఆత్మీయతనీ ఇచ్చిన మన తల్లిదండ్రుల గురించి ఉన్న ఆసక్తే మన అమ్మానాన్నల తల్లిదండ్రుల గురించీ ఉండాలి కదా? వాళ్లే లేకపోతే మన అమ్మానాన్నలెక్కడ? అలా మన వంశపు లోతుల వరకూ ఆలోచించండి.**

ఏమైందిలే.. ఉన్నారు కదా అంతే చాలు అని మనసులో అనుకుని మైక్ అందుకున్నాను..

మొత్తం ఆరుగురు నున్న వారి వంశవృక్షం గురించి రాసుకొచ్చారు. అందులో ఒక్కటి మాత్రమే విపులంగా ఉంది. ఎందుకైనా మంచిదని నాకు తెలిసినా కూడా అన్నీ అక్కడున్న పెద్ద వాళ్లకి ఒకసారి చూపించి నిర్ధారించుకున్నాక..

"నిజంగా గొప్ప ప్రయత్నమే చేసారు. అయితే.. ఇక్కడ కొన్ని విషయాలు మీతో నేను చెప్పదలచు కున్నాను. తర్వాతే విజేత ఎవరో చెప్తాను."

నిత్యం...మనం సోషల్ మీడియాలో తిరుగుతూనే ఉంటాం.

నా దృష్టిలో... సమయాన్ని వృథా చేసుకుంటూ పల్లెటూళ్లల్లో... అరుగుల మీద పొద్దుపోయేదాకా కూర్చుని బాతాఖానీలతో కాలక్షేపం చేసేవాళ్ల కంటే తక్కువేం కాదు ఇలా ఎంతసేపూ సోషల్ మీడియాలో గడిపే వాళ్లు. వాటి వల్ల ఎంత ఉపయోగం అనేది తమకు తామే తెలుసుకోవాలి. చేరాల్సిన గమ్యాలూ, సాధించాల్సిన లక్ష్యాలు లేనివాళ్లు మాత్రమే సమయం ఇలా వృథా చేస్తూంటారు.

ముఖ్యంగా ఇన్‌స్టాగ్రాంలో సినిమా యాక్టర్లని, వాళ్ల పిల్లల్నీ, భర్తలనీ చూస్తూ అదో లాంటి ఆనందం అనుభవిస్తాం. వాళ్ల అమ్మా నాన్నల్నీ ఆత్రుతగా చూసేస్తాం. అపురూపంగా భావిస్తాం. కానీ మనం ఇలా నేలపై ఉండటానికి కారణమైన మన వంశ వారసుల్ని కానీ, బంధువుల గురించి కానీ తెలుసుకోవటానికి ప్రయత్నించం.

ఇప్పటికిప్పుడు...నా పేరేంటో, నేనేంటో, నేను ఎన్ని తెలుగు, హిందీ సినిమా లకి కథ, మాటలూ, పాటలూ రాశానో చేప్తే అందరూ నాతో సెల్ఫీలంటూ వెంటపడతారు. మరికొంతమందైతే మా అమ్మతోనూ, మా అమ్మమ్మతోనూ కూడా సెల్ఫీ తీసుకోవటం మొదలుపెడతారు. అవసరమా?

మన స్వంత వంశస్తులు మనకి అక్కరలేదు.

మనల్ని ప్రేమించి పెద్ద చేసి, మనకి పుట్టుకతోనే ఒక కుటుంబాన్నీ, ఒక సంస్కృతిని, సంప్రదాయాన్నీ, అలవాట్లనీ, ఆచారాలని .. వీటితో పాటు కొండంత ప్రేమని, అనుబంధాన్నీ, ఆత్మీయతనీ ఇచ్చిన మన తల్లిదండ్రుల గురించి ఉన్న ఆసక్తే మన అమ్మానాన్నల తల్లిదండ్రుల గురించీ ఉండాలి కదా? వాళ్లే లేకపోతే మన అమ్మానాన్నలెక్కడ? అలా మన వంశపు లోతుల వరకూ ఆలోచించండి. ఎంత ఆసక్తి కలిగించే విషయాలు ఉంటాయో అందులో..?

ఆ తరం వారిని పలకరిస్తే ఎన్ని కొత్త కొత్త విషయాలు తెలుసుకోగలుగుతాము?

మనకి వారసత్వంగా, వంశపారంపర్యంగా ఆస్తులే కాదు వచ్చినవి, వాటితో పాటు వంశమూ, వంశపు పద్ధతులూ వచ్చాయి. కానీ దురదృష్టవశాత్తూ, ఆస్తుల్నే స్వీకరిస్తాము. సరైన పంపకాలు జరక్కపోతే కోర్టుకి కూడా వెళతాము. కానీ వంశ వారసులే సంస్కృతీ, సంప్రదాయాలను విస్మరిస్తే వెళ్లే కోర్టుల్ని కూడా మనం తయారుచేసుకోవాలేమో.. అందుకే... మీ మీ వంశాల గురించి తప్పక తెలుసుకోండి. ఇంకా కుదిరితే అధ్యయనం చేయండి. అది పిల్లలకు చెప్పండి.

నాకు తెలిసీ చాలా మంది... మన పెద్ద వాళ్లు మనకి ఎవరినైనా పరిచయం చేస్తూ వాళ్లు మనకు ఏమవుతారో చెబుతుంటే ఆసక్తిగా వినటం మానేసి .. కొంతవరకూ విని "అమ్మబాబోయ్.. బుర్ర హీటెక్కి పోతుంది... నాకు చెప్పద్దు" అంటాం. అదే ఏ సినిమా నటి గురించైనా అయితే అలా అంటామా? ఇంకా ఇంకా తెలుసుకోవాలని తరచి తరచి అడుగుతాం. వడ్డీ లెక్కలైతే అలా అంటామా? ఎవరైనా మన పొలం గట్టు కాస్తంత జరిపినట్టు అనుమానం వస్తే ఎన్నో డబ్బులు ఖర్చు చేసి సర్వేయర్ ని పిలిచి కొలతలు వేయించి అర్థమయ్యేట్లు చెప్పించుకుంటామే. అలాంటిది కాదా బంధుత్వం? చెప్పండి.

ఏకాగ్రత లేకపోవటమూ, బంధుత్వాల గురించి చులకన భావమే దీనికి కారణం.

మన తాతయ్యలూ, నాయనమ్మలూ కష్టపడటం నేర్పారు మన తల్లిదండ్రు లకు. మీరు తింటారనే పొలంలో పండ్ల చెట్లు నాటారు పెద్దవాళ్లు. చెట్లు వాళ్లేస్తే పండ్లు మనం తింటున్నాం. పొలాన్నించి మామిడి కాయలొస్తే ఈ చెట్టు ఎవరు నాటారు నాన్నా అని ఎప్పుడైనా అడిగారా? అడగరు. కష్టం గురించి మీకు వద్దు. పళ్లు మాత్రమే కావాలి.

తప్పు. అది తప్పు. బంధువులు మనకి దేవుడు ఇచ్చిన వరం. మనం అవునన్నా.. కాదన్నా వాళ్లు మనతోనే. అలాంటి బంధుత్వాలను మనం వదులుకోవచ్చా..?

రండి. మన బంధువుల కార్యక్రమాలకు హాజరవ్వండి. పేరు పేరునా మనసారా పలకరించు కోండి. మన పెద్ద వాళ్లను ఆ సందర్భంగా తలచుకోండి. అందరూ ఆసక్తిగా ఉన్నారు కాబట్టి ఇప్పుడు చెప్తున్నా నేను ఎవరో.

“మీరంతా ఏ నున్న వారి అన్నదమ్ములకు మనవలో, ముని మనవలో... ఆ అన్నదమ్ముల ఏకైక గారాల చెల్లికి మనవరాలిని నేను. కాబట్టి మనమంతా అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ల మనవలం.

నేను ఇంతకు ముందు జరిగిన వాటికీ హాజరయ్యాను. ఎవరూ కనీసం నన్ను అడగలేదు మీరు ఎవరని? ఈ పెళ్లికి, నిశ్చితార్థానికి ఎందుకు ముందుగా వచ్చానో తెలుసా? మా నాయనమ్మ, తాతయ్య, మా నాన్న, అమ్మ, పెదనాన్నలు, పెద్దమ్మలు.. అత్తలూ, మా నాయనమ్మ అన్నదమ్ముల మనవలూ పిల్లలూ... అందర్నీ కళ్లారా చూసుకోవ టానికి.. కలుసుకోవటానికి.. వాళ్ల జ్ఞాపకాల జాడల్ని వెతుక్కోవటానికి.

“మీ నాన్న.. పొలంలో నాట్లు వేసాడంటే ఎన్ని ఎడ్ల బళ్లున్నా ధాన్యం బస్తాలు ఇళ్లకు చేర్చటానికి సరిపోయేవి కావు”

“మీ అమ్మ వాకిట్లో కళ్లాపి చల్లి ముగ్గేసిందంటే నిలబడిపోవాల్సిందే ఎవరైనా”

ఇలాంటి జ్ఞాపకాలే కదా మనకి కొండంత బలం. ఆలోచించండి. ఎవరితో ఏమేం అనుభవాలో..

ఒక్కసారి అందరం ఇలా కలిస్తే.. జ్ఞాపకాలను పంచుకుంటే ఎంత మానసిక ఆనందం, బలం వస్తుందో. మీలోకి మీరు తొంగి చూసుకోండి.

అందర్లో.. ఏదో కొత్త అనుభూతి.

అక్కడొక కొత్త వంశ వృక్షం వేళ్లూనుతోంది.

వచ్చేవారం కథ..
ధ్యేయం
– సి. యమున



పవిత్ర గోదావరీ తీరంలో పౌండరీక యాగం

గోదావరి తీరంలోని కొవ్వూరు పక్కన ఉన్న వాడపల్లిలో పౌండరీక యాగం నిర్వహిస్తున్నారు. దీని ప్రస్తావన శ్రీమద్రామాయణంలో కనిపిస్తుంది. అయోధ్య వాసులు సౌభాగ్యాలతో, అష్టైశ్వర్యంతో జీవించడానికి శ్రీరాముడు చేసిన యజ్ఞాలే హేతువులని వాల్మీకి రామాయణం స్పష్టం చేస్తున్నది. యజ్ఞాల ద్వారా దేవతలను సంతోషింపచేసి, సద్బుద్ధి, సకాల వర్షాలు, సమృద్ధి వంటివన్నీ పొందింది అయోధ్య. అలా సర్వకాల సర్వావస్థలలో సకల సంపదలతో తులతూగినదా రామరాజ్యం. వేల సంవత్సరా లుగా మానవాళికి ఆదర్శప్రాయమైనదిగా మిగిలి ఉంది. ఇదే విషయం భగవద్గీత ఇలా చెబుతున్నది,

దేవాన్భావయతానేన తే దేవా భావయంతు వః
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ।।3- 11 ।।

మీ యజ్ఞముల చేత దేవతలు ప్రీతి చెందుతారు. దేవతల, మనుషుల పరస్పర సహకారం వలన అందరికీ గొప్ప శేయస్సు/సౌభాగ్యం కలుగుతాయి.

మానవుడు చేయదగిన శ్రేష్ఠమైన కర్మలలో కూడా శ్రేష్ఠమైనది యజ్ఞం. వాటిలో శ్రేష్ఠమైనది సోమయాగం. వాల్మీకి రామాయణం ప్రకారం శ్రీరాముడు అనేక యజ్ఞాలు నిర్వహించాడు. వాటిలో ఈ మూడింటికి అవి,1. పౌణ్డరీకము 2. అశ్వమేధము 3. వాజపేయము. ఈ మూడింటినీ రాముడు అసంఖ్యాకంగా నిర్వహించినట్టు వాల్మీకం చెబుతుంది. శ్రీరాముడు తన ప్రజలు అష్టైశ్వర్యాలతో, సుభిక్షంగా ఉండేందుకు పౌణ్డరీక యాగానుష్ఠానము చేశాడు.

పౌణ్డరీకము వ్యూఢము, సమూఢము అని రెండు రకాలు. సమూఢ రీతిలో కూడా ఉన్న ఈ పౌణ్డరీక యజ్ఞాన్ని – ప్రపంచంలోని అత్యుత్తమ యజమానులలో ఒకరైన బ్రహ్మశ్రీ దెందుకూరి వేంకటేశ్వర దీక్షితులు (వ్యూఢ పౌండరీక యాజులు) దేశ సుభిక్షం, క్షేమం కోసం అనుష్ఠిస్తున్నారు. దాదాపు 40 ఏళ్లుగా ఎవరూ చేయని ఇట్టి బృహద్యాగ సంకల్పాన్ని దక్షిణామ్నాయ శ్రీ శృంగేరీ శారదా పీఠము జగద్గురువులు అనంత శ్రీ భారతీ తీర్థ మహాసన్నిధానం వారు ఆశీర్వదించారు.

కర్తా కారయితా చైవ ప్రేరకశ్చానుమోదకః ।। సుకృతే దుష్కృతే చైవ చత్వారస్సమభాగినః ।। అన్నది పెద్దలు చెప్పిన మాట.

దీనర్థం, మంచి పనిలోనైనా, చెడ్డ పనిలోనైనా – చేసేవాడు (కర్త), చేయించే వాడు (కారయిత), ప్రేరణనిచ్చేవాడు (ప్రేరక), పని బాగా ఉందని సంతసించేవాడు (అనుమోదకుడు) – ఈ నలుగురికీ సమభాగమట.

సోమయాగాలు చేసే అర్హత ఉన్న ఆహితాగ్నులు దేశంలో మొత్తం మీద 150 మంది ఉంటే గొప్ప. అటువంటి వారు చేస్తున్నప్పుడు వారికి సహకరించి కర్తృత్వం కాక ఇతర ముగ్గురిలో మన శక్తిమేరకు ఉండి పౌణ్డరీకము వంటి బృహత్సోమయాగాన్ని మించిన మంచిపని లేదు కాబట్టి, అట్టి యాగములో పాల్గొనే అవకాశం మనకు దక్కటం మన అదృష్టం. విశేష వ్యయంతో కూడుకున్నది కనుక భక్తులు సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమూఢ పౌణ్డరీక యాగము ఉగాది (సా.శ. 9.4.2024) నుండి ద్వాదశి (20.04.2024) వరకు నడుస్తుంది. 9 ఏప్రిల్ నుండి 19 ఏప్రిల్ వరకు యజ్ఞపాయసము పంచుతారు. విరాళాలు 19.04.2024 వరకూ స్వీకరిస్తారు.

యాగాన్ని దర్శించి యజ్ఞ ప్రసాదం స్వయంగా స్వీకరించదలచినవారు ఏప్రిల్ 9 నుండి 14 వరకు యజ్ఞస్థలికి విచ్చేసి స్వీకరించవచ్చునని నిర్వాహకులు చెబుతున్నారు.

– మైలవరపు సుధామోహన్

శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే
శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
గోవర్ధన్ రెడ్డి పెద్ద కుటుంబ సభ్యులు
Govardhan Reddy Pedda,
Deepa Pedda
Aarush Pedda
AadyaPedda
President, Bar Association Kukatpally Courts, 9848256282

శుద్ధబ్రహ్మ పరాత్పర రామ కాలాత్మక పరమేశ్వర రామ
శేషతల్ప సుఖ నిద్రిత రామ బ్రహ్మాద్యమర ప్రార్థిత రామ
శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
అనంతరెడ్డి న్యాయవాది,
మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు,
తెలంగాణ జలసాధన సమితి అధ్యక్షుడు ,
9440352682, 9848577771.

శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
పోలింగ్ తేది
13-05-2024
ఫిర్ ఏక్‌బార్ మోది సర్కార్
అబ్ కి బార్ చార్ సౌ పార్
కమలం పువ్వు గుర్తుకే ఓటేద్దాం!
నియోజకవర్గ
అభివృద్ధికి పాటుపడుదాం...!
బండి సంజయ్
కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు

రామతత్వమే పరిష్కారమార్గం

కాకినాడ: సామాజిక రాజకీయ రంగాలకు నేటికీ శ్రీరాముడు ఆదర్శమని, సమాజం ఎదుర్కొంటున్న సకల సమస్యల పరిష్కారానికి రామతత్వాన్ని అవగాహన చేసు కోవడమే రాజమార్గంగా ప్రముఖ సాహితీవేత్త, హనుమద్ ఉపాసకులు డా॥ అన్నదానం చిదంబర శాస్త్రి ఉద్ఘాటించారు. మార్చి 17వ తేది భారతమాత తత్వ ప్రచార వేదిక వాత్సల్యభారతి, కాకినాడ శ్రీ చల్లా జగన్నాథ శాస్త్రి కళ్యాణమండపంనందు ఏర్పాటు చేసిన అభినందన స్ఫూర్తిదాయక కార్యక్రమంలో రామమందిర నిర్మాణంలో ముఖ్యభూమికను తాను యంత్ర మంత్ర రూపంలో పాత్ర వహించగలగడం ఆ రామానుగ్రహమేనని ఆయన విశదం చేసారు. రామాయణం నేటికీ ఎందుకు ఆచరణీయం అవుతుందో సోదాహరణ పూర్వకంగా వారు వివరించారు. అన్నమో రామచంద్రా అని ఎందుకంటామో వివరిస్తూ రాముడు అన్నానికి కారణమని, సకల ప్రాణికోటికి అది ఆధార మని కాబట్టి అన్నము అవసరము ఉన్నంత కాలము రాముడి అవసరము ఉంటుందని, ఈ విషయాన్ని సూడో సెక్యులరిస్టులు, కమ్యునిస్టులు, నాస్తికులు, జాతీయవాద వ్యతిరేకులు గ్రహించాలని శాస్త్రి హితవు పలికారు. రాముడిని మనస్సులో ఊహించుకుంటేనే ఎన్నో మంచిలక్షణాలు అలవడతాయని, ఇదే విషయాన్ని

ఆయన సభకు మార్గదర్శనం చేసారు. తన ప్రసంగం కొనసాగిస్తూ అన్నదానం వాత్సల్యానంద భారతి (పూర్వాశ్రమంలో వేదాంతం సంగమేశ్వర శాస్త్రిగా ప్రసిద్ధి) అణువణువూ భరతమాతకు అర్పించారన్నారు. అటువంటి అపురూప వ్యక్తి సాంగత్యం తనకు లభించడం అదృష్టంగా భావిస్తానన్నారు. అయోధ్య టి.వి రామాయణం దర్శకులు రామానంద సాగర్ ఒక సందర్భంలో చెబుతూ రామాయణం సీరియల్‌లో నటించిన నటులు వారికి ఉన్న చెడు అలవాట్లను క్రమంగా దూరం చేసుకున్నారని తెలిపారని శాస్త్రి చెప్పారు. రామ శబ్దం ప్రాముఖ్యతను వివరిస్తూ అనేక రకాల రుగ్మతలను దూరంచేసే శక్తి శ్రీరామ శబ్దానికి ఉందని ఆధ్యాత్మిక సాహిత్య వేదాంత విష యాల కోణంలో డా॥ అన్నదానం ఆవిష్కరించారు. రామో విగ్రహవాన్ ధర్మః, మర్యాదా పురుషోత్తముడు, యజ్ఞ పురుషుడు వంటి ప్రత్యేకతలు శ్రీరామ చంద్రునికి ఉండబట్టే మిగిలిన అవతారాల కన్నా రామావతారానికి ప్రాముఖ్యత ఉందని చెబుతూ ప్రధాని నరేంద్రమోడీ రాముడిని ఆదర్శంగా చేసుకుని పరిపాలన చేస్తున్నందున ప్రపంచం భారత దేశాన్ని ఆశా కిరణంగా భావిస్తోందని తెలిపారు.

సభకు అధ్యక్షత వహించిన వాత్సల్యభారతి గౌరవాధ్యక్షులు ఎం.వి.కుమార స్వామి మాట్లాడుతూ దేశభక్తి, దైవభక్తి, మాతృభక్తిలను వివరిస్తూ పాఠశాల కేంద్రంగా చేస్తున్న కార్యక్రమా లను వివరించారు. ఆన్‌లైన్‌ద్వారా సిద్ధాంతి అరిందం కుమార్ మాట్లాడుతూ వాత్సల్య భారతి సత్సంగ్ విశేషాలను తెలిపారు. కన్యాకుమారిలోని వివేకానంద కేంద్ర తెలుగు రాష్ట్రాల సంపర్క్‌ప్రముఖ్ చెన్నాప్రగడ సదాశివ మాట్లాడుతూ సంగమేశ్వరశాస్త్రి తదనంతరం వాత్సల్యానందభారతిగా తనదైన ముద్రను వేసి ఎందరినో సమాజానికి అందించారని వివరించారు. 'యూత్ ఫర్ నేషన్' నేషనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.ఎస్.మూర్తి మాట్లా డుతూ సంగమేశ్వర శాస్త్రి (వాత్సల్యానంద భారతి స్వామి) చూపిన అమృత ప్రేమతత్వము ఆయనను చిరస్మరణీయుడిని చేసిందని చెబుతూ చెప్పారు.

వాత్సల్యభారతి గౌరవాధ్యక్షులు కుమార స్వామి, ఉపాధ్యక్షులు మద్దాలి శ్రీనివాసరావు, కార్యదర్శి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు అన్నదానం చిదంబర శాస్త్రిగారిని సన్మానించారు.

మతము మారవలెనా? - ఒక ఆలోచన! ఆవిష్కరణ సభ

భాగ్యనగర్: రాష్ట్రచింతన, ఉప్పల్‌భాగ్ ఆధ్వర్యంలో మార్చి 31న పీర్జాదిగూడ ఎమ్. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన గ్రంథావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీశ్రీశ్రీ హంపీ విరూపాక్ష పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి వరిగొండ కాంతారావు రచించిన మతము మారవలెనా? – ఒక ఆలోచన! అన్న గ్రంథాన్ని ఆవిష్కరించారు. గ్రంథావలోకనం చేసిన డా॥ వడ్డి విజయ సారథి ఈ గ్రంథంలో పాశ్చాత్య మతానుయాయుల ఆచార వ్యవహారాలు బాగుగా చర్చింపబడినవని ఆ వెలుగులో చూచినప్పుడు హిందూ మతం గొప్పదనం తెలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న శ్రీ అరబిందో సొసైటీ ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ ములుగు శ్రీనివాస్ మాట్లా డుతూ మతాంతరీకరణతో భారతదేశాన్ని బలహీన పర చాలని చూచేవారి ప్రణా ళిక లను అర్థం చేసికొని, వాని నెదురించి నిర్వీర్యం చేయాలని, ఈ



విషయంలో వరిగొండ కాంతారావు రచించిన పుస్తకం తోడ్పాటునిస్తుందని చెప్పారు. మరొక ఆత్మీయ అతిథి, విశ్రాంత రేల్వే సీనియర్ డివిజనల్ సేఫ్టీ మేనేజరు, లంక శివరామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ మతము మారదలచుకొన్నవారు ఈ పుస్తకాన్ని కచ్చితంగా చదివితీరాలని అన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మహమ్మదీయ, క్రైస్తవ మతాలవారు మతాంతరీ కరణల నిమిత్తము అనుసరించే కపటోపాయాలను వివరించారు.

శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వామి వారు తమ అనుగ్రహ భాషణంలో ఇలా చెప్పారు. భరతమాత, గోమాత, గాయత్రీమాత ఈ ముువ్వురి మాతల ఆనందమే భారతీయులకు శాంతిని, సౌఖ్యాన్ని సమకూరు స్తుందని, మన దేశాన్ని పాలించిన ఆంగ్లేయులు మన మనస్సును ఈ మూడింటినుండి చెదరగొట్టారని, మనమంతా మరల ఈ ముగ్గురు మాతలను దృఢ సంకల్పంతో ఆరాధించి భరత జాతికి పూర్వ వైభవాన్ని సమకూర్చి పెట్టాలని చెప్పారు. ఇటువంటి పుస్తకాలు మరెన్నింటినో వరిగొండ కాంతారావు రచించాలని ఆశీర్వదించారు. నూట యాభైకి పైబడిన సంఖ్యలో స్వయంసేవకులు, సాహితీవేత్తలు హాజరైన సభకు రాష్ట్ర చింతన సంయోజక్ అంకం శంకర్ అధ్యక్షత వహించారు.

అపురూప ప్రయోగం మోద కొండమ్మ స్వాస్థ్య సేవా యాత్ర

పాడేరు :

నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్

వైద్య విద్యార్థులను గిరిజనుల దగ్గరకు తీసుకు వెళ్లడానికి ఉద్దేశించిన అపురూప కార్యక్రమమే శ్రీ మోద కొండమ్మ స్వాస్థ్యసేవాయాత్ర. అల్లోపతీ వైద్యులలో జాతీయభావాన్ని, క్రమశిక్షణను, సామాజికబంధాన్ని, నిస్వార్థ సేవను నిర్మాణం చేయ డానికి ఉద్దేశించిన కార్యక్రమం. వైద్య రంగంలో ప్రాచీన భారతీయ విలువల పట్ల గౌరవం, సాను స్వాగతించారు.

29 వ తేదీన సాయంత్రం 4 గంటలకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్, డా. వనజ (నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్), మచ్చుమ్మ, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారతీయ సంప్ర దాయాన్ని , ఋషి పరంపరను గురించి, “సర్వే భవంతు సుఖినః” శ్లోకం గురించి, డాక్టర్ గిరిజన సంస్కృతి గురించి జనార్దన్ వివరించారు. అరణ్యం మంత్రి, వనవాసి కల్యాణ్ ఆశ్రమం), డా సాగర్ కుల్లాయి రెడ్డి (ప్రాంత సంయోజక్, NMO ఆంధ్ర) పాల్గొన్నారు.

విద్యార్థులు వారి అనుభవాలు పంచుకున్నారు. గిరిజన సాంస్కృతిక సంప్రదాయం ద్వారా మేము చాలా నేర్చుకున్నామని, గిరిజనుల అతిథి మర్యాద అపురూపమని, తమకు మంచి సౌకర్యాలు ఇచ్చి వారు ఇంటి బయటపడుకున్నారని విద్యార్థులు

భూతితో కూడిన వైఖరిని పెంపొందిస్తుంది. వైద్య విద్యార్థులకు పరిశోధన పట్ల ఆసక్తి పెంచుతుంది. ఆరోగ్యం, వ్యాధి నివారణ రంగంలో పనిచేస్తున్న సంస్థలతో వారిని అనుసంధానం చేస్తుంది. స్వాస్థ్యసేవా, రాష్ట్రసేవా నినాదంతో ప్రజలందరిలో ఆరోగ్యం మెరుగు పరిచినప్పుడే జాతి ఆరోగ్య స్థితి మెరుగు పడుతుంది. వీటన్నిటి సమ్మేళనమే శ్రీమోద కొండమ్మ స్వాస్థ్య సేవా యాత్ర. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ శాఖ దీనిని నిర్వహించింది.

ఇందుకోసం గత డిసెంబర్ నుంచి విజయ నగరం విభాగ్ నుంచి గుంటూరు విభాగ్ వరకు వైద్య విద్యార్థులను సంప్రతించారు. వనవాసి కల్యాణ ఆశ్రమం , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విశాఖ విభాగ్ సహకారంతో పాడేరు, అల్లూరి సీతా రామరాజు జిల్లా కేంద్రంగా మార్చి 29 నుంచి 31 వరకు శ్రీ మోద కొండమ్మ స్వాస్థ్య సేవా యాత్ర ఆరంభించారు.

20 కళాశాల నుంచి దాదాపు 580 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 150 మందిని ఎంపిక చేశారు. కాగా,14 కళాశాల నుంచి 113 మంది హాజరయ్యారు. 61 మంది అబ్బాయిలు, 52 మంది అమ్మాయిలు ఉన్నారు.విశాఖ నుంచి పాడేరు చేరుకున్న వారికి భారతీయ విద్యా కేంద్రం వారి అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర వసతి గృహంలో వసతి ఏర్పాటు చేశారు. వారిని గిరిజన సంప్రదాయం ప్రకారం కాళ్లు కడిగి, బొట్టుపెట్టి

అంటే రణం లేని ప్రదేశమని, సాంస్కృతిక విజ్ఞానికి నిలయమని తెలిపారు. సేవచేయడం మన కర్తవ్యం అని , నేషనల్ ఇంటెగ్రిటీ వలనే మన దేశ ఔన్నత్యాన్ని కాపాడొచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులు 6 రకాల ఆటలు ఆడారు. గిరిజన సాంస్కృతిక థింసా నృత్యం ప్రదర్శించారు. వైద్య విద్యార్థులను, స్వాతంత్రయోధుల పేర్లతో వివిధ కళాశాల వారిని 5 మంది చొప్పున 26 బృందాలుగా విభజించారు.

సేవా కార్యక్రమాల కోసం ఎంపిక చేసిన 26 గ్రామాలకు 30 వ తేదీన విద్యార్థులను పంపారు. వారిని గ్రామాలలో గిరిజన సంప్ర దాయంతో స్వాగతించారు. వైద్య విద్యార్థులు, వైద్యులతో అక్కడున్న వారిని పరీక్షించి అవసరమైన మందులతో పాటు వాటి నివారణ అంశాలు గిరిజనులకు విద్యార్థులు తెలియచేశారు. రక్తహీనత, చర్మవ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం, నరాల బలహీనత సంబందించిన వ్యాధుల అధికంగా కనిపించాయి. sickle cell aneamia అనే అరుదైన రక్త వ్యాధి కూడా ఎక్కువగానే ఉంది.

వైద్య శిబిరం అనంతరం విద్యార్థులు గ్రామ సందర్శన చేసి ప్రజలతో మాట్లాడారు. తరువాత రోజు ఉదయం కొన్ని గ్రామాలలో అవసరం ఉన్న చోట వైద్య శిబిరాలు నిర్వహించారు.

ఆర్.ఎస్.ఎస్. ప్రాంతప్రచారక్ విజయాదిత్య, డా. కుమార్ అంగడి (అఖిల భారత సహ సంఘటన మంత్రి NMO), విద్యాధర్ (ప్రాంత సంఘటన తెలిపారు. స్పందన మేము అనుకున్న దానికంటే గిరిజనుల స్పందన 100% ఎక్కువ ఉందని తెలిపారు.

ఈ దేశ అభివృద్ధి కోసం మీరు అందరూ ఇలా రావడం చాలా సంతోషమని విజయాదిత్య ముగింపు సమావేశంలో తెలిపారు. గణాంకాల ప్రకారం దేశంలో అంధులు, అధిక టి.బి., అధిక క్యాన్సర్, అధిక షుగరు రోగులు ఎక్కువ ఉన్నారు. నన్ను కని పెంచిన నా దేశం ఇలా వైద్య గణాంకాలలో వెనుకపడి ఉంటే నేను ఏ విధంగా గర్వపడాలి అని ప్రతి వైద్య విద్యార్థి ఆలోచించాలని విజయాదిత్య కోరారు.

శక్తిమంతమైన భారతదేశం అంటే ఆరోగ్య భారతదేశం అని అది మీ ద్వారానే సాధ్యం అని విద్యార్థులను ఉద్దేశించి వారు అన్నారు. అందుకోసం సంకల్పించాలని పిలుపునిచ్చారు. దేశాన్ని, అధ్యయనం చేయడం ఈ యాత్రలో ఒక భాగం, కేవలం వైద్య సేవా అనే కాదు. దేశాన్ని, సమాజాన్ని అధ్యయనం చేయాలని అన్నారు. We for healthy Bharath, వైద్య విద్యార్థులలో ఆత్మ స్థయిర్యం నింపాలని సంస్థ ప్రయత్నిస్తోందని తెలిపారు. Family adoption programme ద్వారా NMO పనిచేస్తుంది. ఈ దేశం మిమల్ని శాశ్వతంగా గుండెల్లో పెట్టుకునే విధంగా మీరు పనిచేస్తారని భావిస్తున్నానని విజయాదిత్య వారిని అభినందించారు. ★

తెలుసుకుందాం

శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయం గొల్లల మామిడాడ

ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా గొల్లల మామిడాడ గ్రామంలో వెలసిన సూర్య దేవాలయమిది. 1920లో గొల్లల మామిడాడ జమీందారు కొవ్వూరి బసివి రెడ్డి 16 ఎకరాల పచ్చిక పొలాలు, కొబ్బరి చెట్ల మధ్య నిర్మించారు. ఈ ఆలయం కాకినాడ నుండి 20 కిలో మీటర్లు, రాజమండ్రి నుండి 58 కి.మీ. దూరంలో ఉంటుంది. రథ సప్తమి, ఏకాదశి వంటి పర్వదినాల్లో ఈ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

కథ | బంగారు పలక

కృపానందుడు అనే జమీందారు ఉండేవాడు.

కృపానందుడికి చాలా కాలం వరకు సంతానం కలగలేదు. అందుకోసం ఎన్నో పూజలు, వ్రతాలు చేశాడు.

చివరకు ఎంతోకాలం తర్వాత అతనికి ఒక పుత్రుడు జన్మించాడు. ఆ బాలుడికి యశస్వి అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగాడు.

ఒకనాడు బాలుడికి అక్షరాభ్యాసం చేయ సంకల్పించి, స్వర్ణకారుడిని పిలిపించాడు కృపానందుడు, చుట్టూ వజ్రాలు పొదిగిన అత్యంత ఖరీదైన బంగారు పలక, వెండి బలపం తయారుచేసి తీసుకు రావలసిందిగా ఆదేశించాడు. స్వర్ణకారుడు ధగధగలాడిపోయే బంగారు పలక, వెండి బలపం తయారుచేసి తీసుకువచ్చాడు.

జమీందారు బాలుడిని అక్షరాభ్యాసానికి సిద్ధం చేసి బంగారు పలక మీద వెండి బలపంతో దిద్దించబోగా ఒక్క అక్షరం కూడా పడలేదు.

దాంతో బాలుడు ఏడవడం మొదలు పెట్టాడు. బాలుడిని బుజ్జగించడం కోసం కృపానందుడు అతడిని గుర్రం బండి మీద పురవీధులలోకి వ్యాహ్యాళికి తీసుకువెళ్లాడు.

ఒక చెట్టుకింద కొందరు పేదబాలురు కూర్చుని రాతి పలక మీద సున్నపురాయి బలపంతో అక్షరాలు దిద్దుకుంటున్నారు. అది చూడగానే యశస్వి తనకు కూడా అలాంటి పలక, బలపం కావాలని మారాం చేశాడు.

కృపానందుడు వెంటనే సేవకుడిని పంపి అలాంటి పలక, బలపం తెప్పించాడు.

బాలుడు ఎంతో సంబరపడిపోతూ పలక మీద బలపంతో చిన్న చిన్న గీతలు గీస్తూ ఆనందించాడు. కుమారుని సంబరం చూసి జమీందారు కూడా ఎంతో సంతోషించాడు.

మర్నాడు ఆ రాతి పలక మీద సన్నపురాయి బలపంతో బాలుడికి అక్షరాలు దిద్దించాడు.

శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
ఫిర్ ఏక్‌బార్ మోది సర్కార్
తెలుగుదేశం, జనసేన బలపరచిన విజయవాడ పశ్చిమ
అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నన్ను,
భారతీయ జనతాపార్టీ, జనసేన బలపరచిన
తెలుగుదేశం పార్టీ విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి
శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని)
గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించ ప్రార్థన.
సైకిల్, కమలం పువ్వు గుర్తుకే ఓటేద్దాం!
నియోజకవర్గ
అభివృద్ధికి పాటుపడుదాం...!
పోలింగ్ తేది
13 మే 2024
మీ
యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి)

వారఫలాలు

15 ఏప్రిల్ 21, 2024

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

దీర్ఘకాలంగా వేధిస్తున్న కొన్ని సమస్యలు తీరిఊరట చెందుతారు. మీ ప్రతిపాదనలు, నిర్ణయాలు కుటుంబసభ్యులు ఆమోదిస్తారు. ముఖ్య కార్యక్రమాలు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. విద్యార్థులు, నిరుద్యోగులు అనుకూల ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగులకు మంచి గుర్తింపు. కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు పట్టింది బంగారమే. 18,19 తేదీల్లో అనుకోని ఖర్చులు. ఆరోగ్య, కుటుంబసమస్యలు. ఆదిత్య హృదయం పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆదాయం కొంత నిరాశ కలిగిస్తుంది. దూర ప్రయాణాలు సంభవం. స్నేహితులు, బంధువులతో అకారణంగా తగాదాలు. కష్టానికి తగ్గ ఫలితం కనిపించదు. విలువైన వస్తువులు, వాహనాలు జాగ్రత్తగా చూసు కోండి. రాజకీయవేత్తలు, కళా కారులకు అవకాశాలు చేజారతాయి. రచయితలు, క్రీడాకారులు కొంత నిరుత్సాహం చెందుతారు. 19,20 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలాభం. దేవీఖడ్గమాల పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. కొన్ని బాకీలు అందుతాయి. ఆస్తివివాదాలను నేర్పుగా పరిష్కరించుకుంటారు. వ్యాపారస్తులు ఆశించిన విధంగా లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులు విధినిర్వహణలో ప్రశంసలు అందుకుం టారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు మరింత ఉత్సాహం. క్రీడాకారులు విశేష గుర్తింపు పొందు తారు. 20,21 తేదీల్లో లేనిపోని వివాదాలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొత్త పనులు ప్రారంభిస్తారు. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. గృహ నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారస్తులకు లాభాలు దక్కుతాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో పొరపాట్లు సరిదిద్దుకుని ముందుకు సాగుతారు. పారిశ్రామిక వేత్తలకు విదేశీపర్యటనలు. కళాకారులు, పరిశోధకులు, రచయితల యత్నాలు సఫలం. 15,16 తేదీల్లో వృథా ఖర్చులు. ప్రయాణాలు. అనారోగ్యం.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆకస్మిక ధనలాభం. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇళ్లు, స్థలాలు సమకూర్చుకుంటారు. ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. నేర్పుగా ఆస్తి వివాదాలనుంచి బయటపడతారు. ఉద్యోగులకు హోదాలు. రాజకీయ, పారిశ్రామికవేత్తలకు అనుకోని విదేశీ పర్యటనలు. కళాకారులు, రచయితలు సత్తా చాటుకుంటారు. 19,20 తేదీల్లో కుటుంబసభ్యులతో తగాదాలు. గణేశాష్టకం పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఏ కార్యక్రమం చేపట్టినా విజయమే. గృహ నిర్మాణయత్నాలు సాగిస్తారు. విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు లభించవచ్చు. ఆస్తి వివాదాల పరిష్కారం. వ్యాపారస్తులకు ఊహించని లాభాలు అందుతాయి. పారిశ్రామికవర్గాలవారు అనుకున్నది సాధిస్తారు. క్రీడాకారులు, రచయితలు, కళాకారులకు పట్టింది బంగారమే. 18,19 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. శివస్తుతి మంచిది.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

వివాదాలు ఎదురైనా నేర్పుగా అధిగమిస్తారు. ఆదాయానికి లోటుఉండదు. వాహనాలు, భూములు కొంటారు. విద్యార్థులు ఆశించిన ఫలితాలు పొందుతారు. ఉద్యోగులకు కొత్త హెూదాలు దక్కవచ్చు. రాజకీయ, పారిశ్రామిక వేత్తల యత్నాలు సఫలం. కళాకారులు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 16,17 తేదీల్లో ఆస్తి వివాదాలు. అనారోగ్యం. అన్నపూర్ణాష్టకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

మీ కష్టం ఫలించే సమయం. రావలసిన బాకీలు అంది అవసరాలు తీరతాయి. ఆప్తుల నుంచి కీలక సమాచారంరాగలదు. ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలం. విద్యార్థులు, నిరుద్యోగులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. వ్యాపారస్తులకు లాభనష్టాలు సమానంగాఉంటాయి. పారిశ్రామిక, రాజకీయ వేత్తలకు విదేశీ పర్యటనలు. 15,16 మానసిక అశాంతి. ఆంజనేయ దండకం పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

నిరుద్యోగులు, విద్యార్థులు ఆశించిన ఫలితాలు సాధిస్తారు. రాబడి ఆశించినంతగా ఉండి అవసరాలు తీరతాయి. కాంట్రాక్టులు దక్కవచ్చు. వ్యాపారులు పెట్టుబడులకు లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు దక్కుతాయి. రాజకీయ వేత్తలు, కళాకారులకు సన్మానాలు. క్రీడాకారులు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 18,19 లలో ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

శ్రమపడ్డా ఫలితం కనిపిస్తుంది. చేపట్టిన కార్యక్రమాలు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. నూతన విద్య, ఉద్యోగావకాశాలు పొందుతారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు పైస్థాయివారినుంచి సమస్యలు తీరతాయి. కళాకారులు, పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం. రచయితలు, పరిశోధకులకు అవార్డులు దక్కే అవ కాశం. 20,21లలో శుభవార్తలు. వాహనయోగం. మంచిది.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాల వైపు పయనిస్తారు. కుటుంబంలో శుభకార్యాల నిర్వహణ. ఇంటి నిర్మాణయత్నాలు కొలిక్కి వస్తాయి. వ్యాపారులు మరింతగా లాభాలు పొందుతారు. ఉద్యోగులకు ఉన్నత స్థితి. పారిశ్రామిక వేత్తలకు అరుదైన ఆహ్వానాలు రాగలవు. 15,16 తేదీల్లో ఆస్తి వివాదాలు. శారీరక రుగ్మతలు. వేంకటేశ్వరస్వామి స్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

రాబడి ఆశాజనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు. ఆస్తుల విషయంలో కొత్త ఒప్పందాలు చేసుకుంటారు. వివాహ,ఉద్యోగయత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారస్తులకు పెట్టుబడులు అందుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు ఆహ్వానాలు అందుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు అవార్డులులభిస్తాయి. 15,16 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

పదరసం-460

1			2			3	4		5
					6				
7	8				9	10		11	
			12						
13					14		15		
			16						
17		18					19		
		20		21					22
							23		
24									

ఆధారాలు

అడ్డం

1) ఔరా (5)

3) అటునుంచి బయట (4)

7) మహాధనవంతుడు (4)

9) ఏడుకొండలస్వామికి సువాసనద్రవ్యం ఇచ్చే జంతువు (5)

12) జబ్బుచేస్తే వేసుకునే గోలి (2)

13) వాక్చాతుర్యం కలవాడే తడబడ్డాడు (4)

15) తృప్తి (3)

16) వినతులు సవ్యంగా రాలేదు (4)

17) నియంత్రణ (3)

19) కేరళ రాష్ట్రపు ప్రముఖ తినుబండారం (2)

20) పెళ్లిళ్లలో ఇది నిషేధం (4)

23) ఒకప్పుడు దీనిలో ఉప్పు ఉంచేవారు, పులుసు మొదలైనవి పెట్టేవారు కూడా (3)

24) ఒక సంఘటనని రకరకాలుగా కల్పించి చెప్పడం (8)

నిలువు

1) ఆంధ్రా ఊటీ (3)

2) వీటిని వినకూడదంటారు (6)

4) మట్టిని తవ్వే సాధనం (3)

5) శాకాహారమేగానీ ప్రసాదాలలో వాడరు (3)

6) ఆశ్రయం (2)

8) ముక్కుకు పెట్టుకునే అడ్డబాస (3)

10) అతిసన్నని పొడి (2)

11) లోభి (5)

13) ఒక పార్టీ లేదా సంఘానికి పనిచేసేవాడు (4)

14) తమిళనాడు రాజధానికి ఉన్న ఒకప్పటి తెలుగుపేరు (4)

18) పైకొచ్చిన వేగం (4)

19) నదులకు 12 ఏళ్లకు ఒకసారి వచ్చేవి (4)

21) చెక్క, ఇంటి నిర్మాణానికి వాడేది (3)

22) రొట్టె (3

పదరసం - 459 సమాధానాలు

రే1	చీ	క2	టి			హు3	కుం4		గ5
యిం		న్యా		ష6	మి7		భ8	ళ్ళు9	న
బ		కు			న			ము	
వ10	ర్థ	మా	న	మ11	హా	వీ12	రు	డు	
ళ్ళు		రి		య		ర		మూ13	గ14
	గో15			స16	త	మ	తం		డ
క్యం17	వా	త18	ర	భ		ర		సం19	ప
లా		ల			పా20	ణం	రా	య	
		ప21	రా	చి22	కం			మ	
క23	రు	డు		క్కు		మ24	హా	నం	ది

శ్రీ క్రోధి నామ
సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
ఫిర్ ఏక్‌బార్ మోది సర్కార్
అబ్ కి బార్ 400 పార్
కమలం పువ్వు గుర్తుకే ఓటేద్దాం!
నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుదాం...!
ఓటు హక్కుగల ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును
వినియోగించుకొని దేశ అభివృద్ధిలో పాలుపంచుకోగలరు
పోలింగ్ తేది: 13-05-2024
సికింద్రాబాద్ లోక్‌సభ
నియోజకవర్గ బిజెపి అభ్యర్థి
జి.కిషన్ రెడ్డి MP సికింద్రాబాద్
కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మరియు
ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రి



శ్రీ క్రోధి నామ సంవత్సర
శ్రీరామ నవమి
శుభాకాంక్షలు
శ్రీరామ రామ రామేతి
రమేరామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం
రామనామ వరాననే
ఫిర్ ఏక్‌బార్ మోది సర్కార్
అబ్ కి బార్ చార్ సౌ పార్
కమలం పువ్వు గుర్తుకే ఓటేద్దాం!
నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుదాం...!
పోలింగ్ తేది
13-05-2024
వినోద్ రావు
ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 23